
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి


సంచిక 10 – సంచిక 4
**ఆగస్టు 2009**

**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

యుగశక్తి గాయత్రి మాసపత్రిక
అందనివారు 9652862601
నంబరుకు సంప్రదించగలరు.

Please send drafts in favour of
**SRI VEDAMATA GAYATRI TUST BUSINESS DIVISION, HYDERABAD**

సలహాలు, సూచనలకు
**శ్రీ అశ్విని సుబ్బారావు**
**040-23700722**



## జాతీయత - కర్తవ్యం

ఏ జాతికైనా ప్రతి ప్రాణి యొక్క అస్తిత్వమే జాతీయత. ఈ రోజున మనం ఉన్నాం. 'రేపు' అనేది రాబోయే తరానిది. 'మనం' అన్న పదంలో 'మనది' అన్న భావం నిక్షిప్తమై ఉంటుంది. 'మనది' అన్న భావం చాలా విశాలమయింది. దానికి హద్దులు లేవు. ఉండకూడదు. దేశానికి సంబంధించిన భూమి, భూమిపై ఉన్న నదులు, పర్వతాలు, సెలయేర్లు, విశాలమైన సముద్రం, చిన్న చిన్న సరోవరాలు, దట్టమైన అడవులు, సుందరమైన ఉద్యానవనాలు, వీటిల్లో విహారం చేసే చిన్న – పెద్ద ప్రాణులు, అడవుల్లో ఉన్న సకల వృక్ష సంపద – వనస్పతులు – జంతువులు, పైన ఉన్న ఆకాశం, ఆకాశంలో ఎగిరే పక్షులు, నదులలో ఉండే నీరు – జలచరాలు మొదలైనవన్నీ జాతీయ సంపదలే. అంతేకాదు. దేశంలో ఉన్న రాష్ట్రాలు, పట్టణాలు, గ్రామాలు, భాషలు, మాట్లాడే తీరుతెన్నులు, సంప్రదాయపు రీతి – రివాజులు, ధర్మము – మత ఆచారపరంపరలు మొదలైనవన్నీ దేశం నుండి విడదీయరాని అంశాలే. వీటిని గురించి 'మనది' అని ఆలోచించడమే జాతీయభావన.

ప్రపంచంలో ఏ దేశంలో అయినా జాతీయతను మించిన అంశం మరొక్కటి ఉండదు. "వందేభారతమాతరమ్" అన్న నినాదంలోనే భారతీయుల గుర్తింపు ఇమిడి ఉంది. ఏ జాతికైనా జన్మభూమి జననితో సమానం. మనందరినీ ఒక్కటిగా కట్టిపడేసేది జాతీయజెండా. మనకు ప్రియాతి ప్రియమైన మూడు రంగుల జెండా. ఆ జెండా గౌరవమే మన గౌరవం. జాతీయ జెండా యొక్క పేరు ప్రతిష్ఠలే మన పేరు ప్రతిష్ఠలు. జాతీయ భావాలను పెంపొందించే గౌరవ చిహ్నాలు, ఆచారాలు, శ్రద్ధా కేంద్రాలు మొదలైన వాటిని అన్నింటిని కలిసి కట్టుగా రక్షించుకోవడంలోనే జాతీయత ప్రతిబింబిస్తుంది. అదే సమాజ ఉన్నతికి పరమపద సోపాన పటము. అప్పుడే దేశం ఐకమత్యంగా, ఐశ్వర్యవంతంగా అఖండతను సాధించుకోగలుగుతుంది.

జాతీయతను కాపాడుకోవడం జాతిలో జన్మించిన ప్రతి ఒక్కరి యొక్క ప్రధాన కర్తవ్యం. ఇది కేవలం హిందువులకే కాదు. భారతదేశవాసులైన ముస్లిములు, సిఖ్ఖులు, క్రైస్తవులు అందరు సమాన బాధ్యత వహించాల్సి ఉంటుంది. జాతీయతలో కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, భాషలకు స్థానం ఉండదు. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఒకటే క్షేత్రం. ఒకే శరీరం. ఈ శరీరంలో ఎక్కడ ముల్లు గుచ్చినా దేశ ప్రజలందరు బాధను అనుభవించాల్సి వస్తుంది. మన శరీరంపై చూపించే శ్రద్ధనే దేశం మీద చూపించాల్సి ఉంటుంది.

**15-8-1947** న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. మూడు వన్నెల ముచ్చటైన జెండా మురిపెంగా ఎగిరింది. మనందరం మన జెండాను ప్రాణప్రదంగా చూచుకుంటామని ప్రతిన బూనడం, రక్షించుకోవడం మనందరి కర్తవ్యం.

**మంచివాడు బానిసగా ఉన్నా స్వతంత్రుడే.**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** ఆనందాల గని అంతరాత్మ 1
2. **విషయసూచిక** 2
3. **సద్గురు వచనామృతం :** దుష్కర్మ యొక్క ఫలితాన్ని అనుభవించవలసిందే 2
4. **వేదమంత్రం :** నిజమైన ఆధ్యాత్మికత 3
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం** 4
జపం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?
6. **పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ధి :** 5
2400 కోట్ల మంత్రజపం
7. **వర్తమాన భారతం :** నాయకత్వ సంక్షోభంలో దేశం 6
8. ధారావాహిక : **పరమేశ్వరుని చిరునామా-3** 8
మానవ శరీరం - మహాద్భుతం
9. **సంస్కృతీ మూర్తి పరమపూజ్యగురుదేవులు :** 11
సాంస్కృతిక అనుష్ఠానం - మహాపూర్ణాహుతి
10. **ధారావాహిక : హనుమత్‌కథామృతం-16** 12
ధ్యానమగ్నుడైన బాల సూర్య హనుమాన్
11. **బోధకథ :** శ్రమ శక్తి ఆరాధన 13
12. **మనం - మన ఆరోగ్యం :** 14
ఆయుర్వేద పరిశోధన-పునరుజ్జీవన ఆవశ్యకత
13. **ధారావాహిక : భక్తిగాథ-21 :** 16
స్మరణ - సమర్పణ - సంలీనం
14. **తత్వచింతన :** శరీరం అత్యల్పం-గుణ సంపద అనల్పం 18
15. ధారావాహిక : **నా స్మృతిపథంలో గురుదేవులు-35** 21
గురు సత్తాలో మాతృ శక్తి విలీనం
16. **జీవించే కళ :** ధర్మమే మానవుని ఉన్నతికి సోపానం 23
17. ధారావాహిక : **దివ్యజీవన దర్శనం-64** 25
భవిత కోసం ప్రతీక్ష
18. **పరమ పూజ్య గురుదేవుల అమృతవాణి :** 28
సంస్కృతీ సీతను తిరిగి తెచ్చుకోవాలి
19. **తెలుగు యోగులు :** బృందావన యోగులు- 31
రాధా సాధన-శ్రీరాధికా ప్రసాద్ మహారాజ్
20. **ప్రత్యేక వ్యాసం :** శ్రీ కృష్ణ జన్మాష్టమి-పూజాక్రమము 34
21. **ఆచరణలో అధ్యాత్మ :** జీవితాన్ని ఆటగా మలచుకుందాం 36
22. **మీలో కూడా శక్తి ఉన్నది** 37
23. ధారావాహిక : **దేవ సంస్కృతీ సౌరభం-26** 39
భారతీయ సంస్కృతిలో సామాజిక దృష్టి-వర్ణాశ్రమ ధర్మాలు
24. **నా వారితో నా మాట :** 42
సామూహిక జపం-ఒక అమోఘ ప్రయోగం
25. **ఏ పుస్తకంలో ఏమున్నది?** 44
26. **ప్రకటన** 45
27. **వార్తలు** 47




# సద్గురు వచనామృతం

## దుష్కర్మ యొక్క ఫలితాన్ని అనుభవించవలసిందే

ప్రపంచంలో మనిషి తన క్షణిక సుఖం కోసం రకరకాల దుష్ట కర్మలు చేసేస్తూ ఉంటాడు. ఆ దుష్ట కర్మల ఫలితాలను చివరికి తాను ఎలా అనుభవించవలసి వస్తుందో అతడికి తెలియదు. మనిషి పలు విధాలయిన కష్టాలను అనుభవించవలసి వస్తుంది. సమాజము, దేశ కాల పరిస్థితులు అందుకు కొంత వరకు కారణాలు కావచ్చు. అయితే అతడు తన దుష్ట కర్మల ఫలితాలనే అనుభవిస్తాడు. మానవ శరీరం దుఃఖాలను అనుభవించడానికి ఇవ్వబడలేదు. ఆత్మ కళ్యాణం కోసం కర్మలు చేయడానికి ముఖ్య సాధనం అది. కనుక మన ప్రవృత్తి కూడా ఆత్మ కళ్యాణం అనే లక్ష్యాన్ని చేరడానికి వినియోగపడాలి. చెడ్డ స్వభావానికీ, చెడ్డ పనులకూ దూరంగా ఉండడం ఇందుకు అవసరం అవుతోంది.

సాధనాలను సంపాదించి, ఆత్మ వివేకాన్ని సద్వినియోగ పరచితే, వాటిని మంచి పనులకు ప్రయోగిస్తే - ఆత్మ తన శక్తులను పెంచుకుంటుంది; అనుకూల సాధనాలను నిర్మిస్తూ ఉంటుంది; చివరికి ప్రారబ్ధం నుండి విముక్తి పొంది, పూర్తిగా ఉన్నతిని పొందుతుంది.

సత్యం యొక్క ముఖం మూసి వేయబడి ఉంది. ఓ సత్య శోధకుడా! దానిని పొందాలంటే, నీవు ఆ మూతను తెరవవలసి ఉంటుంది. ఆత్మజ్ఞానం చెడ్డ పనుల చేత అలా మూసివేయబడి ఉంది. దాన్ని పొందాలంటే - ఆ చెడ్డ పనులను మానివేయాలి.

★★★

## పండుగలు

**ఆగస్టు 2009**

| | |
|---|---|
| 05-08-09 | రాఖీపౌర్ణమి |
| 14-08-09 | జన్మాష్టమి |
| 15-08-09 | స్వాతంత్ర్య దినోత్సవం |
| 23-08-09 | వినాయక చవితి |

**సెప్టెంబర్ 2009**

| | |
|---|---|
| 08-09-09 | మాతా భగవతీ శర్మ జయంతి |
| 16-09-09 | పండిత శ్రీరామ శర్మ ఆచార్య జయంతి |
| 28-09-09 | విజయదశమి |

**చెడ్డవాడు రాజైనా బానిసే.**

వేద మంత్రం

# నిజమైన ఆధ్యాత్మికత

**నీచైః పద్యన్తామధరే భవన్తు యే నః సరి మఘవాని పృతన్యాన్ ।**

**క్షిణామి బ్రహ్మణామిత్రాను న్నయామి స్వాన్ హమ్ ॥**

**(అధర్వవేద 3/19/3)**

**భావార్థం :** నేను బ్రాహ్మణుడను. స్వయంగా జ్ఞాన సంపన్నుడనై, మనో నిగ్రహ పూర్వకంగా నా యజమానులను ఉన్నతులుగా చేయుటకు ప్రయత్నం చేస్తూ ఉంటాను. వారు దుష్కర్మలవైపు, మరలకుండా, ఇతరులకు అహితం చేయకుండా నేను సక్రియంగా ఉంటాను.

**సందేశం :** ప్రపంచాన్ని ఉన్నతివైపు పయనించేటట్లు చేయుట, తేజస్వి-వర్చస్విగా చేయుట, దాని ననుసరించి సుఖ-సమృద్ధి వాతావరణాన్ని నిర్మించుట బ్రాహ్మణుల కర్తవ్యం. ఎవరు దీనిని తెలుసుకున్నారో, అర్థం చేసుకున్నారో వారే నిజమైన విద్వాంసులు, సమాజ నిష్ఠులని చెప్పవచ్చు. అటువంటివారు స్వాధ్యాయం, సత్సంగాలలో నిర్లక్ష్యం చేయరు. తాము ఆర్జించిన జ్ఞానాన్ని నిరంతరం దానం చేస్తూ సమాజం ఉన్నతి కొరకు తపస్సు, సాధనలలో లీనమై ఉంటారు. సరియైన దానిని తెలుసుకొనుట, తెలుసుకొన్న దానిని ప్రాప్తించుకొనుటకు మార్గం వెదుకుట, మార్గం వెదికన తర్వాత ఆ మార్గంలో తపస్సు, సాధనా భావంతో చరించుట, ఇదే మానవత్వాన్ని సంపాదించడానికి ఉపాయం.

ఈ మార్గాన్ని అనుసరించుట బ్రాహ్మణుల కర్తవ్యం. ఇందుకు మనో నిగ్రహం, ఇంద్రియ సంయమాన్ని అనుసరించాలి. మానసిక సంతులనం చాలా ముఖ్యం. జనుల ప్రవృత్తి దుష్కర్మల వైపు పోతుంది. ఒకసారి దానిలో చిక్కుకుంటే తేలికగా వదలిపెట్టలేరు. వారికి నచ్చచెప్పి సరియైన మార్గంలో ప్రేరేపించుట కష్టసాధ్యం. అజ్ఞానుల విరోధాన్ని ఎదుర్కోవాలి, బాధలు పడాలి. ఆ స్థితిలో ధైర్యపూర్వకంగా రాగద్వేష రహితంగా, తొందరపాటు లేకుండా విద్వాంసులు సత్ప్రవృత్తుల ప్రచారం, ప్రసారం కొరకు నిరంతరం సంలగ్నం కావాలి.

సత్సంగం, స్వాధ్యాయం ద్వారా తన జ్ఞానం యొక్క శ్రేష్ఠత పెంచుకొనేందుకు నిరంతరం కృషి చేయాలి. గుణవంతుని సంపర్కంలోకి వచ్చిన వారికి సద్గుణాలు, సద్ జ్ఞానం, సత్ప్రవృత్తులు అలవడుతాయి. విద్వాంసులు నిరంతర జ్ఞాన సాధనలో ఉంటారు. మానవ సమాజం యొక్క విషమ సమస్యల, జీవన నిర్మాణ సిద్ధాంతాల, ఆత్మ విద్య, బ్రహ్మ విద్యల గురించి తగిన సమాచారం సేకరించుకుంటారు. వారు విద్య-అవిద్య భేదాన్ని స్పష్టంగా తెలుసుకొంటారు. స్వయంగా జ్ఞానార్జన చేసి దాని లాభాన్ని సమాజానికి ఇచ్చుట నిజమైన జీవనోద్దేశ్యమని చెప్పవచ్చు. విద్వాంసులు స్వాధ్యాయం, ప్రవచనం రెండింటికి తగిన శ్రద్ధ చూపాలి. దీనివలన స్వయంగా జ్ఞాన పరిమార్జన చేసుకొని, సంపర్కంలోకి వచ్చిన వారందరికీ సత్యమార్గంలో పయనించేందుకు తగిన ప్రేరణ ఇవ్వగలిగే సమర్థత కలుగుతుంది. నేడు ఎక్కువమంది వ్యక్తులు బ్రాహ్మణత్వపు ముసుగు ధరించి, ఇతరుల ధార్మిక భావనలను ధ్వంసం చేయుట కన్పిస్తున్నది. దీనిలో ఎవరికీ లాభం లేకపోగా అనైతిక వాతావరణం వ్యాపిస్తూ ఉన్నది.

బ్రాహ్మణులు కోరుకొనతగినది ఏమిటంటే వారు ప్రజలకు నిజమైన ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వగలగాలని. మనం మనలోపలికి చూడాలి, మనలను మనం అర్థం చేసుకోవాలి, తెలుసుకోవాలి, మన లోపాలను గమనిస్తూ ఉండాలి. పని పద్ధతులను సరిచేసుకొనేందుకు ప్రయత్నించాలి-ఇదే నిజమైన ఆధ్యాత్మికత. నిజమైన ఆధ్యాత్మికవాది లక్షణాలు ఇవే.

సమాజంలో ఇలా చేయకపోవుట వల్లనే వికృతులు ఉత్పన్నమవుతున్నాయి. బ్రాహ్మణులు తమ ఈ పవిత్ర కర్తవ్యాన్ని మరచిపోరాదు.

★★★

**జనం మనల్ని చూచి జాలిపడేటట్లుగా కాక అనుసరించేటట్లు జీవించాలి.**

## ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం

# జపం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?-6

జపప్రక్రియ ద్వారా సూపర్ సోనిక్ శ్రవణాతీత తరంగాల ఉత్పాదన, కలయిక జరుగుతుంది. రేడియోస్టేషన్‌లో మాట్లాడినప్పుడు ఉత్పన్నం అయ్యే శబ్దాలు ప్రత్యేక విద్యుత్ శక్తితో కలసి అత్యంత శక్తివంతం అవుతాయి. అంతేకాక మరుక్షణంలో ప్రపంచమంతా ప్రసారం చేయడానికి సిద్ధంగా ఉంటాయి. అదేవిధంగా జపంలో ఉచ్చారణ చేసే శబ్దాలు ఆత్మనిష్ఠ, శ్రద్ధ, సంకల్ప శక్తి కలిసి బలపడతాయి. వాటివల్ల ప్రపంచ వాతావరణం ప్రభావితం అవుతుంది. అంతేకాక సాధకుని వ్యక్తిత్వం తేజోవంతం అవుతుంది. అయితే రేడియో స్టేషను నుండి ప్రసారం జరిగిందే తప్ప స్థానికంగా ప్రత్యేకత కనపడదు. లేసర్, రేడియో కిరణాలను ప్రసారం చేసే యంత్రాలలో ఏవిధమైన స్వశక్తి ఉండదు. అవి ఢీకొనే స్థానాలలో మాత్రమే వాటి ప్రభావం కనబడుతుంది. కాని జపక్రియలో మాత్రం సాధకుని, వాతావరణాన్ని ప్రభావితం చేసే శక్తి రెట్టింపు ఉంటుంది. దానిని నేటి వైజ్ఞానికులు ప్రయోగించే సామాన్య యంత్రాలలో పొందలేము.

జపం సామాన్య రూపంలో చేయబడుతుంది. దానిలో గాయత్రీ మంత్రం ప్రయోగింపబడుతుంది. సోహం సాధన మరొక గొప్ప ప్రయోగం. దీనిలో మంత్రాన్ని నేరుగా ప్రయోగించరు. జపంతో పాటు ప్రాణవిద్య కూడా ప్రయోగించబడుతుంది.

సోహం సాధనను 'అజపాజపం', 'ప్రాణగాయత్రి' అంటారు. శ్వాస శరీరంలో ప్రవేశించేటప్పుడు 'స' వంటి క్షణంలో 'ఓ' 'హమ్' వంటి అత్యంత సూక్ష్మ ధ్వని వస్తుందని తెలిసింది. చాలాకాలం శ్వాసక్రియపై ధ్యానం ఉంచి గ్రహించడం జరిగింది. దీనిని సూక్ష్మ కర్ణేంద్రియాలతోనే వినగలుగుతాం. మన కంటికి కనిపించే సాధారణ చెవులతో వినలేం. మన శరీరంలో ఉండే సూక్ష్మ కర్ణేంద్రియాల ద్వారా శబ్దతన్మాత్ర రూపంలోనే వినగలుగుతాం.

నాదయోగంలో సూక్ష్మ కర్ణేంద్రియాల ద్వారా శంఖం, గంట, మేఘం, సెలయేరు, వీణ వంటి శబ్దాలు మాత్రం వినగలుగుతున్నాం. కాని హంస యోగంలో నాసిక, కర్ణేంద్రియాల సమన్విత సూక్ష్మ శక్తి యొక్క లాభం రెట్టింపు లభిస్తుంది. 'సోహమ్' ను అనాహత శబ్దం అంటారు. ఎక్కడైనా దెబ్బతగిలినప్పుడు ఉత్పన్నం అయ్యేవి 'ఆహత' శబ్దాలు. 'అనాహత' శబ్దాలు అంటే దెబ్బ పడకుండానే ఉత్పన్నం అయ్యేవి. నాదయోగంలో వినబడే దివ్య ధ్వనుల గురించి రెండు రకాల అభిప్రాయాలు ఉన్నాయి.

(1) ప్రకృతి యొక్క అంతఃసాగరంలో పంచతత్వాలు, సత్వ, రజస్సు, తమస్సు అనే మూడు గుణాల వల్ల కలిగే అలజడి యొక్క ప్రతిక్రియ. (2) శరీరంలోపల జరిగే రక్త ప్రసరణం, సంకోచ వ్యాకోచాలు, ఉచ్ఛాస-నిశ్వాసాలు మొదలైనవన్నీ ఆ అలజడుల వల్లనే ఉత్పన్నం అవుతున్నాయి. ఇలాంటిదే ఆహత శబ్దం. ఒనానొక చోట నాదయోగాన్ని కూడా "అనాహత" శబ్దం అని అనడం జరిగింది. కాని సాధారణంగా అవి ఆహత శబ్దాలు. నోటి నుండి ఉత్పన్నం అయ్యే శబ్దాలు కూడా పెదవులు, నాలుక, కంఠం, అంగిలి మొదలైన అవయవాలలోని కండరాల కదలిక వల్ల ఉత్పన్నం అవుతాయి. అలాగే జపం కూడా ఆహత శబ్దమే. ఆహత శబ్దం కన్నా అనాహత శబ్దం ఎక్కువ మహత్తు కలిగి ఉన్నదని గుర్తించడం జరిగింది. అనాహత శబ్దం బ్రహ్మ చేతన ద్వారా నిర్ణయించబడింది. ఆహత శబ్దాలు ప్రకృతి సిద్ధమైన అలజడుల వల్ల ఉత్పన్నం అవుతాయి. అందుకే వాటి మహత్తులో కూడా బ్రహ్మకు, ప్రకృతికి మధ్య ఉన్నట్లే హెచ్చు తగ్గులు కనిపిస్తూ ఉంటాయి.

జీవాత్మ యొక్క లోతైన మధ్య భాగంలో ఆత్మ జ్ఞాన ప్రజ్ఞ స్వయంగానే జాగృతం అయి ఉంటుంది అని తత్వ జ్ఞానుల అభిప్రాయం. ఆ కారణంగానే 'సోహం' యొక్క ఆత్మజ్ఞానం 'అజప' రూపంలో స్వయంగానే నడిపిస్తుంది. సంస్కృతి భాషలో స+అహమ్ సోహమ్ అవుతుంది. ఇక్కడ వ్యాకరణ ప్రక్రియల జంజాటంలో పడవలసిన అవసరం లేదు. అనాదిగా చెలామణిలో ఉన్నటువంటి శబ్దాలు వ్యాకరణ శాస్త్రానికి అనుకూలంగా ఉన్నాయా? లేవా? అన్న చర్చ అనవసరం. కాని ఈ పురాతన శబ్దాల ప్రాచుర్యానికి గల భావం ఏమిటి అన్నది మాత్రం ఆలోచించాలి. 'సో' అనగా అతడు. 'అహమ్' అనగా నేను. అతడు అనగా పరమాత్మ. నేను అనగా జీవాత్మ. రెండింటి ఏకీకృత భావమే 'సోహమ్'. అంటే అతనే నేను అని అర్థం. ఇదే అద్వైత సిద్ధాంతం. అయమాత్మ, బ్రహ్మసివోహం, సచ్చిదానందోహం, శుద్ధోసి, ఉద్ధోసి, నిరంజనోసి వంటి వాక్యాలలో ఈ వేదాంతమే నిరూపించబడుతోంది. వీటిలో జీవి, బ్రహ్మల యొక్క తాత్విక ఏకత్వం అర్థం అవుతుంది.

అనువాదం - సత్యనారాయణ గుప్త

★★★

**మానవుని వయస్సు 100 సంవత్సరాలలో 50 సంవత్సరాలు నిద్రకే పోతాయి గుర్తించుకో.**

# పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది-2400 కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణ భారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్ర జపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత జపం చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడు మాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్క మాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక :** ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థుల చేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తన మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గడులు ఉన్నాయి. ప్రతిరోజు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపాలి. ఈ పేజిని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

*శ్రీ కె.పి.విఠల్, 48 LIG-II,బి.కె.గూడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ
అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400ల కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

*తేదీ ........................ నుంచి .................. వరకు*

*నెం :* *పూర్తి జప మాలల సంఖ్య :* [ ]

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | *ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి* | | | | |

*పేరు : ..........................................................*

*గోత్రము : ..........................................................*

*చిరునామా : ..........................................................*

..........................................................

..........................................................

*పుట్టిన రోజు మరియు వివాహదినము : ........................*

..........................................................

*ఫోన్ : ..........................................................*

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.*

**మూర్ఖునికి సుఖం దూరంగా కనిపిస్తుంది - వివేకవంతునికి పాదాల దగ్గరే కనిపిస్తుంది.**

వర్తమాన భారతం

# నాయకత్వ సంక్షోభంలో దేశం

## రాబోయే కష్టం

ఈనాటి గ్లోబల్ వార్మింగ్ యుగంలో లోకులు తలా ఒక మాట మాట్లాడుతూ ఉంటారు. "దీన్ని నేనే కనుగొన్నాను. దీని ఫలితం మనకు 50 సంవత్సరాల క్రిందటే రావాల్సి ఉంది" అంటూ జబ్బులు చరుచుకుంటూ ఉంటారు. జల ప్రళయం, ఋతు పరివర్తన, ఋతువుల ప్రతికూలత, కరవు - కాటకాలు మొదలైనవన్నీ భయంకర రూపంలో రాబోతూ ఉన్నాయి. అనుకున్న సమయానికి ముందుగానే భూమి వేడెక్కిపోతూ ఉంది. సూర్యుడు ఉదయం నుండే నిప్పులు చెరుగుతున్నాడు. మంచు కొండలు కరిగి ప్రవహిస్తున్నాయి. సునామీ వంటి ప్రళయాలు వస్తూ ఉన్నాయి. వీటన్నింటినీ మించిన కరవు, మహా కష్టం మన ముందుకు రాబోతోంది. కాని మనం దానిని గమనించ లేకపోతున్నాం. మనమందరం ధృతరాష్ట్రులం అయి పోతున్నాం. మహా భారత యుద్ధం ద్వారా రాబోయే ప్రళయాన్ని తెలిసుండీ ధృతరాష్ట్రుడు పుత్ర వ్యామోహంతో నిర్లక్ష్యం చేశాడు. అదేవిధంగా మనం కూడా రాబోయే ప్రళయాన్ని తెలిసుండీ నాయకత్వ విషయంలోనూ, ఆదర్శాల విషయంలోనూ, మార్గ దర్శకుల విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నాం.

## మానవ జాతి ఏం కాబోతుంది?

భారతభూమి వీరమాత. వీరులే కాదు లెక్కలేనంత మంది నరరత్నాలు కూడా ఇక్కడ జన్మించారు. 'రత్నగర్భ' అన్న మాటకు ఏనాడో అర్హత సంపాదించింది. మరి ఇప్పుడిలా ఎందుకు జరుగుతోంది? 21వ శతాబ్ది ప్రథమ దశకంలో మహనీయుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో మానవ జాతి విపత్కర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తే సందర్భానుసారంగా మహనీయులు ఉద్భవించేవారు. ప్రజలలో చైతన్యాన్ని కల్గించి కష్టాలను తరిమివేసేవారు. జీవన విధి విధానాన్ని నేర్పించేవారు. స్వయంగా వారు ఆచరిస్తూ, సమాజానికి శిక్షణ ఇచ్చేవారు. అందుకే వారు 'ఆచార్యులు' గా ప్రసిద్ధి చెందారు. వారి కారణంగానే భారతదేశం జగద్గురువుగా ఖ్యాతి చెందింది. **"స్వం స్వం ఆచరేణ శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః".** తమ తమ ఆచరణ ద్వారా ప్రపంచ ప్రజలను తీర్చి దిద్దెదరు గాక! ఎందుకో తెలియదు గాని హఠాత్తుగా మహనీయుల జననం ఆగిపోయింది. ఉన్నవారు సైతం మౌనం వహించారు. కొందరు అకాల మరణం చెందారు. భావితరం ఏమైపోతుందో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. వారికి నైతిక శిక్షణ ఇచ్చేదెవరు? వారికి సంస్కారాలు అందించేదెవరు? మానవజాతి ఏం కానున్నది? అన్నీ సమాధానాలు వెతుక్కోవలసిన ప్రశ్నలే.

## ఒకానొక మాయ

ఈ మాటలు నిరాశా నిస్పృహలతో వ్రాసినవి కావు. ఈ భయంకర పరిస్థితిని ఎదుర్కోవడానికి ఎవ్వరు సిద్ధం కావడం లేదు. ఏ విధంగా ఆలోచించి చూచినా సరిఅయిన నాయకుడు కనిపించడం లేదు. అయినా మన మనసుల్లో ఏదో అదృశ్య ప్రేరణ ప్రోత్సాహపరుస్తోంది. ఎవరిని అనుకరించాలి? 21వ శతాబ్ది-ఆధునిక వాతావరణంలో జీవిస్తున్న మానవ జాతికి జీవన మూల్యాలే అంతమైపోతున్నాయన్న ఆలోచన రావడం లేదెందుకు? ధర్మాధికారులైన పీఠాధిపతులు మౌనం వహించారు. అదే అన్నింటికీ మించిన ప్రమాదం అని చెప్పవచ్చు. వారు గనుక ముందుకు వచ్చి ఒక్కమాట చెప్పగలిగిననాడు కోట్లాది జనం వారి వెనుక నడిచి తీరుతారు. కానీ అదే లభ్యం కావడం లేదు. సినిమా ప్రభావంతో తెల్లవారే సరికి కోటీశ్వరులం అయిపోవాలన్న ఆకాంక్ష అధిక శాతం ప్రజలను పట్టి పీడిస్తోంది. ఈనాడు ప్రసార విభాగం అంధ విశ్వాసాలను అధికంగా ప్రచారం చేస్తోంది. రాజకీయం కూటనీతి, కులనీతి మీదనే ఆధారపడి జీవిస్తోంది. ఏదో తెలియని ఒకానొక మాయ ప్రజల కళ్ళను కప్పి వేస్తోంది. ఇది ఏం చేయాలి అన్న వేదనతో చేస్తున్న ఆలోచన మాత్రమే.

## అందరూ నేత్ర రోగ పీడితులే

ప్రజలను ఒక్క త్రాటిపై నడపవలసిన పీఠాధిపతులలో, రాజకీయ నాయకుల్లో కూడ కీర్తి దాహం, ధన దాహం పెరిగిపోయింది. అందువల్లనే ప్రస్తుత భయంకర పరిస్థితులను చూడలేకపోతున్నారు. రాజనీతిజ్ఞులు, సమాజ సేవకులు, మార్గ దర్శకులు, సాధు సంతులు, సాహితీ వేత్తలు, పాలకులు, వైజ్ఞానికులు, ప్రవక్తలు, పారిశ్రామికవేత్తలు, దళారులు, పత్రికా సంపాదకులు ఎవరిని చూచినా స్వార్థం తప్ప ఏమీ కనిపించడం లేదు. ఒక్క మన దేశమే కాదు, ప్రపంచ పరిస్థితే ఆవిధంగా ఉంది. 40 సంవత్సరాల క్రితం కొంత నయం. ఇప్పుడు అంతా స్వార్థపూరితంగా కనిపిస్తోంది. ఎక్కడ వెదికి చూచినా మనుష్యులే కాని, మనీషులు కనిపించడం లేదు. ఎవరికి వారే ప్రపంచమంతా

ఎప్పుడూ ఇతరుల తప్పుల్ని వెతకడం కూడా బలహీనతే.

సాఫీగా నడిచిపోతోంది అనుకుంటున్నారు. దృష్టి దోషాలలో సంకుచిత దృష్టి, దూరదృష్టి, హ్రస్వ దృష్టి అని వేర్వేరుగా ఉంటాయి. పైన చెప్పబడినవారంతా ఏదో ఒక దృష్టి దోషంతో బాధపడుతున్న వారే అని చెప్పుకోవచ్చు. ఏ దృష్టి దోషము లేనట్లైతే దేశ పరిస్థితులను చూడగలిగేవారు. దేశ రక్షణ బాధ్యత, సంస్కృతీ రక్షణ బాధ్యత తప్పక తమ చేతిలోనికి తీసుకునేవారు. ఎవరికి వారు వారి భవిష్యత్తును గూర్చి మాత్రమే ఆలోచిస్తున్నారు. వారు చల్లగా జీవిస్తే చాలు, దేశం ఎక్కడ పోయినా వారికి అవసరం లేదు. క్షణికమైన ఆనందం, క్షణికమైన లాభం చూస్తున్నారే కాని భావిజీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ఆలోచించలేక పోతున్నారు. కీర్తిహీనులుగా, తేజోహీనులుగా జీవిస్తున్నారు.

## రాజనీతిజ్ఞులు, సమాజ సేవకులు - సాధు సంతులు

రాజనీతిజ్ఞుల పేరును తలవకపోవడమే మంచిదనిపిస్తోంది. అసలు ఈనాటి సంక్షోభానికి మూలకారణం వారే అని చెప్పవచ్చు. ప్రపంచమంతా రాజనీతిజ్ఞుల గుప్పిట్లోనే ఉంది. రాజనీతి కులతత్వం గుప్పిట్లో బిగిసిపోయింది, బలమైన ఈ పిడికిలి నుండి విడదీయడం సాధ్యం కాని పని అయిపోయింది. 15 సంవత్సరాలకు పూర్వం ఎల్క్ట్రానిక్ మీడియా ఇంత ప్రచారంలో లేదు. ఉన్నా ప్రభుత్వం చేతుల్లో ఉండేది. ఇప్పుడది అందరికీ 24 గంటలూ అందుబాటులోకి వచ్చింది. కంఠంవరకు అవినీతిలో కూరుకుపోయి ఉన్న యంత్రాంగం ఎవరికి మార్గదర్శనం చేయగలుగుతుంది? ఎవరికివారు జేబులు నింపుకోవడంతప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

సమాజ సేవకుల వైపు నుండి కొంతలో కొంత ఆశ ఉండేది. ఇప్పుడు అదికూడా అడుగంటిపోయింది. ప్రతీపనిలో రెండు శాతం, నాలుగుశాతం అంటూ చేతులు చాచడం మొదలుపెట్టారు. వీరి పరిస్థితి **"ఒంటెనోటిలో జీలకర్ర"** అన్నట్లు తయారయింది. ఇక సాధు సంతుల గూర్చి ఆలోచిస్తే, అందరికన్నా వారే ఎక్కువ నిరాశపరుస్తున్నారు. సమాజ సేవా కార్యక్రమాలు వీరి ఆధీనంలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. కాని వారు భిక్ష పేరుతోనే లక్షలు సంపాదిస్తున్నారు. మాటలతోనే మత్తును కలిగిస్తున్నారు. ప్రధానమైన సమస్యల విషయంలో పెదవి విప్పడం లేదు. ఆర్థికబలాన్ని పుంజుకుంటున్నారే తప్ప సమాజానికి ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

## ఇతరవిషయాలు

నా మాటలు కఠినంగా అనిపించవచ్చు. అయినా చెప్పక తప్పదు. "ఆనందమఠం" లాంటి ప్రేరక సాహిత్యం ఈనాడు రావడంలేదు. ఈనాటి సాహిత్యమంతా యువతను ప్రక్కదోవలు పట్టించే దిశగా తయారయింది. సమాచార పత్రికలు గూఢచారవృత్తిని చేపట్టాయి. పాలకులు రాజనీతిజ్ఞుల పొగడ్తలకు వశులైపోతున్నారు. మేధావి వర్గం పెద్ద పెద్ద పట్టాలను చేపట్టినా స్వార్థంతో భ్రష్టుపట్టిపోతోంది. పారిశ్రామిక వేత్తలు, వైజ్ఞానికులు, ప్రవక్తలు, దళారులు మొదలయిన వారంతా పూర్తిగా అంధులై పోతున్నారు. సత్యం వంటి వ్యాపార సంస్థలు నీతి నిజాయితీలను దగ్గరకు రానీయడం లేదు. వైజ్ఞానికులకు దేశాన్ని గురించి అవగాహన లేకుండా పోతోంది. ప్రజ్ఞావంతులైన ప్రవక్తలు అనవసరమయిన వాటిమీద తమ తమ మేధస్సును వినియోగిస్తున్నారు.

## అంధకారంలో ఆశాకిరణం

కాలప్రవాహంలో ఇవన్నీ సహజమే. అంతమాత్రంచేత మనం నీరుగారి పోకూడదు. పెరుగుట విరుగుట కొరకే. పరిష్కారంలేని సమస్యలు ఉండవు. మనకు మన గురుసత్తా అండగా ఉంది. వారి మాటల మీద విశ్వాసం ఉంది. కాకపోతే చేయవలసిందల్లా ఒకే ఒకపని. వారు రచించిన సాహిత్యాన్ని భాషల వారీగా జనసామాన్యానికి అందించాలి. మహాతపస్వి అయిన గురుదేవులు 3 వేలకు పైగా పుస్తకాలు రచించారు. భావవిప్లవాన్ని ప్రజ్వలింప చేశారు. ఆలోచనల్లో మార్పు తేవడానికై అహర్నిశలు ప్రయత్నించారు. రెండు సంవత్సరాల తరువాత వారి శత జయంతిని జరుపుకోబోతున్నాం. మనం ఏ జాతికి, ఏ వర్గానికి, ఏ దేశానికి సంబంధించిన వారం అయినా, మనలో ఉన్న మహా మానవుని మేల్కొల్పాలి. స్వామి దయానంద్, స్వామి వివేకానంద్, మహర్షి అరవింద్ వంటి మహా మానవుల అంశ మనలో ఉంది. అది ఎప్పటికీ వ్యర్థంకాదు. విశ్వమానవులకే మనం మార్గదర్శకులం కావాలి.

## ఏం చేయాలి?

దేశాన్ని పట్టి పీడిస్తున్న భ్రష్టత్వాన్ని తొలగించాలంటే 2025 నాటికి సమర్పిత భావాలు గల వేలాది కార్యకర్తలుకావాలి. వారు యువతనుండే ముందుకురావాలి. ప్రయత్నిస్తే వజ్రపు తునకల్లాంటి యువతీ యువకులు లభించకపోరు. కేవలం మాటలతో దేనినీ సాధించలేం. చేతలుకావాలి. దీని కొరకే విశ్వగాయత్రీ పరివార్ 'లాల్‌మశాల్' ను ఉద్యమరూపంలో తీసుకుని వస్తున్నది.

అనువాదం - పొన్నూరు హైమవతీ శాస్త్రి

*(అఖండ జ్యోతి జూన్ 2009)*

★★★

**జీవితంలో ముందడుగు వేయడానికి సహకరించేవి - అవసరం, ఆసక్తి**

ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా

# మానవ శరీరం - మహాద్భుతం

తన ఆధీనంలో ఉన్నవారికి ఆదేశాలు సలహాలు ఇస్తూ, ఏదైనా కార్యాన్ని పూర్తి చేసే రీతి, నీతులను తెలియజెప్పే వ్యక్తితోనూ, ఏవో క్రియా కలాపాలతో కాలక్షేపం చేసే వ్యక్తితోనూ ఈశ్వరుని పోల్చలేము. నిజానికి ఈశ్వరుడు ఒక వ్యక్తి కాదు. ఆయన అస్తిత్వాన్ని వ్యక్తి రూపంలో ప్రామాణికంగా నిరూపించలేము. ఆయన అస్తిత్వాన్ని దర్శనం, శక్తి యొక్క అనుభవాల ఒక నియమ వ్యవస్థ రూపాలలోనే నిరూపించగలం. ఆ ఆధారంగానే ప్రపంచం అంతా నడుస్తూ ఉంది.

స్థూలం నుండి సూక్ష్మం వైపు మరలడంతోనే ఆ నియమ వ్యవస్థను సజీవంగా, జ్వాలాయమానంగా చూడవచ్చు. స్థూల వ్యవస్థను, క్రమబద్ధతను కూడా గంభీరంగా పరిశీలించి అర్థం చేసుకోవచ్చు. ఏదైనా పదార్థాన్ని లోతైన దృష్టితో చూస్తే దాని సౌందర్యం, వైభవం సహజంగానే తెలుస్తుంది. దూరం వెళ్ళవలసిన అవసరం లేదు. అన్నిటికంటే సమీపంగా ఉండే పదార్థం మీ శరీరమే. దాని మీదే దృష్టి నిలపండి. దాని చర్మాన్ని శ్రద్ధతో చూస్తే స్థూలానికి, సూక్ష్మానికి ఉన్న తేడాను తెలుసుకోవచ్చు. చర్మం కుళ్ళిపోయిన చెత్తా చెదారంతో నిండిన ఒక గోధుమరంగు సంచిలా కనిపిస్తుంది. అయితే దానినే వైజ్ఞానిక దృష్టితో గనుక చూసినట్లయితే జల్లెడలాంటి పలుచని పొరలో ఎంతో పెద్ద యంత్రాల ఫ్యాక్టరీ లాంటి పనులు నడుస్తున్నట్లు అర్థమవుతుంది.

మన చర్మంలో మూడు భాగాలున్నాయి (1) పై పొర (2) లోపలి పొర (3) ఎముకలపై అతుక్కుని ఉండే పొర. ఎముకలపై ఉండే పొరలో రక్త వాహకాలు, నరాలు, కణాలు ఉంటాయి.

ఒక చదరపు అంగుళం చర్మంలో దాదాపు 72 అడుగుల నాడి పరచబడి ఉంటుంది. ఇదే స్థానంలో రక్తవాహక నాళులు 12 అడుగుల కంటే పొడవుగా ఉంటాయి. ఈ రక్త వాహికలు వేడిని, చల్లదనాన్ని నియంత్రిస్తూ ఉంటాయి. చలికి ముడుచు కుంటాయి. వేడికి వ్యాకోచిస్తాయి. చలికి ముడుచుకుంటే వేడి తక్కువగా ఖర్చు అవుతుంది. శరీరతాపం సాధారణ స్థాయిలోనే ఉంటుంది. వేడికి వ్యాకోచించినప్పుడు వేడి అధికంగా వ్యయమై సమతుల్యంగా ఉంటుంది. వాహికలు, నాడులు, వసా కణాల కారణంగానే చర్మం ఎముకలకు అతుక్కొని ఉంటుంది. వయసు పెరిగే కొలది వసా కణాలు ఎండిపోతూ ఉంటాయి. అప్పుడు చర్మం ముడతలు పడుతుంది. లోపలి చర్మంలో నరాలు, రక్త వాహికలతో పాటు స్వేద గ్రంథులు, స్నిగ్ధత్వ గ్రంథులు, రోమకూపాలు ఉంటాయి. నాడులు చర్మస్పర్శతో వచ్చే అనుభూతులను టెలిఫోన్ వైరు లాగా మస్తిష్కానికి చేరవేస్తాయి. మస్తిష్క ఆదేశాలను, సందేశాలను వివిధ అవయవాలకు చేరవేస్తాయి.

దాదాపు 2 లక్షల స్వేద గ్రంథులు శరీరంలోని హానికారక పదార్థాలను చెమట రూపంలో బయటకు నెట్టివేస్తుంటాయి. చెమట నిరంతరం స్రవిస్తూనే ఉంటుంది. అయితే అది బిందువుల రూపంలో బయటకు వచ్చినప్పుడే కనిపిస్తుంది. చెమట రూపంలో నిరంతరం బయటకు వచ్చే మురికి చర్మంమీద పేరుకుపోతుంది. స్నానం ద్వారా దానిని శుభ్రంచేయడం తప్పనిసరి. శుభ్రం చేయకపోతే చెమటను స్రవింపజేసే రంధ్రాలు మూసుకుపోతాయి. అదే తామర, గజ్జి, దురదలకు కారణం అవుతుంది.

చర్మం క్రింద మాంస కండరాలుంటాయి. మాంస కండరాలు దృఢంగా సమతుల్యంగా ఉంటే ఆరోగ్యం, సౌందర్యం ప్రకాశిస్తాయి. అదే అస్తవ్యస్తంగా, ఎండిపోయి, వికారంగా ఉంటే రూపం వికారంగా తయారవుతుంది. అనవసర విశ్రాంతి, అత్యధిక శ్రమ రెండూ కూడా మాంసకండరాలను శక్తి హీనంగా, అస్తవ్యస్తంగా తయారుచేస్తాయి. శరీరంలోని అన్ని అవయవాలకు తగిన శ్రమ లభించినప్పుడు సుందరమైన దేహాకృతి ఉంటుంది. శ్రమసమతుల్యతే వ్యాయామం. మాంసకండరాలతయారీ మరియు బరువుమీద ఆధారపడేవ్యక్తి సన్నగా, లావుగా కనబడతాడు.

మాంసకండరాలు మృదువైన నరాలతో కలిసి ఉంటాయి. ఈ మృదువైన తంతువులు తమకంటె లక్షరెట్ల బరువును ఎత్తగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. మాంస కండరాలలో మూడు వంతులు నీళ్ళు, ఒక వంతు ప్రొటీన్‌లు ఉంటాయి.

మాంసకండరాలను మస్తిష్కం నేరుగా నియంత్రిస్తూ ఉంటుంది. కొన్ని మాంసకండరాల కదలికలు కనబడతాయి. ఊపిరితిత్తుల సంకోచ వ్యాకోచాలు, హృదయ స్పందనలు, రక్త ప్రసరణ, కనురెప్పలు కొట్టుకోవడం, భోజనం, జీర్ణం కావడం, మలవిసర్జన లాగా సునాయాసంగా, స్వయం సంచాలితంగా కనబడతాయి. ఈ క్రియలు అంత సునాయాసంగా జరగవు.

నీకన్నా గొప్పవారిని చూచి అనుసరించు.

ఇవన్నీ మన అచేతన మనసు ఆధీనంలో ఉంటాయి. మిగిలిన మాంసకండరాలు సచేతన మనసు ద్వారా నియంత్రించబడుతూ ఉంటాయి.

ఇంత వరకు చర్మం, దానికి అతుక్కొని ఉన్న కండర సంస్థాన విషయాలు పూర్తయ్యాయి. ఇక వీటి క్రింది అవయవాలు ఎంతో విచిత్రమైన కదలికలతో అహర్నిశలూ పనిచేస్తూ ఉంటాయి. గుండె, మూత్రపిండాలు ఈ రెండు అవయవాల మీద, శరీర శాస్త్రం ఆమోదించిన ప్రాథమిక జ్ఞానదృష్టితో ఈ విషయాలను తెలుసుకోవచ్చు. అవయవాలలో అన్నిటికంటె చిన్న యంత్రాలు రెండు మూత్రపిండాలు. అవి వెన్నెముకతో జోడించబడి, కవిరి గోధుమ రంగు ఆకారంలో గుప్పెట్లో ఇమిడిపోయే విధంగా ఉంటాయి. చూడడానికి పెద్ద సోమ బీజాల్లా ఉంటాయి. బరువు నూటయాభై గ్రాములు. మూత్ర నిర్మాణం అనగా రక్తం నుండి అనవసరమైన, మురికి నిండిన నీటిని వడపోసి వేరుచేసి బయటకు పంపడం దీని ముఖ్యమైన పని. ఎడమవైపు మూత్రపిండం కొంచెం పైకి ఉంటుంది. కుడివైపు కొద్దిగా క్రిందికి ఉంటుంది. తద్వారా సామాన్య క్రియాకలాపాలలో ఎటువంటి కష్టమూ ఉండదు. ప్రతి మూత్రపిండమూ 4 అంగుళాల పొడవు, రెండున్నర అంగుళాల వెడల్పు, రెండు అంగుళాల లావు ఉంటుంది. రక్తంలో కలిసి ఉన్న ఉప్పు, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం మొదలైన వాటి మోతాదు మించకూడదు. ఎందుకంటే ఇవి పెరిగితే శరీరంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. ఇందుకోసం మూత్రపిండాలు నిరంతరం పనిచేస్తుంటాయి. ఇవి రక్తంలోని క్షారాలను, ఆమ్లాన్ని కూడా సమతుల్యంగా ఉంచుతాయి.

ఒక గంటలో రెండు మూత్రపిండాలు వడపోసే రక్తాన్ని తూకం వేస్తే అది శరీరం కన్నా రెండు రెట్లు ఎక్కువ బరువుగా ఉంటుంది. ఈ విధంగా మూత్రపిండాలు జల్లెడలా పనిచేస్తాయి. వడపోయబడిన రక్తంలోని ఉపయోగకరమైన అంశాలను మూత్రపిండాల నాడులు ఆపుతాయి. ఈ నాడుల సంఖ్య పది లక్షలకు మించి ఉంటుంది. వీటిని ఒక వరుసలో గనుక పేరిస్తే దాని పొడవు పది కిలోమీటర్లు ఉంటుంది. నాడులు రక్తం నుండి వడపోసిన విటమిన్లు, చక్కెర, హార్మోన్లు మరియు అమీను ఆమ్లాలను తిరిగి రక్తానికి ఇచ్చివేస్తాయి. ఉప్పు, విజాతీయ ద్రవ్యాలను మూత్రపిండాలు శరీరం నుంచి బయటకు నెట్టివేస్తాయి. అనావశ్యక ఉప్పు శరీరంలోనే ఉండిపోతే వాపులు మొదలవుతాయి. మూత్రపిండాలు ప్రతి రోజు రెండు లీటర్ల మూత్రం తయారుచేసి ఉప్పు, ఫాస్ఫేటు, సల్ఫేటు, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఇనుము, క్రియాటిన్, యూరియా, అమోనియా, యూరిక్ యాసిడ్, హిప్యూరిక్ యాసిడ్, నైట్రోజన్ మొదలైన వాటి అనావశ్యక మోతాదును శరీరం నుండి బయటకు తోడివేస్తూ ఉంటాయి. మూత్రం సామాన్యంగా లేలికగా, పసుపు రంగులో ఉంటుంది. రెండు మూత్ర పిండాల పరస్పర సహకారం ఆదర్శంగా ఉంటుంది.

ఇదే తరహాలో మరో చిన్న అవయం కాలేయం. స్త్రీల కాలేయం పురుషుల కాలేయం కంటే కొంచెం తేలికగా ఉంటుంది. పురుషుల కాలేయం సాధారణంగా ఒకటింపావు నుండి ఒకటిన్నర కిలోల బరువు ఉంటుంది. కుడివైపు ప్రక్కటెముక క్రింద కాలేయం ఉంటుంది. శరీరంలోని నాల్గవ వంతు రక్తం దీనిలోనే నిండి ఉండడం వలన బూడిద, ఎరువు రంగుల్లో కనబడుతుంది. తాకితే గట్టిగా ఉంటుంది. ఈ కాలేయ కోశాలు విలక్షణమైనవి. ఒకటి నశిస్తే మరల తయారవుతాయి. అందువల్లనే కాలేయం మూడొంతులు చెడిపోయినా మిగిలిన ఒక భాగంతో పని జరిగిపోతుంది. అస్తవ్యస్త పోషణకారణంగా కాలేయం కావలసినంతగా వికసించదు. అనేక జీర్ణరోగాలు ఉత్పన్న మవుతాయి. సమతుల్య ఆహారం ద్వారా దీనికి కావలసిన పరిమాణంలో ప్రోటీన్‌లు లభిస్తే అరోగ్యంగా ఉంటుంది. ప్రోటీన్‌ల కొరత వలన బలహీనం అవుతుంది.

కాలేయం, మూత్రపిండాల కార్యకలాపాలు కూడ వింతగా ఉంటాయి. వాటి సహకారంతో నడిచే శరీర సమతుల్యత విషయాన్ని ఆలోచించినప్పుడు అవి ఎంత మహత్తు గలిగినవో అర్థం అవుతుంది. సాధారణంగా, గుండె, మస్తిష్కాలను జీవనానికి ఆధారంగా చెబుతుంటారు. కాని నిజం చెప్పాలంటే పై రెండు అవయవాలు ఏ కొంచెం దెబ్బతిన్నా బలహీనత, రోగాలు రావడమేకాక మరణ స్థితి దగ్గర పడుతుంది. ఈ రెండు శరీరం మొత్తానికి ఆధారభూతమైన రక్త సంస్థానాలను ఆరోగ్యంగా, శుభ్రంగా, శక్తివంతంగా ఉంచడంలో ప్రముఖ పాత్రను పోషిస్తాయి. కాని వీటి క్రియాకలాపాలు ఏవీ అంత గొప్పవిగా అనిపించవు.

వెంట్రుకలు నిర్జీవమైనవి. జీవితంలో వందలాది సార్లు కత్తిరించి పారవేస్తాము. కాని అవి కూడా వాటికవే ప్రత్యేకమైనవి. రోమకూపాల నుండి వెంట్రుకలు పెరుగుతాయి. ఈ రోమ కూపాలు పుర్రెపైన చర్మం క్రింద సుమారు 1/3 అంగుళం లోతుకు

**నీ కన్నా తక్కువ వారిని చూచి సహాయం చెయ్యి.**

దిగబడి ఉంటాయి. అక్కడ నుండే వెంట్రుకల పోషణ జరుగుతుంది. సాధారణంగా మనిషి తలమీద ఒక లక్షా ఇరవైవేల వెంట్రుకలుంటాయి. ఇవి నెలకు ముప్పాతిక అంగుళం పెరుగుతాయి. అయితే క్రమంగా వీటి పెరుగుదల వేగం తగ్గుతూ ఉంటుంది. రెండు సంవత్సరాల పాటు క్రమంగా పెరిగిన తరువాత పెరుగుదల ఆగిపోతుంది. ఈ వెంట్రుకల వయసు 1 1/2 నుండి 6 సంవత్సరాల వరకు ఉంటుంది. వయసు పూర్తి కాగానే అవి మూలం నుండి ఊడిపోతాయి. ఆ స్థానంలో క్రొత్త వెంట్రుకలు మొలుస్తాయి.

వెంట్రుకలు ఎప్పుడూ వంకరగా మొలుస్తాయి. అయితే కఠోరమైన చలిలోను, భయంతో వణుకు పుట్టినప్పుడు వెంట్రుకలు నిక్కబొడుచుకొని నిలుచుంటాయి. వెంట్రుకల మూలాలలో రంధ్రాల ద్వారా మృదుత్వం ఉత్పన్నమవుతుంది. రోమకూపాల నుండి ఎంత స్నిగ్ధత బయల్పడితే వెంట్రుకలు అంతకోమలంగా నిగనిగలాడుతూ ఉంటాయి. పొట్ట లేదా దంతాలు చెడిపోయినప్పుడు ఈ స్నిగ్ధత ఉత్పన్నం కాదు. వెంట్రుకలు ముసలితనం రాక ముందే తెల్లగా మారడం ప్రారంభమవుతుంది.

శోభ, శృంగార పరంగానే వెంట్రుకల విలువ కడతారు. వాటిని దువ్వడం, జడలు వేయడం ఇవన్నీ ముఖ సౌందర్యం మీద వాటి ప్రభావం ఏ విధంగా ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తాయి. స్థూలంగా లోపలికి వెళ్ళి వాటితో జోడించ బడియున్న క్రొవ్వు మరియు ప్రొటీన్ల ప్రక్రియల పరిస్థితిని అర్థం చేసుకోగలిగితే యంత్రాలలాగా యంత్రం లోపలి స్థితిని పరిచయం చేస్తాయి. అంతేకాకుండా వీటి ఆధారంగా మస్తిష్క స్థాయిని, భావనల ఉత్పత్తి చిరునామా తెలుసుకోవచ్చు. పంచకేశాలను ఉంచుకోవడం, గుండు చేయించుకునే ఆధ్యాత్మిక ఆచారాల వెనుక మానసిక సంస్థానాన్ని కోరిన దిశలో మరల్చుకోవడం కోసం సారవంతమైన ప్రయత్నం జరుగుతుంది.

ఇక్కడి విషయం చర్మం, మాంస కండరాలు, మూత్రపిండాలు, కాలేయం లేదా వెంట్రుకల వివేచన చేయడం కాదు. స్థూల దృష్టితో వీటి మహత్యం ఏదీ తెలియకపోయినా వాటి కార్యశక్తి మరియు వాటి ఉపయోగం ఎంత ఎక్కువగా ఉంటుందో, వికృతమైనప్పుడు ఉత్పన్నం అయ్యే విషమ పరిస్థితులను తెలుసుకున్నప్పుడే అది అర్థం అవుతుంది.

అవయవాల వివేచన పెద్ద విషయమే. వాటి కంటె అతి చిన్నదైన జీవాణువును గనుక పర్యవేక్షిస్తే బ్రహ్మాండానికి ఒక చిన్న పరమాణువు ఏ విధంగా ప్రాతినిధ్యం వహిస్తుందో అదే విధంగా చేతనా జగత్తులోని క్రియాకలాపాలన్నీ జీవాణువులో ఉన్నట్లు గ్రహించవచ్చు. పరమాత్మునికి ప్రతీక, ప్రతిరూపం జీవాత్మ మనిషి యొక్క ఒక చిన్న శుక్రాణువులో ఇమిడి ఉంది. శుక్రాణువులో లభించే అతి సూక్ష్మ గుణసూత్రాలు ఇంకా ఆశ్చర్య చకితుల్ని చేస్తాయి. వ్యక్తిత్వానికి చెందిన అనేక పార్శ్వాలు, వివిధ వ్యక్తిత్వ స్థితిగతుల సంగమం అంతా ఇందులోనే ఉన్నట్లు తోస్తుంది. స్థూల జీవ వృక్ష మూలంలో ఈ బీజశక్తి ప్రభావం, కర్తృత్వమే పనిచేస్తూ ఉంటుంది.

*అనువాదం – డి.వి.ఆర్. మూర్తి*

*(మూలం – భగవాన్ కౌన్ హై, కహా హై, కైసా హై)*

★★★

## శ్రీ గాయత్రీ శతకం

8. *ధర్మ సంకట మునపడిదారిగనక*
*వగుచు వేళల మంత్రమున్ పలుకునంత*
*తగిన మార్గము చూపును తల్లివోలె*
*విశ్వ జనయిత్రి గాయత్రివేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియక బాధ పడుతున్న సమయంలో గాయత్రీ మంత్రాన్ని అనేకమార్లు జపిస్తే ఆమె తల్లివలె తగిన దారిని చూపిస్తుంది.

9. *శాంతి దొరకక అల్లాడు సమయమందు*
*జనని మంత్రమున్ పలుమార్లు జపము చేయ*
*మహిమ చూపించి కలిగించు మహితశాంతి*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. జీవితం దుర్భరమై మనస్సులో ఏ మాత్రం శాంతి లేక బాధపడే సమయంలో గాయత్రీ మంత్రాన్ని అనేక మార్లు జపిస్తే ప్రశాంతతను కలిగిస్తుంది.

రచన
సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

**మనం జీర్ణం చేసుకోగలిగినంతే నమ్మకాలను పెంచుకోవాలి.**

## సంస్కృతీమూర్తి - పరమపూజ్య గురు దేవులు

# సాంస్కృతిక అనుష్ఠానం - మహాపూర్ణాహుతి

పూజ్య గురుదేవులు 12 సంవత్సరాల క్రిందట ప్రారంభించిన మహా అనుష్ఠానానికి నవంబరు 2000లో పూర్ణాహుతి జరుపబడింది. హరిద్వార్‌లో 40 మైళ్ల విస్తీర్ణంలో ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. ఈ మహాపూర్ణాహుతిలో పాలు పంచుకుని ధన్యత చెందాలని అనేక మంది ఉత్సాహంతో ముందుకు వచ్చారు. 12 సంవత్సరాల యుగసంధి మహాపురశ్చరణ, మహా పూర్ణాహుతి గొప్ప చారిత్రక సంఘటనగా చరిత్రలో నిలిచిపోయింది.

ఈ 12 సంవత్సరాల సమయంలో శ్రద్ధాంజలి ఉత్సవం, ప్రమాణాల ఉత్సవం, దేవ సంస్కృతి దిగ్విజయయాత్ర పేరిట 27 అశ్వమేథ మహాయజ్ఞాలు, 400 లకు పైగా విరాట్ సంస్కార ఉత్సవాలు వాజపేయ యజ్ఞాలు సాంస్కృతిక విప్లవరూపంలో నిర్వహించబడ్డాయి. 240 కోట్ల గాయత్రీ మహామంత్రజపంతో ప్రారంభించి, సంవత్సరానికి 24,000 కోట్ల జపాన్ని పూర్తి చేయడంజరిగింది. ఈ పూర్ణాహుతికి ఇప్పటికే మూడు చరణాలు పూర్తిచేశారు. ఇప్పుడు 4వ చరణం ప్రారంభం అయింది.

ప్రథమ చరణం పేరిట 1999 డిసెంబరు 3వ తేదీన (03-12-1999) భారతదేశమంతటా ఒకేసారి, ఒకే సమయంలో దీపయజ్ఞ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అదేరోజు పోలియోనిర్మూలనకార్యక్రమాన్ని కూడా మిళితం చేశారు. మొత్తంమీద భారీఎత్తున జన జాగరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లక్షప్రదేశాలలో కోటిమంది కార్యకర్తలతో నిర్వహించడంజరిగింది. ఇది సూక్ష్మ జగత్తులో శక్తివంతమైన విజయాన్ని సాధించింది. ఆనాటినుండి ప్రతి డిసెంబరు 3వతేదీనాడు బాధానివారణ దినోత్సవంగా జరుపుకోవాలన్న నిర్ణయంజరిగింది.

2వ చరణం పూజ్యగురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినమైన ఫిబ్రవరి 10 వసంత పంచమినాడు జరపడంజరిగింది. ఈసారి భారత దేశంలోనే కాక, ప్రపంచమంతటా, అన్ని శాఖలలోనూ, అన్ని శక్తి పీఠాలలోనూ, అన్ని ధార్మికస్థలాలలోనూ ఆరోగ్యవంతమైన సమాజం కొరకు దీప యజ్ఞాలు దేదీప్యమానంగా నిర్వహించబడ్డాయి. ఉజ్జ్వల భవిష్యత్తును కోరుతూ అందరూ నిర్మల మనస్సులతో ప్రార్థనలు చేశారు.

2000 సంవత్సరం జూన్ 11న గాయత్రీ జయంతి నాడు మూడవ చరణం నిర్వహించబడింది. దీనిలో భాగంగా గ్రామాల నుండి నగరాల వరకు ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. 14 రథాలలో 2 1/2 లక్షల కిలోమీటర్ల దూరం జాతీయ జాగరణ చేస్తూ తీర్థయాత్రలు చేశారు. ప్రత్యేకంగా ఎన్నుకోబడ్డ 108 ప్రదేశాలనుండి తీర్థయాత్రలు ప్రారంభించబడ్డాయి. పాశ్చాత్యసభ్యతతో నిండి ఉన్న అమెరికాలాంటి దేశాల నుండి కూడా ఈ యాత్రలు ప్రారంభించబడ్డాయి. కెనడా, టెక్సాస్ నుండి లాస్ ఏంజిల్స్‌కు చేరుకున్నారు. తూర్పున చికాగో నుండి మొదలుకుని అట్లాంటిక్ వరకు ఈ యాత్రలు నిర్వహించబడ్డాయి.

నాల్గవ చరణం విరాట్ విభూతిమహాయజ్ఞం ఢిల్లీలోని జవహర్‌లాల్ స్టేడియంలో జరిగింది. 1 లక్షా, 25వేల మంది ఈ యజ్ఞంలోపాల్గొన్నారు. ఆనాటి హోం మంత్రి లాల్‌కృష్ణ అద్వానీ, డాక్టర్ మురళీ మనోహర్ జోషి పాల్గొని, శాంతికుంజ్ కార్యక్రమాలను ఎంతగానో ప్రశంసించారు. గురుదేవుల కల సాకారమైందని అందరూ ఆనందించారు.

ఈ అంతిమచరణం మహాపూర్ణాహుతి రూపంలో నిర్వహించడం జరిగింది. నవంబరు 6 నుండి 11వ తేదీ వరకు నిర్వహించారు. చెడు నుండి, పాపం నుండి రక్షించి, పరాక్రమాన్ని, ఐశ్వర్యాన్ని పెంచి దేశాన్ని రక్షించే సామర్థ్యం సాత్రామణి ప్రయోగంవల్లలభిస్తుంది. దేశం యొక్క కీర్తిప్రతిష్ఠలను మహోన్నత స్థాయిలో నిలుపగల ప్రక్రియ "సృజన సంకల్ప విభూతి మహాయజ్ఞం". మహాపూర్ణాహుతిసందర్భంగా ఈ యజ్ఞం నిర్వహించారు. విభూతి అనగా ధనము, యోగ్యత, ప్రతిభ, శ్రమ మొదలైనవి. వీటిని ప్రజాహిత కార్యక్రమాలకు సమర్పణ చేసుకోవడానికి సంకల్పం తీసుకోవడమన్నమాట. ఈ సాంస్కృతిక మహా అనుష్ఠానంలో 2 కోట్ల మంది పాల్గొన్నారనీ, 2 లక్షల మంది పూర్తి సమర్పణ భావంతో అంకితమయ్యారనీ లెక్కగట్టడం జరిగింది. మహాపూర్ణాహుతిగా జరిగిన ఈ యజ్ఞంలో తీసుకున్న విరాట్ సంకల్పం యుగావతరణ జరిగి తీరుతుందన్న నమ్మకాన్ని పెంపొందించింది. స్వాగత మహోత్సవంగా 2001 వసంత పంచమి నాడు 5వ చరణం నిర్వహింపబడుతుందన్న నిర్ణయాన్ని ప్రకటించడం జరిగింది.

★★★

**నీ సరిసమానులతో స్నేహం చెయ్యి.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-16

# హనుమంతుని మనస్సులో ప్రతిధ్వనిస్తున్న రామనామం

హనుమాన్‌కు వాయుదేవుని దర్శనం, ఆశీస్సులు లభించడం అంజనీదేవికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆశ్చర్యంతో పాటు కుమారునిపై అంతులేని అనురాగం నిండిపోయింది. చూపులతోనే గారాల బిడ్డపై ఆనందంతో నిండిన స్నేహాశ్రువులు కురిపించింది. ఇంతలో అడుగుల సవ్వడి వినవచ్చింది. ఇద్దరు ఉలిక్కిపడి చూచారు. ఎదురుగా వానర రాజు కేసరి చిరునవ్వులు చిందిస్తూ నిలబడి ఉన్నాడు. అంజనీదేవి ప్రేమగా ఆయన చేయి పట్టుకుని తీసుకువచ్చి, ప్రక్కనే కూర్చుండపెట్టుకుంది. హనుమాన్ వినమ్రంగా తండ్రికి నమస్కరించిపాదాల చెంత కూర్చున్నాడు. కుమారుని వినయానికి తండ్రి మనస్సు పులకించిపోయింది. ప్రేమగా శిరస్సు నిమురుతూ లోలోపలే ఆశీస్సుల వర్షం కురిపిస్తూ ఉన్నాడు.

ఈ దృశ్యాన్ని తిలకిస్తూ ఉన్న అంజనీదేవి కుమారుని ద్వారా విన్న వాయుదేవుని వృత్తాంతం , వరాల వర్షం అన్నీ పూసగుచ్చినట్లు భర్తకు చెప్పివేసింది మురిపెంగా. వింటూనే కేసరి ముఖంలో గర్వం తొణికిసలాడింది. వాయుదేవుని అంతటివాడు తన కుమారునికి "పవనపుత్రుడు", "బజరంగబలి" అని కొత్త కొత్త పేర్లను ఇవ్వడం నిజంగా తన పూర్వజన్మల సుకృతంగా భావించాడు. వాయుదేవునివరదానంవల్ల తనపుత్రుడు వజ్రదేహుడు అయ్యాడు. పుత్రుడు పుట్టిననాటినుండి అతని కోరిక అదే. హనుమాన్ గొప్పబలవంతుడు అవ్వాలనీ, అన్యాయాన్ని ఎదిరించి న్యాయాన్నినిలబెట్టాలనీ ఎన్నో కలలు కంటున్నాడు. అది ఈనాడు నెరవేరుతున్నట్లుగా ఊహించుకుని ఉబ్బితబ్బిబ్బు అవుతున్నాడు. ఆనందాశ్రువులు తుడుచుకుంటూ అంజనీదేవి లేచి నిలబడింది. ముగ్గురూ భోజననిమిత్తం పాకశాలలోనికి వెళ్లిపోయారు.

అంజనీదేవి ఆరోజున భర్తకు, పుత్రునికి స్వయంగా వడ్డించింది. గారాల పుత్రునికి మొదటిముద్దను ప్రేమతో తినిపించింది. భోజనం చేసిన వానరరాజు రాచకార్యాల నిమిత్తం వెళ్లిపోయాడు. హనుమాన్ తన గదిలోనికి వెళ్ళిపోయాడు. వెళ్లిన క్షణం నుంచీ ఉదయం నుండీ జరిగిన ఘట్టాలే కళ్లముందర ఒకదాని తర్వాత ఒకటి కదలాడసాగాయి. పవనదేవుడు తనను మహాబలవంతునిగా ఆశీర్వదించాడు. రామభక్తినీ ప్రసాదించాడు. అందులోని రహస్యం హనుమాన్‌కు మెల్లమెల్లగా అర్థం అవుతోంది. తన బలసాహసాలు ఖచ్చితంగా శ్రీరామసేవకే ఉపయోగపడతాయి.

''శ్రీరామ'' అనుకోగానే హనుమాన్ తన్నుతాను మరచిపోతున్నాడు. తానింతవరకు శ్రీరాముని చూడనేలేదు. అసలు ఉన్నాడో, లేడో కూడా తెలియదు. ఉంటే ఎలా ఉంటాడో తెలియదు. కాని పేరును తలచుకోగానే మనస్సు నామ జపంలో లీనమైపోతున్నది. ఈ పవిత్ర నామం అతని నాభి ప్రదేశం నుండి ప్రాణ ప్రవాహంలా పొంగి పొర్లివస్తున్నది. కుండలినీ జ్వాలల్లో పడి మండిపోతున్నది. సుషుమ్నా ప్రవాహంతో పాటు పైపైకి పయనిస్తోంది. 'రామ' అనే రెండు అక్షరాలు 'ఇడ, పింగళ' శ్వాసలతో పాటు కలిసి పోయి ధ్వనిస్తున్నాయి. వెన్నంటి ఉన్న ఏడు చక్రాలలోనూ ఈ రామనామం తుమ్మెదలాగా ఝుంకారం చేస్తూ ఆగకుండా వినిపిస్తూనే ఉంది.

హనుమంతుని రోమరోమం నుండి రామనామం మారు మ్రోగుతూ ఉంది. రామనామమధురిమను ఆసాంతం ఆస్వాదిస్తూనే ఉన్నాడు. కాని ఒకే ఒక సందేహం పట్టిపీడిస్తోంది. "నా ప్రభువు నాకు ఇంతవరకు దర్శనమే ఇవ్వడం లేదు. కారణం ఏమై ఉంటుంది?" ఈ విధంగా లోతుగా ఆలోచించగానే ఏదో లీలగా అంతరాంతరాలలో ప్రభువు కనిపించేవాడు. "హనుమా! అధైర్యపడవద్దు. నేనెప్పుడూ నీదగ్గరే ఉంటున్నాను. నీవు నాకు ఆత్మ మిత్రుడివి. నీకు తప్పక దర్శనమిస్తాను'' అని బుజ్జగించినట్లుగా అనుభవం అవుతోంది. ప్రభువు తనతో దాగుడు మూతలాడుతున్నాడు. తనకే తెలియకుండా తనలోనే ఏదో లోపం ఉంది. అందుకే ముందుకు రావడం లేదు అని ఆత్మవిమర్శ చేసుకుంటున్నాడు. లోపం ఏదైనా ఉంటే భక్తునిలోనే ఉంటుంది. భగవంతుడు సర్వగుణసంపన్నుడు.

ఒకనాడు తల్లిచెప్పిన మాటలు గుర్తుచేసుకొన్నాడు "కుమారా! నిజమైన భక్తుడు సుఖదుఃఖాలలోను, కలిమిలేములలోను ఎల్లప్పుడు తన ప్రభువును దర్శిస్తూనే ఉంటాడు". "నేను నిజమైన భక్తుణ్ణికానా? మరి ఎందుకు రావడం లేదు? ఎందుకు నన్నైనా పిలిపించుకోవడం లేదు? ఎందుకు దూరంగా ఉంచి నన్ను తపింపచేస్తున్నాడు?" ఈరకమైన ఆలోచనలతో అతలాకుతలమై పోతున్నాడు. ఆలోచించి, ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. "నాలో ఏదో పవిత్రత లోపించింది. దానిని పూర్తి చేసుకోవాలి. అప్పుడే శ్రీరాముని దర్శనం లభిస్తుంది." అనుకుంటూ ఓదార్పును పొందాడు.

అనువాదం - పొన్నూరు హైమవతీ శాస్త్రి

★★★

సహృదయంతో ఇచ్చేదే దానం.

బోధకథ

# శ్రమశక్తి - ఆరాధన

అది మనోహరమైన వసంత ఋతువు. భూమండలంలో ఎక్కడ చూచినా పచ్చదనమే వెల్లి విరుస్తున్నది. భూమాత ఆకుపచ్చ చీరతో అలంకృతమై కన్నుల పండుగ చేస్తోంది. ఎక్కడ చూచినా వసంతోత్సవాల జోరు కన్పిస్తోంది. తపోవనాలు, పూలవనాలు ముగ్ధమనోహరంగా దర్శన మిస్తున్నాయి. ప్రజలంతా ఆనందోత్సాహలతో తేలియాడుతూ ఉన్నారు.

సరిగ్గా అదే సమయంలో స్వర్గంలోని దేవతలకు ఒక కోరిక కలిగింది. "అందరం బయలుదేరి ఒక్కసారి భూలోకాన్ని సందర్శించివద్దాం. పాపం అభాగ్యులైన మానవులు మనకు ఘనమైన స్వాగతం పలుకుతారు. తమ మనస్సులలోని తీరని కోరికలన్నీ మనముందు ఏ కరువు పెడతారు. మనం కూడా దయతో వారికోర్కెలుతీర్చి సంతృప్తిగా తిరిగివద్దాం'' అనుకున్నారు. అనుకున్నదే తడవుగా అందరికందరు బయలుదేరి భూలోకానికి వచ్చారు.

భూలోక వాసులంతా వసంతోత్సవాలతో తేలియాడుతూ దేవతల రాకనే గమనించలేదు. ఒక్కరు కూడా వీరి వైపు కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలుకరించలేదు.

అనుకున్నదొక్కటి–అయ్యింది ఒక్కటి కావటంతో దేవతలు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. నిరాశా నిస్పృహలతో ఉసూరుమన్నారు. చేసేది లేక మెల్లగా భూదేవిని పలిచారు. ఈవిధంగా ప్రశ్నించారు.

''అమ్మా! భూదేవీ! ఏమిటి? నీ బిడ్డలంతా ఏమి సాధించామని ఇంతగా ఆనందిస్తున్నారు? వారు కోరిన కోర్కెలు తీర్చి యశోధనంతో తిరిగి వెళ్ళాలని కొండంత ఆశతో వచ్చాం. కాని ఒక్కరూ మా ఉనికినే గమనించడం లేదు. ఎందుకని? మేము ఆశపడటంలో ఏమన్నా తప్పున్నదా?".

వారి మాటలకు భూమాత చిరునవ్వుతో ఇలా సమాధాన మిచ్చింది.

"దేవతలారా! నిరాశపడవద్దు. ఇవ్వగల సమర్థులు, ఇవ్వాలన్న కోర్కె గల వారు ఆశపడటంలో తప్పులేదు. కానీ ఇప్పుడు నా బిడ్డలంతా తమ "శ్రమశక్తి"నే గొప్ప దైవంగా ఆరాధిస్తున్నారు. శ్రమశక్తి ద్వారా సాధించిన ఫలితాలను చూచుకుంటూ మురిసిపోతున్నారు. మీ దయాగుణం సరియైనదే. కాని వారి అవసరాలు తీరిపోయిన తర్వాత వచ్చారు. వారి ప్రియతమ దైవం వారి అరచేతులలోనే కాపురం ఉంది. అదే అద్భుతమైన శ్రమశక్తి. ఆ దైవాన్ని ఆరాధించుకుంటున్న సమయం ఇది. కనుక మీరెవ్వరూ గుర్తింపబడటంలేదు. అంతేగాని మరొకటి కాదు.

భూదేవి తన బిడ్డల గురించి గర్వంగా వివరిస్తూ ఉంటే దేవతలు అవాక్కయ్యారు. మెల్లగా కుదుటపడ్డారు.

"దేవీ ! అయితే నీ బిడ్డలకు ఇక మా అవసరమే రాదా?" వారి కంఠంలో కొద్దిగా గర్వం, కొద్దిగా ఈర్ష్య తొణికిస లాడాయి.

"దేవతలారా! ఏ కార్యానికైనా సహాయం ఉండి తీరాలి. వారు శ్రమశక్తినే దైవంగా ఆరాధిస్తున్నారు. ఈ రోజు కాకపోతే రేపైనా భూమి మీదనే స్వర్గాన్ని స్థాపించగల సత్తా చూపిస్తారు.

"శ్రమను గౌరవించిన చోట ఎటువంటి లోటూ ఉండదు. శ్రమించి పనిచేసే వారు ప్రతి చిన్న విషయానికీ దేవతలను పిలిచి కష్టపెట్టరు. తమ రెక్కల కష్టాన్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు" అంటూ ఆమె వివరించింది.

దేవతలకు వాస్తవం కన్నుల ఎదుట ప్రత్యక్షమైంది. వారు మానవతత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలిగారు. ఊహించిన దాని కన్నా ఎక్కువైన సంతృప్తితో తమలోకానికి తిరిగి వెళ్లారు.

అనువాదం - పొన్నూరు హైమవతీ శాస్త్రి

★★★

గర్వాన్ని కలిగించనిదే జ్ఞానం.

## మనం - మన ఆరోగ్యం

# ఆయుర్వేద పరిశోధన - పునరుజ్జీవనావశ్యకత

వనస్పతుల మారు రూపమే మానవ శరీరం. ఇది తేనె, చక్కెర, కాయగూరలు, పండ్లు, అన్నం వనస్పతుల వల్లనే తయారౌతున్నది. గాలిలో ఉండే ఆక్సిజను అనే పోషకం వనస్పతుల నుండే పుదుతున్నది. మనుష్య జీవనానికి ఇదే మూలాధారం. శాకాహారి జంతువుల మాంసం కూడా కొన్ని ప్రాణులకు యోగ్యమైన ఆహారం ఔతోంది. వనస్పతుల వల్ల శరీరంలో కొన్ని రసాయనిక తత్వాలుంటాయి. వీటి మేలికలియకయే దృఢమైన శరీరం. ఆహార విహారాదుల వల్ల, శీతోష్ణపరిస్థితుల వల్ల, గాయం తగులుట వల్ల, ఇంద్రియ నిగ్రహ లేమి కారణంగా జబ్బులు చుట్టుముడతాయి. దీనిని బట్టి శరీరంలోని రసాయనిక సమతుల్యత దెబ్బతిన్నట్లు తెలుస్తుంది. వికృత లక్షణాలు పెరిగిపోవడానికి ఇదే కారణం. ఇందు మూలంగానే విషతుల్యత ఉత్పన్నమౌతుంది.

తారుమారైన ఆరోగ్యస్థితిని సరిచేయడానికి చెడిన రసాయనిక సమతుల్యతను సవరించాల్సివస్తుంది. దీనిలో నుండి బయట పడాలంటే రెండు స్థితులను పనిచేయించాల్సి ఉంటుంది. అధిక ప్రభావంచూపే వనస్పతులను ఆశ్రయించి ఈ ప్రయోజనాలు పొందవచ్చును. శరీరంలో అనేక రకాలైన ఖనిజాలు, లవణాలు, వస, మాంసకృత్తులు లభ్యమౌతాయి. ఇవి శరీరంలో నిలిచి పనిచేయాలంటే వనస్పతులలోంచి లభ్యమయ్యేలా చూడాలి. వాటిని వేరే విధంగా ప్రవేశపెడితే అవి నిలవవు. వాటిని తృణీకరించి బయటకు పంపే విధంగా శరీరం నిర్మితమైంది. అన్నం, కూరలలో ఉండే ఉప్పు, కారాల మిశ్రమమే జీర్ణమయ్యేలా చేస్తుంది. దానిని ఖనిజరూపంలో పొంది బలవంతంగా శరీరంలో కూరితే, అది చెమట, శ్వాస, మల ద్వారాల నుండి బయటకు పోతుంది. అంగాలలో వాటిని ప్రవేశపెట్టడం అనవసరమైన భారం ఔతుంది. ఈమాట అన్య రసాయనాల విషయంలోనూ వర్తిస్తుంది. వాటిని రోగనివారణకు, శక్తిని పెంచడానికి ఉపయోగించ వలసి వస్తే వాటిని వనస్పతుల మాధ్యమం ద్వారా లభింప జేయడమే సరైన మార్గం. వేరే మాధ్యమాల ద్వారా చేయబడే చికిత్సా ప్రణాళిక మెరిపించే తాత్కాలిక చమత్కారం మాత్రమే. అవి స్థిరమైన ప్రయోజనాన్ని కలిగించలేవు. శారీరక దుర్బలతను, రుగ్మతను నివారించేందుకు, విషాణువులను నాశనం చేసి, లోటు పాట్లను తొలగించే వనస్పతులను వెతకాల్సి ఉంటుంది.

ఈనాడు అత్యాధునిక, బహుళ ప్రచారంలో ఉన్న వికసిత వైద్య విధానం 'అలోపతియే'. రోగవిజ్ఞానం, శరీర విజ్ఞానం పై గల దృష్టి కోణంలో, లోతైన అధ్యయనం పరిశోధనల ఆధారంగా చేయాల్సి ఉంటుంది. రోగాల స్వరూపాన్ని పునాదిగా తీసుకుని అలోపతిని రూపొందించారు. ఈ విషయంలో వారి కృషి ప్రశంసనీయం. కాని ఈమాట చికిత్స, ఔషధాల విషయంలో వర్తించలేదు. అనేక ఉదాహరణలు ఈ పద్ధతి సరియైనది కాదని నిరూపిస్తున్నాయి. ఇంజక్షన్లు, కేప్సూల్సు, టానిక్కులు, ఏంటిబయాటిక్ మాత్రలు భారీగా వాడే పరంపర ఈ విధానంలో సాగిపోతూ ఉంది. బుద్ధిని, భ్రమలో పడవేస్తున్నారు వైద్యులు. ఈ ఉత్తేజకరమైన ఉపచారాల వెనుక ప్రతిక్రియలను గురించి తెలుసుకొనడానికిగాని, తెలుపడానికి గాని, తీరిక ఎవరికీ లేదు. సమయానుకూలంగా రోగం తగ్గినా విషభరితమైన మందుల ప్రతిక్రియ (సైడ్ ఏఫెక్ట్స్) జీవితాంతం కొత్త రోగంగా మారి, ఆ మనిషిని పట్టుకొని పీడిస్తోంది. ఉపచారం పొందిన వాళ్ళు కొత్త కష్టాలు, బాధలు వెంట తీసుకొని తిరిగి వెళ్తారు.

అన్ని కోణాలలో సమీక్ష జరిపిన తర్వాత ఈ పద్ధతిని గూర్చి పునరాలోచన చేయవలసిన అవసరం ఏర్పడుతోంది. ఆరంభంలో లాభాలు ఉన్నా, చివరలో నష్టాలను ఎలా స్వీకరించాలనే విషయాన్ని ప్రజల మనస్సులలోకి ప్రవేశపెట్టాల్సి ఉంది. 'ది బుక్ ఆఫ్ ఎన్ సైక్లోపీడియా' ప్రకారం ఈ అలోపతి విధానంలో ఔషధ ప్రయోగంలో వ్యాధి కాకుండా వేరే లక్షణాలను పుట్టిస్తుంది. దీని అర్థం ఏమంటే ఒక రోగనివారణకు, వేరే రోగాన్ని సృజించడమే.

వీటిని పునఃపరిశీలిస్తే, రోగ కారణాలను తిరిగి సమీక్షించడమే సరైన పద్ధతి అనిపిస్తోంది. అలా చేస్తేనే తగిన చికిత్స కనుగొనడం సాధ్యం ఔతుంది. తగిన రక్షణ వ్యవస్థను ఏర్పరచుకోవడం శరీర ధర్మం. జీవశక్తి రూపంలో రక్షణ వ్యవస్థ లభిస్తోంది. రక్తంలోని తెల్లకణాలు రోగనిరోధకవ్యవస్థకు సరిహద్దురక్షకసేనవలె పని చేస్తాయి. ఆక్రమణ చేసే జీవాణువులు, విషాణువులు మొదట శరీరంలో రక్షణ వ్యవస్థ బలహీనతను కనుగొంటాయి. మెల్లిగా శరీరంలోనికి ప్రవేశిస్తాయి. శరీర బలహీనతతో పాటు వాటి సామర్థ్యం కూడా పెరిగి రోగాలను వృద్ధి చేస్తాయి.

రోగ ద్రవాలు ఎంత వేగంగా బయటకు పోతాయో అనే దానిని బట్టి రోగనివృత్తి ఆధారపడి ఉంటుంది. రోగాణువుల విసర్జన వ్యవస్థసమర్థతకు వ్యక్తి సమగ్రఆరోగ్యమే ఆధారం. లోపలి అవయవాలలో ఏదైనా రోగగ్రస్తమైతే, బలహీనత వల్ల కొత్త రోగాలు పుట్టుకొస్తాయి.

**శత్రుత్వానికి స్థానమివ్వనిదే పరాక్రమం.**

అటువంటి పరిస్థితిలో ప్రకృతికి అనుకూలంగా ఉండే దినచర్యను ఏర్పాటు చేసుకోవాలి.

ఈ మూల కారణాన్ని తెలుసుకున్న తర్వాత సరి అయిన చికిత్సా విధానాన్ని నిర్ణయించడం సాధ్యం ఔతుంది. ఏ లక్షణాన్నైనా అణచిపెట్టే బదులు, రోగానికి జన్మకారకమైన దాన్ని వేరులోనే త్రుంచడం శ్రేయస్కరం. ఏదైనానొప్పిని వేర్వేరు మందులతో తాత్కాలికంగా తగ్గించవచ్చును. అసలు రోగాన్ని సమూలంగా నాశనం చేయకపోతే, కొత్త రూపంలో అది మరింత తీవ్రంగా వచ్చే అవకాశం ఉంటుంది. వాడుకలో ఉన్న చికిత్సా విధానం ఎంత శ్రేష్ఠమైనదో అర్థమైనా, జరిగిపోయిన సమయనష్టాన్ని మాత్రం పూరించలేము. దేశంలో 70% ప్రజలు గ్రామాల్లో పేదలుగానే జీవిస్తున్నారు. సాధనా రహితంగా ఏదో రకంగా జీవితాలను నెట్టుకొస్తున్నారు. అక్కడ ఆస్పత్రి ఉండదు. వైద్యుడు ఉండడు. ఉన్నా డాక్టరు ఫీజులకు, ఖరీదైన మందులకు డబ్బులుండవు. ఈస్థితిలో నిస్సహాయులైన అనేకులు రుగ్మతల నుండి విముక్తి పొందలేక మృత్యువాత పడుతున్నారు. ఈవిధమైన అకాల మృత్యువుల గూర్చిన ఊహయే వణుకుపుట్టిస్తుంది.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? దీర్ఘాలోచన చేస్తే ఒక ఆశాకిరణం కనబడుతుంది. అతి ప్రాచీన పరంపరలో వస్తున్న వనౌషధ విధానం, ఆయుర్వేదం వాడుకలోకి రావాలి. జీవన్మరణాల మహత్తర సమస్యకు సమాధానం దానిద్వారానే లభిస్తుంది. దీనికి సంబంధించిన కఠిన సమస్య ఏమిటంటే ప్రస్తుతం ఆయుర్వేదం మృతప్రాయస్థితిలో ఉంది. శుద్ధ రూపంలో వనస్పతులు నేడు లభించడం చాలా కష్టం అవుతోంది. చిల్లర దుకాణాలలో ఇరవై సంవత్సరాల క్రితంనాటి వనమూలికలే దొరుకుతున్నాయి. వాటి గుణాలు సంవత్సరం పాటే పనిచేస్తాయి. తాజా వాటిల్లో పాతవికలిపి అమ్ముతున్నారు. వారు కేవలం తమ లాభాలను మాత్రమే చూచుకుంటున్నారు. వాటి తయారీలో పదార్థాలను సరియైన పాళ్ళలో కలపకపోవడం వల్ల కూడా, గుణాల మేళవింపు సరిగా జరగదు. ఈ కఠినపరిస్థితులలో లభిస్తున్న వనస్పతులు తగిన ప్రయోజనాన్ని ఇవ్వడం లేదు. అన్నింటికీ తల పట్టుకుని కూర్చుని విధిని నిందించి నందు వల్ల లాభం లేదు. దీని కోసం సాహస పూర్వకమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. శాంతికుంజ్ స్థాపన జరిగిన కొద్ది కాలంలోనే దీనిని ప్రారంభించారు. అయితే ఇప్పుడు కొత్తగా అంతటా వ్యాపింప జేయాలనే నిర్ణయంజరిగింది. ప్రారంభ దశలో దేశంలోని విభిన్న ప్రాంతాలలో అత్యంత గుణవర్ధకమైన, దుర్లభమైన ఔషధ మొక్కలను నాటించి అవి చిగిర్చి, పెరిగేలా చూస్తున్నారు. ఈ స్థితిలో వాటివలన ఋషుల, ప్రతిపాదనలు సిద్ధించేలా చూపగలుగుతున్నారు. ఈ దిశలో వేయబడిన అడుగులు మహర్షిచరకుడు, ధన్వంతరి మొదలైన వారికి శ్రద్ధాంజలి ఘటించేవిగా ఉంటున్నాయి. ఈ ప్రయత్నానికి 'ఆయుర్వేద పరిశోధన – పునరుజ్జీవనం' అని నామకరణం చేయవచ్చును.

అయితే ప్రస్తుతం శాంతికుంజ్, బ్రహ్మవర్చస్‌లలో ఉన్న వనౌషధాల ఉద్యానవనం చిన్నదే అయినా కొద్ది కాలంక్రితం కొన్న భూమిలో విస్తృతవ్యవస్థకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ ఔషధ మొక్కలు పెంచి, వాటితో పాటు విత్తనాలు దేశంలోని అన్ని గ్రామాలకు పంపించి మూలికా వనాలను వృద్ధి చేయాలన్న సంకల్పం తీసుకున్నారు. ఈ ప్రయత్నం ఫలిస్తే దేశవాసుల ఆరోగ్య రక్షణ జరిగితీరుతుంది. అప్పుడెవరూ, పేదరికం కారణంగా అకాల మృత్యువాత పడడం గానీ, దీర్ఘకాలం రోగాలతో బాధపడవలసిన అవసరం ఉండదు. వనౌషధుల మహత్తును అవగాహన చేసుకొని సరైన రీతిలో వాటిని ఉపయోగించే అవకాశం లభిస్తే పేదదైన మనదేశం వైద్యచికిత్సా రంగంలో ఇతరులపైన ఆధారపడవలసిన అవసరం ఉండదు. అంతేగాక ఆరోగ్యవృద్ధి, సంరక్షణ విషయాలలో గొప్ప ఫలితాన్ని పొందగలుగుతుంది. శుద్ధమైన, సార్థకమైన జీవాణువులు గల వన మూలికలను నాటి, పెంచి, లభ్యమయ్యేలా చూడగలిగిననాడు మనదేశం ఆరోగ్య విషయాలలో స్వయంసమృద్ధిని సాధించిందని గర్వంగా చెప్పుకోవచ్చు. ఆస్పత్రులు తెరిచినంత మాత్రాన, దేశ ఆరోగ్య లక్ష్యాలను సాధించలేము. అర్థ, అంగ బలాలతో ప్రభుత్వం, అనధికార వ్యక్తులు ఆస్పత్రులను ఎక్కడైనా తెరవొచ్చు. కాని గుణాన్నిచ్చే మందులు, సరియైన చికిత్సా పద్ధతులు లేనట్లైతే అన్నీ వ్యర్థమే. అంతేకాక పేదలకు వీటిలో ప్రవేశం దుర్లభం అవుతుంది. ఈ వైద్యులు, వైద్యశాలల తళుకుబెళుకు బాటల ఖర్చును భరించడం ధనవంతులకే సాధ్యం ఔతుంది. ఆయుర్వేద పరిశోధన కార్యం శాంతికుంజ్‌లో విశేషరీతిలో జరుగుతోంది. ఈ పరిశోధనా కార్యక్రమం ప్రయోగశాలలకు పరిమితం కాకుండా, ఆయుర్వేదాన్ని సర్వజనులకు సులభంగా అందుబాటులోకి తేవాలి. ఇక్కడ ప్రయోగాలు, పరీక్షలతో పాటు ఆయుర్వేద ప్రచారం, ప్రసార మాధ్యమాల ద్వారా కూడా జరుగుతోంది. మసాలా వాటిక, గృహ వాటికల మాధ్యమాల ద్వారా అర్హమైన ఓషధులను ప్రతియింటా చేర్చడం, ఇవ్వడం వంటి ప్రణాళికలు ఇక్కడ నుండే అమలు చేయబడుతున్నాయి. ప్రస్తుతం బయట రోగులకు ఎక్కువ సేవ చేసే వ్యవస్థ లేకపోయినా, ఆశ్రమానికి వచ్చి పోయే వేలాది శిబిర సభ్యులు ఇక్కడ నివాసం ఉండే వేయి కుటుంబాల వారు చికిత్స పొందుతున్నారు. కొందరు నేర్చుకుంటున్నారు. దీని వల్ల కలిగిన పరిణామాలను బట్టి చూస్తే ఇక్కడ స్థాపించబోయే ఆయుర్వేద పరిశోధనా సంస్థానం ద్వారా దేశ ప్రజలకే కాక, విదేశీయులకు కూడా మార్గదర్శనం లభిస్తుందని భావించడం జరుగుతోంది.

*అనువాదం – బాసంగి శ్రీరాములు*

★★★

**దీనులకు ఉపయోగపడేదే సంపద.**

ధారావాహిక : భక్తిగాథ-21

# స్మరణ - సమర్పణ - సంలీనం

మహర్షి విశ్వామిత్రుని వాణి అందరి అంతఃకరణలలో ప్రవేశించి ద్రవీభూతుల్ని చేసింది. దేవతల కాంతి, ఋషుల తేజస్సు ఈ భావనలలో కలసిపోయాయి. హిమవంతుని ఒడి నుండి మరొక ప్రవాహం ప్రవహించడానికి ఉద్యుక్తమయింది. కానీ అదృశ్య ప్రభావం అందరి మీదా పడింది. ఇది భక్తి అనెడి పవిత్ర ప్రవాహం. దీనిని దేవర్షి యొక్క తపస్సు సప్తఋషుల జ్ఞానము, దేవతల దివ్యత్వము సాకారం చేసింది. నిర్వచించజాలని అపూర్వమూ అద్భుతమూ ఐన సంవేదనలు అవి, పులహ ఋషి తన భావనల నుండి తేరుకొని "అనుభూతులకు ఒక భాషంటూ ఉండదు. వాటిని గురించి చెప్పాలన్నా ఎవరు సరిగా చెప్పలేరు. ఎంత ప్రయత్నించినా అవి అసంపూర్ణంగానే ఉంటాయి". అన్నారు.

పులహ ఋషి పలికిన పలుకులను కోమలత్వంతో కూర్చి దేవర్షి క్రొత్త భక్తి సూత్రాన్ని ఉచ్చరించారు – "అస్త్యేవమేవమ్" (20) సరిగ్గా అలాగే ఉంటుంది. కాసేపాగి వారిలా చెప్పారు– "భక్తిని గురించిన ఎన్ని పరిభాషలున్నాయో అన్నీ సరియైనవే. వీటన్నిటిలో కూడ భక్తిని గురించిన విషయాలెన్నో ఉత్పన్న మౌతాయి కానీ ఏవీ సంపూర్ణం కావు. పరిభాషలన్నీ సరియైనవై నప్పటికీ ఇంకా అసంపూర్ణమే. ఎన్ని చెప్పినప్పటికి ఇంకా చెప్పనివెన్నో మిగిలి ఉంటాయి. ఇదంతా ఎందుకంటే భక్తి యొక్క సీమ ఎంతో విస్తారమైంది, దానికి హద్దు లేమి లేవు. హద్దు లేనిదీ, అనంతమైందీను".

దేవర్షి తన సూత్రాన్ని గురించి ఇంకా వ్యాఖ్యానించేవాడే. కానీ ఇంతలోనే వాతావరణంలో ఒక అపూర్వమైన సుగంధం, తెల్లటి ప్రకాశం వ్యాపించింది. ఎవరో ఒక విశిష్టమైన వ్యక్తి వచ్చాడని అందరూ తెలుసుకున్నారు. ఈ భక్తిగంగ సన్నిధిలో ఇది క్రొత్త ఏమీ కాదు. ఎంతోమంది విశిష్టమైన వారు వచ్చారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క ప్రత్యేకమైన మహత్తు. ఎవరినీ ఎవరితోనూ పోల్చలేము. అందరూ సమతుల్యులు. వచ్చిన వారందరూ కూడా ఉపస్థితులైన వారిని కృతార్థులను చేశారు. ఎప్పుడు ఎవరొచ్చినా వారి ఆగమనంవల్ల భక్తిగాథలో ఒక క్రొత్త అధ్యయనం మొదలైంది.

ఈ వేళ వచ్చిందెవరు? కొద్ది సేపటిలోనే సమ్మోహపరచే ఒక విచిత్రమైన వ్యక్తి అందరికీ ప్రత్యక్షం అయ్యాడు. ఇతను అఘోర ఋషి. సిద్ధ జనులు కూడా ఇతని సాన్నిధ్యాన్ని పరమ సౌభాగ్యంగా భావిస్తారు. పరమ అవధూత మహాజ్ఞాని భావమయ భక్తుడైన అఘోర ఋషిని దత్తాత్రేయ భగవానునిలాగ పూజనీయుడుగా తలుస్తారు. ఆయన ఎప్పుడు ఎవరి పూజను స్వీకరిస్తాడు? వారి అస్తిత్వం మలయ పవనం లాగా ప్రవహిస్తుంది. వారు ఎప్పుడు, ఎవరిని ఏవిధంగా కృతార్థులను చేస్తారో ఎవరికి తెలియదు. సిద్ధ సంప్రదాయంలో అఘోర ఋషి దైవీప్రేరణతో మేఘాలలాగ తన కృపాజలాన్ని వర్షిస్తారు.

వారి వ్యక్తిత్వం చాలా విశేషాలతో కూడుకున్నది. వారిలోని ఒక గొప్పతనం ఏమిటంటే వారితో పరిచయమున్న వారందరూ ఏదో ఒక విధంగా ప్రభావితమైనవారే, కాని వారు స్వయంగా ఎవరితోనూ ఎప్పుడూ కూడ ప్రభావితులు కాలేదు. ఇటువంటి మహనీయుని రాక అందర్నీ ఆశ్చర్యపరిచింది, వారి రూపము, వారి భావముద్ర అద్భుతమైనవి. తప్త కాంచనం లాంటి గౌరవర్ణమూ, జడలు కట్టిన పొడుగాటి జుట్టూ భావపూర్ణమైన నిశ్చల సరస్సు లాంటి నిర్మల నయనాలు, ధూళితో నిండిన నగ్న దేహం వైరాగ్య భావం. వారి స్వరూపాన్ని చూచి మహామాయ కూడ ముగ్ధురాలు అవుతుంది. వారిని మాత్రం ఏవిధమైన ప్రభావం స్పృశించలేదు.

పరమ వీతరాగుడైన ఈ ఋషి ఆగమనంతో అచ్చటి వారందరిలోనూ ఉత్సవ వాతావరణ నెలకొంది. అందర్నీ కృతార్థులను చేసింది. సప్త ఋషులు వారికి ఆసనమిచ్చి సన్మానించాలి అనుకున్నారు. కాని చేతితోనే వారించి దేవర్షి వద్దకు వెళ్ళి కూర్చున్నారు. దేవర్షిపైన కురిసిన ఈ కృపావృష్టికి అందరూ పులకితులైనారు. తన వద్ద ఉపస్థితులైన మహనీయుని నారదులవారు ఇలా అభ్యర్థించారు. "మీ రాక మాకు సౌభాగ్య దాయకం. భక్తి తత్వాన్ని తెలుసుకున్న వారిలో మీ కంటే అధికులు లేరు."

**అనుకోకుండా లభించే అపూర్వకానుక కీర్తి.**

దేవర్షి మాటలకు చిన్న పిల్లవాడిలాగ సరళంగా నవ్వుతూ "భక్తి తత్వాన్ని వివరించడం చాలా కష్టం. భక్తి తత్వాన్ని గురించి వ్యాఖ్యానించడం కేవలం భక్తిని గురించిన సాధనయే. సిద్ధి పొందినవారు కూడ ఇదే చెప్పారు. భక్తిని గురించి చెప్పినవన్నీ సరైనవే. కానీ వీటికీ అంతం లేదు. సాధకులెందరో ఉన్నారు. వారి వారి కాలములననుసరించి భక్తి యొక్క సాధనలను అనుసంధానం చేశారు. ఈ సాధనలన్నీ తమ తమ సమయాన్నీ సమాజాన్ని అనుసరించి ఉంటాయి. వ్యక్తిత్వాన్ని బట్టి కూడా వీటి రూపం మారుతుంది. కానీ సాధనను సిద్ధి అని తలంచరాదు."

సారగర్భితమైన మాటలను వారు ఆగకుండా చెప్తూకు పోతున్నారు. "ఎవరైనా సాధువులు, సిద్ధులు, తాపసులు, జ్ఞానులు తమ దారిశ్రేష్ఠమైనదనీ, ఇతరుల మార్గాన్ని తప్పు పట్టినప్పుడు మతవాదాలూ, వివాదాల సృష్టి జరుగుతుంది. సాధనా, సిద్ధీ అంతా దూరమౌతుంది. కర్మనిష్ఠ, భావనిష్ఠ కలవారే సాధన చేయగలరు. తర్కమనే వలలో చిక్కుకున్న మనిషి సాధన నెలా చేయగలడు? సిద్ధినెలా పొందగలడు? అందువల్లే భక్తుడు తన అస్తిత్వాన్ని భావము, ఆలోచన, కర్మల ద్వారా ప్రభువుకు అర్పణ చేస్తూ స్వయంగా తాను ప్రభువులోనే లీనం కావాలి. ప్రభుస్మరణ, ప్రభు సమర్పణ, ప్రభువులో లీనమయ్యే కొలదీ భక్తితత్వం ప్రకటింపబడుతుంది. ఒక దశ ఎటువంటిదౌతుందంటే భక్తుడూ, భగవంతుడూ, భక్తీ మూడూ ఏకమౌతాయి. వాటి అస్తిత్వం విడివిడిగా ఉండదు."

ఆకర్షణీయమైన అఘోర ఋషి వచనాలు మలయ పర్వతం నుండీ వీచే చల్లని గాలి లాంటివి. వాటి స్పర్శతో అందరి అస్తిత్వంలో సుగంధ భరితమైన భక్తి భావన నిండిపోయింది. వసిష్ఠ, క్రతు మహర్షులు భావ సమాధి వరకు చేరారు. శ్రేష్ఠ అవధూత అఘోర మహర్షి మాటలు–"భగవంతుని గొంతెత్తి పిలువు. నిన్ను నీవు అర్పించుకో, ఈ అర్పణలో ఎటువంటి ఆలస్యంకానీ, లోటుగాని ఉండకూడదు. ఇలాంటి వారికే భక్తి తత్వమూ, సత్యమూ స్వయంగా బోధపడతాయి."

*అనువాదం – కె. అరవిందమ్మ*

★★★

## కదిలించే కళ్లు

7. సీ॥ హిందు ధర్మము గూర్చి హేయమౌ పలుకులు
వినుచు వినుచు తాను వెతను చెందె
మూలంబు వెదకుచు ముఖ్యమౌ మంత్రంబు
గాయత్రి సాధించి ఘనతగాంచె
హవనక్రియను గూర్చి అందరికందించి
అగ్నియొక్క ఘనత నమలు పరచె
తపములోన మిగుల తపియించి తపియించి
విశ్వమిత్రునివోలె వినుతికెక్కె

తే॥ మంత్ర హవనాల లోనున్న మహిమ గూర్చి
శాంతి కుంజాన జరిగేటి శాంతి బోధ
మానవాళికి తెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

8. సీ॥ ఇహమును దలపోసి అహమున చెలరేగి
నీతివీడుచు నుండె నేటి యువత
రాజకీయములందు రాణింపవలెనంచు
న్యాయంబు విడనాడె నాయకుండు
రమణుల వేటాడు రక్క సిమూకలన్
రక్షించు చుండెను రక్షకుండు
సంస్కార హీనమై సంఘంబు క్షీణించె
సంస్కృతీ భిక్షకై సాచెకరము

తే॥ ధర్మ సంస్కృతులందింప ధార్మికుండు
కోట్ల సంఖ్యను సమకూర్చె కూర్మితోడ
అక్షరాస్త్రము సంధించి అరుగుమనుచు
కవిని కదిలించె గురుదేవు కంటి చూపు

*రచన–మధుర కవయిత్రి*
*పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**కత్తి - కలము సాధించలేని దానిని మౌనంతో సాధించవచ్చు.**

తత్వ చింతన

# శరీరం అత్యల్పం - గుణ సంపద అనల్పం

శరీరం చిన్నదిగా ఉన్నంత మాత్రంతో ఎవరినీ చులకనగా చూడకూడదు. అట్లా చూస్తే అది పెద్ద తప్పు అవుతుంది. చూడడానికి చిన్నదైనా దాని లోపల ఎంత గొప్ప గుణాలున్నాయో మనకు తెలియదు. ఉదాహరణకు నల్ల చీమను తీసుకుందాం. అది చూడడానికి భూమి మీద తిరిగే జీవులన్నిటిలోకి అతి చిన్నజీవి, ఐనా దానిలో గల ఎన్నో గొప్పగుణాలు విశ్వంలోని మరియొక్క ఏ జీవిలోనూ కనబడవు. చేబట్టిన పనిమీద మిక్కిలి శ్రద్ధ, తెలివితేటలు, అందరితో కలిసి జీవించే పద్ధతి, మొదలగు మంచి గుణాలతో బాటు ఇతర విచిత్ర గుణాలు పలికిస్తే ప్రపంచం ముక్కు మీద వ్రేలు వేసుకోవలసిందే.

ప్రపంచం మొత్తంలో చీమలకు సంబంధించిన మూడున్నర వేల ఉపజాతులున్నాయి. వాటి స్వరూపాలలో తేడాలుఎన్ని ఉన్నా అవన్నీ చీమలే. వాటి ఆకారాలు అధమపక్షం ఒక మిల్లీ మీటర్ నుంచి అధిక పక్షం నాలుగు సెంటీమీటర్ల వరకూ ఉంటాయి. మనకు బాగా తెలిసినవి చెట్ల మీద ఉండే గండుచీమలు, తిరిగే ఎర్ర చీమలు, బెల్లం వంటి తీపి పదార్థాల మీదకు ఎగబాకే చిన్న నల్లచీమలు మొదలైనవి. చీమలు ఎంత చిన్నవిగా కనబడినా యావత్తు ప్రపంచంలోను వాటికన్న బలమైన ఓర్పు గల ప్రాణులు మరేవీ లేవంటే అతిశయోక్తి కాదు. కారణమేమంటే వాటిలో తన శరీరాన్ని మోసుకుంటూ, దానికి 50 రెట్ల బరువును కూడా మోయగలశక్తి, ఓర్పు ఉంటాయి. మనిషికి తన బరువుతో రెండింతల బరువును మాత్రమే మోయగల శక్తి ఉంటుంది. అదే ఎక్కువ అనిపిస్తుంది.

చీమలలో గల గుణాలన్నింటి కన్నా గొప్పగుణం సామాజిక జీవనం. అందువల్లనే వాటిని సామాజిక ప్రాణులంటారు ఐదులక్షల చీమలు ఒకే గుంపుగా జీవించగలవు. అవి జీవించే ఇళ్లు అనేక రకాలుగా ఉంటాయి. వాటిని ఎక్కడైనాకట్టు కోగలుగుతాయి. మన ఇళ్లకు క్రింది భాగంలోను, గోడల మీద, చెట్ల బెరడు క్రింద, నేలమీద, రాళ్ళక్రింద విరిగిపడిన చెట్టు కొమ్మల క్రింద, చీమలు పుట్టలు పెట్టుకుంటాయి. మనకు బాగా పరిచయమున్న ఎర్ర చీమలు తమ ఇంటిని ఏదైనా ఎత్తయిన చెట్టుమీద ఏర్పాటు చేసుకుని నివసిస్తాయి. చీమల పిల్లలు తయారు చేసిన సన్నని దారాల సహాయంతో చీమలు తమ చుట్టూగల ఆకులను కనబడకుండా కప్పివేస్తాయి. ఆఫ్రికాలోని దర్జీ చీమలు, భారత దేశంలోని ఎర్ర చీమలు ఒకే జాతికి చెందినవి, అవి తయారు చేసుకున్న ఇళ్లు చెట్టు కొమ్మలను ఒకదానితో ఒకటి కలిసేటట్లు చేస్తాయి.

చెట్ల మీద నివసించే నల్ల చీమలు చెట్ల రెమ్మలమీద తలపాగాల వంటి పెద్ద పుట్టలు పెడతాయి. వాటిఎత్తు పదిమీటర్ల వరకు ఉండే అవకాశముంటుంది. వాటిని దూరం నుంచి చూస్తే ఇసుకతో కట్టినవి అనిపిస్తుంది కానీ అవి ఆకులతో తయారు చేయబడినవే, ఈ చీమలు ఆకులపైన తమ శరీరాన్ని ఉంచి ఒక ద్రవపదార్థాన్ని కారుస్తాయి. దానివలన ఆ ఆకులు నీళ్లతో కడిగినట్లు శుద్ధి అవుతాయి. చీమలలో ఒకజాతికి చెందినవి పక్షులు కట్టిన గూళ్లలో జీవిస్తాయి. అయినా చీమ పెట్టిన గుడ్లకు ఆ పక్షుల వల్ల ఏవిధమైన బాధాకలుగదు.

విజ్ఞానవేత్తలు చేసిన పరిశోధనలను బట్టి చీమలు ఇంచుమించు పదికోట్ల సంవత్సరాలుగా ఈ జగత్తులో ఉన్నాయి. చీమలు అధికంగా భూమి మీద పుట్టలు పెట్టుకుని నివసిస్తాయి. ఒకపుట్టలో వేలు, లక్షల సంఖ్యలో చీమలుంటాయి. ప్రతి పుట్టలోనూ మూడు రకాల చీమలుంటాయి. వాటికి వేరువేరు బాధ్యతలుంటాయి. అన్నిటిలోనికి పెద్దదైన చీమను రాణీ చీమ అంటారు. దానిపని వేల కొద్ది గుడ్లుపెట్టడం. ఆ పెట్టిన గుడ్లు పగిలే వరకు రాణీ చీమ ఆహారం తీసుకోదు. దాని శరీరంలో సహజంగా ఉన్న కొవ్వు, పోషక పదార్థాల వల్ల తగిన శక్తి లభిస్తుంది. దానికి అధిక సమయం గుడ్లు పెట్టడంలోనే గడిచిపోతుంది. ఆ గుడ్లనుండి మళ్లీ రాణీ చీమలు శ్రామిక ఆడచీమలు మొదలైన వివిధ రకాల చీమలు పుట్టు కొస్తాయి.

చీమల జాగత్తులో మగ చీమల పని కేవలం చీమలను పుట్టించడం వరకే ఉంటుంది. వాటి జీవితకాలం అతి తక్కువ. శ్రామిక ఆడ చీమను మాదా చీమ అంటారు. మాదా చీమను కలిసిన తరువాత మగచీమకు చావు వస్తుంది. రాణీ చీమ ప్రతీ

**ఆస్తికి హక్కులు ఉన్నట్లే, విధులు ఉంటాయి.**

సంవత్సరం వేల సంఖ్యలో గుడ్లు పెడుతుంది. ఇదే తీరున గుడ్లు పెట్టడం, వాటిలో మాదా చీమలు పుట్టడం ప్రతి సంవత్సరం జరిగితే ఈ జగమంతా చీమలమయమై పోతుంది. కానీ ఆ విధంగా జరగదు. కారణమేమంటే రాణీ చీమ శరీరం నుంచి ఒక జిగురు పదార్థం ఉద్భవిస్తుంది. దానిని తిని మాదా చీమలు నిర్వీర్యమౌతాయి. ఇది ప్రకృతిలో చేయబడిన ఏర్పాటు.

చీమలకు చెందిన సమాజంలో పెంచిపోషించడమేకాక, శ్రామిక వ్యవస్థ రక్షణ వ్యవస్థ మాదా చీమలు నిర్వహిస్తాయి. వీటిలో కొన్ని మిగిలినవాటి యోగ క్షేమాలను చూడడంలో మునిగి ఉంటాయి. మరికొన్ని వాటి పుట్టలను, నివాసస్థానాలను జాగ్రత్తగా కాపాడుతూ ఉంటాయి. రాణీచీమ ఆహారంతీసుకోవడం ప్రారంభించగానే శ్రామికచీమలు తాము ప్రోగుచేసిన ఆహార పదార్థాలలో రుచికరమైన వాటిని ఆ రాణీ చీమచేత తినిపిస్తాయి. శ్రామికచీమల యొక్క ప్రధాన కార్యం తినదగినపదార్థాలను వెతకడం, చిన్న చీమలను జాగ్రత్తగాచూస్తూపెంచడం. గుడ్డు నుంచివెలువడినచీమలు అతిచిన్నవిగా ఉండి కదలలేని స్థితిలో ఉన్నప్పుడు శ్రామికచీమలు వాటిని జాగ్రత్తగా కాపాడతాయి. శ్రామిక చీమలలో కొన్ని పెద్దతల, గట్టి భుజాలు కలిగి ఉంటాయి. వాటిని సైనికచీమలు అంటారు. అవి తమ ఇండ్లను కాపాడుతుంటాయి. ఇవి తోటిచీమలకు తినదగిన పదార్థాలను పెద్దముక్కలను చిన్నముక్కలుగా విరిచి తినిపిస్తాయి.

చీమల పుట్టలలో వేరువేరు గదులుంటాయి. వాటిలో విశేషమైన (రాయల్ ఛేంబర్) గదిలో రాణీ చీమ గుడ్లు పెడుతుంది. శ్రామిక చీమ ఆ గుడ్లను జాగ్రత్తగా కాపాడడానికి వేరే గదిలోకి తీసుకువెడుతుంది. వాటి ఉమ్మి నుంచి నీరుకారుతుంది. ఆ నీరు ఎక్కువై ప్యూపాగామారుతుంది. అప్పుడు శ్రామిక చీమలు వాటిని వేరొక గదిలోనికి తీసుకువెడతాయి. అపుట్టలోని ఇతరగదులు ఆహార పదార్థాలను, పనికిరాని చెత్తను పెట్టడానికి పనికి వస్తాయి.

వేరువేరు ప్రదేశాలలో తిరిగే చీమలలో వాటివాటికి చెందిన ప్రత్యేక లక్షణాలుంటాయి. యూరప్ దేశాలలోని చీమల స్వభావం విచిత్రంగా ఉంటుంది. ఇతరులచోటును ఆక్రమించేస్వభావం గల ఎర్రచీమలు చుట్టుప్రక్కలగల నల్లచీమలపుట్టలను ముట్టడించి వాటిని బంధించి వేస్తాయి. ఇంతేకాక ఆ నల్ల చీమలు పెట్టే గ్రుడ్లను కూడా ప్రోగుచేసి వాటినుంచి పిల్లలురావడం కోసం ఎదురుచూస్తూ ఉంటాయి. పిల్లలురాగానే ఎర్రచీమలు వాటిచేత రకరకాల పనులు చేయిస్తూ పనివాళ్లుగా మారుస్తాయి. నిజానికి ఎర్రచీమల ఈ పనులన్నీ తమతమ అవసరాన్నిబట్టి చేయడం జరుగుతుంది. కారణమేమంటే వీటిలో చాలామటుకు శ్రామికవర్గానికి చెందినవే ఉంటాయి. వాటికి ఆహారాన్ని సంపాదించుకోవడంగానీ, వాటికి పుట్టిన పిల్ల చీమలను పెంచి పోషంచడంగానీ చేతగాదు.

ఆస్ట్రేలియాలోని చీమలు 'మేలోసోకస్' అన్న పువ్వుల రసాన్ని ఎక్కువగా ఇష్టపడతాయి. వాటి తెలివితేటలు చాలా విశేషమైనవి. ఆకలిగా ఉన్నప్పుడు పైన తెలిపిన పువ్వులరసాన్ని తాగికడుపునింపు కుంటాయి. ఆరసాన్ని నిలవచేసుకోడానికి ఫ్రిజ్, కోల్డుస్టోరేజ్‌లు కూడా ఏర్పాటు చేసుకుంటాయి. ఆరసాన్ని అవిత్రాగడమేగాక ఇతర క్రిముల చేతకూడా త్రాగిస్తాయి. ఆ క్రిముల కడుపులు రసంతోనిండిపోయి బటాణీ గింజంతగా ఉబ్బి పోతాయి. వాటిని తలక్రిందులుగా వ్రేలాడతీసి ఆకలి వేసినప్పుడల్లా ఆరసాన్ని త్రాగుతూ ఉంటాయి.

చీమలు ఆవులను పోషిస్తూ తోటలను కూడా పెంచుతాయి. ఇది ఆశ్చర్యాన్ని కలిగించవచ్చును. కానీ కొన్ని చీమలు ఈ విలక్షణమైన పనికి తమజీవితాలను వినియోగిస్తాయి. వీటిలో ఒక తెగకు చెందిన చీమలు 'ఎపిఇస్' అనుపేరుగల దోమలను పోషిస్తాయి. ఆ దోమల శరీరాల నుంచి హనీడయా అనుపేరుగల తియ్యటిరసాన్ని ఎంతో ఇష్టంగాతాగుతాయి. ఈ చీమలు ఎపిఇస్‌ల పాలను రైతు ఆవుపాలనుపిండినట్లు పిండి తాగుతాయి.

తోటలనుపెంచి తమకుకావలసిన ఆహారపదార్థాల పండించుకునే చీమలు "అనిటస్ దశర్యబ్ అట్ టీస్" పేరుగల జాతికి చెందినవి. అవి చాలామటుకు పశ్చిమ గోళార్థమునకు చెందిన ఉష్ణదేశాలలో కనబడతాయి. ఇవి నివసించేతోటలు ఫర్ఫూట్ తోటలు. అవే వాటికి ఆహారం. శ్రామిక చీమలు ఎక్కువగా తోటలలో ఎంతోశ్రద్ధతోపనిచేస్తాయి. వాటికి చెందిన తోటల కోసం పుష్ప పరాగకణాలను, వాడిపోయిన పూలరెక్కల ముక్కలను, మొదలైనవాటిని ప్రోగుచేసి వాటిని చిన్నచిన్న ముక్కలుగా చేసి తోటలో చల్లుతాయి. దాని వల్ల పెరుగుతున్న పర్‌ఫూట్ మొక్కలకు అది చాలా కాలం ఆహారం ఔతుంది.

ఈ అతిఅల్పజీవులు ఎంతోతెలిగలవారిగా చెలామణి అవుతున్న మనుష్యులను కూడా ఆశ్చర్య పరిచే తెలివి తేటలతో సంచరిస్తాయి. ఇవితమ తమ సమాచారాన్ని మరియొక చీమకు,

**నిందాత్మక ప్రచారానికి మౌనమే సమాధానం.**

తెలియజేసే సమర్థత కలిగి ఉంటాయి. గోడవెనుక భాగాన్ని తమ వీపులతో శ్వాసబిగించి కప్పివేస్తాయి. దాని వలన మిగిలిన చీమలు జాగ్రత్తపడునట్లు చేస్తాయి. కొన్ని చీమలు తమ శరీరంలోని వెనుకభాగమునుంచి ఒక ప్రత్యేకమైన వాసనను విడుస్తాయి. ఆవాసన అక్కడ తినే పదార్థము లభిస్తుందనడానికి గుర్తు, శత్రువుల ఆచూకీ తెలియ చెయ్యడానికి ఒక ప్రత్యేకమైన శ్వాసను ఉపయోగిస్తాయి. చీమలు మరియొక చీమను కలిసినపుడు తమ తలలోని ప్రముఖ భాగమైన యాంటీనాతో వాసన చూసి గుర్తుపడతాయి.

చీమల జగత్తుకు చెందిన ఈ చర్చలో ప్రమాదకర చీమలనుగురించితెలుపకపోతే ఈ చర్చ అసంపూర్ణమే అవుతుంది. ఏసిటానే లేక డారిలస్ ఉపజాతికి చెందిన చీమలు ఇతర చీమలవలె ఇళ్లుకట్టుకోవు, బిలాలలో నివసించవు. ఇవి జీవితాంతం తిండికోసం వెతుక్కుంటూ తిరుగుతాయి. దక్షిణ అమెరికా లేక ఆఫ్రికాలో కనబడే ఈ చీమలకు అమెరికాలో "సోల్జర్ యాంట్స్" అని, ఆఫ్రికాలో "డాడ్‌వర్‌యంట్"అని పేరుపెట్టబడింది. కోట్ల సంఖ్యలో బజారు రౌడీలుగా తిరిగే ఈచీమలు వేటగాళ్ల ప్రవృత్తి కలిగి ఉంటాయి. ఎర్ర, నల్లరంగులు కల ఈ చీమలు పాకే సమయంలో వానకురుస్తున్న చప్పుడు చేస్తూ పాకుతాయి. త్రోవలో ప్రతివస్తువును, ప్రతిప్రాణిని చుట్టుముట్టుతాయి.

ఈ చీమలలో కాఫిలా చీమలకు మార్గాన్ని చూపించే చీమలు ఏదైనా ప్రాణిని వెతకగానే కాఫిలా చీమలన్నీ దాని మీద విరుచుకు పడుతాయి, దాని ప్రాణాలు తీసిపారేస్తాయి. వేలు, లక్షలసంఖ్యలో చీమల గుంపును చూసి అతిపెద్దజంతువులు కూడా దూరంగా పారిపోతాయి. అట్లా పారిపోలేకపోతే ఆ చీమలు దోమ నుంచి సింహం వరకు గల అన్ని జీవులను చంపుకుతింటాయి.

అమెరికాలోని ఉపమహాద్వీపములో తిరిగే చీమలు చిన్నచిన్న వస్తువులను మాత్రమేతింటాయి. వీటిని లీజనరీ చీమలు అనికూడా పిలుస్తారు. ఇవి మధ్య లేక దక్షిణఅమెరికాలోను, దక్షిణఅమెరికా సంయుక్త రాష్ట్రాలలోను సంచరిస్తూ ఉంటాయి. ఈ చీమలు వేల సంఖ్యలో గుంపుకట్టివస్తున్న విషయం తెలియగానే గ్రామాల లోని ప్రజలు ఊరువిడిచిదూరంగా పారిపోతారు. ఈ చీమలు వాళ్లు వదిలి వెళ్లిన ఇళ్లల్లోని ఎలుకలను, బల్లులను, పురుగులను చంపుకుతింటాయి.

ఇతర చీమలవలెనే ఈ చీమలలోని రాణిచీమ లక్షల కొద్దీ గుడ్లుపెడుతుంది. వాటి నుంచి లక్షలకొద్దిచీమలు పుట్టుకొస్తాయి. అవి వెంటనే కాఫిలా చీమలలో జేరిపోతాయి. వీటి వంశాన్నిపెంచే రాణీచీమ గుడ్లుపెట్టేసమయంలో శరీరాలతో ఒక చక్కని నివాస గృహాన్ని నిర్మిస్తాయి. లక్షల సంఖ్యలో ఉండే ఈ చీమలు ఒకరితో ఒకరు కలిసి ఏదైనా క్రిందికి వంగిఉన్న రాతిసహాయంతో ఒక పెద్ద బంతివలె వ్రేలాడతాయి. అవి కట్టిన పుట్టలో మెట్లుగల ఒకమంచెను కూడా తయారు చేస్తాయి. అందులో రాణీ చీమ ఎంతో హుందాగా తిరుగుతుంది. తమ గుంపులో లక్షలాది చీమలను పుట్టించి ఈ చీమలు మళ్లీ వేటకు బయలుదేరతాయి. మార్గమధ్యంలో ఏదైనా నది అడ్డం వస్తే పరస్పర సహాయంతో నదిని దాటుతాయి.

చీమలకు శత్రువులు కూడా అధికంగానే ఉంటారు. ఐతే తమశక్తిని బట్టి వాటిని ఎదుర్కొనే నేర్పుకూడా వాటికుంటుంది. వాటిని ఎదుర్కొని చంపుతాయి. లేదా శ్వాస ద్వారా వాటిమీద యాసిడ్‌ను కురిపిస్తాయి. కొన్ని చీమలు శత్రువుల మీద విషాన్ని కురిపించి బాధిస్తాయి.

అన్నింటి కన్నా చీమలలో గల విశేష గుణం పని చేసే ఓర్పు, శ్రద్ధ, అన్నీ కలిసిమెలిసి జీవించడం మొదలైనవి. బుద్ధిమంతులం అనుకునే మనుషులు కూడా వాటిని అనుకరించవలసిన గుణాలవి. ఒకరికొకరు సహకరించుకునే గుణం చీమలలో ఉన్నట్లు ఇతర ప్రాణులలో ఎక్కడా కనిపించదు. ఆకలితో అలమటిస్తున్న చీమ, కడుపునిండా తింటున్న మరియొక్క చీమదగ్గరకు వెళ్లి తన ఆకలిని గురించి సైగ చేయగానే ఆ చీమ తన శరీరం నుంచి ఒక ద్రవపదార్థాన్ని కురిపించి దానిచేత త్రాగిస్తుంది. దాంతో ఆకలిగొన్న ఆ చీమ కడుపు నిండి పోతుంది.

ఈ విధంగా లెక్కలోకిరాని ఈ చిన్నప్రాణులు మనిషికి నభ్యతను, తీర్చిదిద్దబడిన సామాజికజీవనవిధానాన్ని బోధిస్తున్నాయి. వీటియొక్క ఆశ్చర్యకరమైన రూపురేఖలు, పని చేసే తీరుతెన్నులు, చూస్తే మనిషి తనను తాను అన్నిటి కన్న గొప్పవాడినని గర్వించడం సరియైన పద్ధతి కాదని, పరమాత్మకు ఈ అల్పజీవుల మీద కూడా అపారదయ కలదని అర్థం చేసుకోవాలి. నిజానికి మనం నమ్రతా గుణాన్ని అభ్యసించదలిస్తే చీమలనుంచి చాలా నేర్చుకోవచ్చు.

*అనువాదం – కె.బి. సోమయాజులు*

★★★

**ఎదుటివారు మనల్ని అర్థం చేసుకోలేకపోవడం మనకు సంబంధం లేని విషయం.**

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-35

# గురు సత్తాలో మాతృ శక్తి విలీనం

నా ఆరోగ్యం మెల్లగా బాగుపడింది. ఆసుపత్రి నుండి నన్ను ఇంటికి పంపించారు. మధుర వచ్చిన తర్వాత కూడా నేను మంచం దిగలేదు. ప్రతి రోజు మృత్యుంజయశర్మ వచ్చి చూసిపోతూ ఉండేవారు. ఒక రోజు రాత్రి నేను నా గదిలో కూర్చుని ఉన్నాను. బయట కిటికీ వద్ద ఎవరో నిలబడి ఉన్నట్లు అనిపించింది. బయటకు చూస్తే మాతాజీ నిలబడి ఉన్నారు. ఆమెనాతో కుమారా! నేను ఈ భౌతిక శరీరాన్ని విడిచి పెట్ట బోతున్నాను? అన్నట్లుగా నాకు అనిపించింది. జాగ్రత్తగా చూస్తే అక్కడ ఎవరూ లేరు. నాకు బాగా ఆందోళన కల్గింది. చైతన్యాజీని శాంతికుంజ్‌కు ఫోన్‌చేసి మాతాజీఆరోగ్యంగూర్చి అడుగుమన్నాను. ఆయన ఫోనుజేసి బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీతో మాట్లాడారు. మాతాజీఆరోగ్యం ఏమీబాగాలేదని, డెహ్రాడూన్ లోని ఒక ఆసుపత్రిలో ఆమెను చేర్చారని చెప్పారు. తర్వాత ఒకరోజు మృత్యుంజయ శర్మ నావద్దకు వచ్చి, నేను ఆగ్రా వెళ్ళి కుట్లు తీసివేయించుకోవాలని చెప్పారు. మాతాజీ ఆరోగ్యం గురించి అడిగాను. ఆమె బాగానే ఉన్నారనీ, ఇప్పుడు శాంతికుంజ్‌లోనే ఉన్నారనీ చెప్పారు. నేను ఆగ్రా వెళ్ళి కుట్లు తీయించాను. కాని నా మనసు మాతాజీ ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతూనే ఉంది.

ఒక రోజు మాతాజీ నాకు కలలో కనిపించి తన శరీరాన్ని విడుస్తున్నట్లుగా తెలియజేసారు. నాకు బాగా ఆందోళన కల్గింది. మృత్యుంజయశర్మ శాంతికుంజ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత కూడా, నన్ను కలవడానికి తపోభూమికి రాలేదు. కాని ఆయన నేరుగా జంజగ్రాన్ ముద్రణాలయానికి వెళ్లి పోయారు. ఇది తెలిసి నేను ఆయన్ని కలవడానికి కారులో ముద్రణాలయానికి వెళ్లాను. మాతాజీ ఆరోగ్యం గూర్చి అడిగాను. మాతాజీకి పొత్తికడుపులో ఇబ్బంది ఏర్పడింది. నేను ఆయనతో మాతాజీ నాతో తన భౌతిక శరీరాన్ని విడువ బోతున్నట్లు చెప్పారు. కాని నువ్వునాతో మాతాజీ హరిద్వార్‌లో ఉన్నారని అబద్ధం చెపుతున్నావు అని నేను హరిద్వార్ బయలుదేరాను. ఆయన నన్ను ఆపడానికి ప్రయత్నించారు. 'మాతాజీ పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నందున ఆమెను ఢిల్లీలోని ఆసుపత్రిలో జేర్పించారు' అని చెప్పాడు. 'ఆమె ఢిల్లీ ఎప్పుడు వెళ్లింది' – అని అడిగాను 'నిన్ను ఆగ్రాలోని ఆసుపత్రి నుండి విడుదల చేసిన రోజునే, ఆమె ఆగ్రాలోని ఆదే ఆసుపత్రికి వచ్చారు. నీవు వదిలిన మంచంపైనే ఆమె పండుకున్నారు" – అన్నారు.

ఒక రోజున నన్ను ఢిల్లీ తీసికొని వెళ్తాను, మాతాజీని దర్శించుకోవడానికి – అన్నారు. డా॥ రాజుగారిని కలిసి 'మాతాజీ ఇక్కడకు ఎప్పుడు వచ్చారని' అడిగాను. 'ఆ రోజున నిన్న మధ్యాహ్నం 12 గంటలకు నిన్ను విడుదల చేసాను. మాతాజీ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చారు' – అని చెప్పారు. 'నేను ఉన్న మంచం ఖాళీ అయిన సంగతి మాతాజీకి ఎలా తెలిసింది' అని అడిగాను. డా॥ ఫరీక్ అన్నారు. "ప్రకాశ్‌జీ వచ్చారు. అన్ని విషయాలూ నన్ను అడిగి తెలిసుకున్నారు'. 'ఈ విషయం నేను కుట్లు తీయించు కోడానికి వచ్చినప్పుడు నాకు ఎందుకు చెప్పలేదని' అడిగాను మాతాజీ నాకు చెప్పవద్దని ఆపారట.

ఆ మరునాడు నేను మాతాజీని చూడటానికి ఢిల్లీ వెళ్లాను. ఆదొక పెద్ద ఆసుపత్రి. అనుమతి లేకుండా లోనికి పోవడానికి వీలుకాదని ప్రవేశ ద్వారం వద్ద నన్ను అడ్డుకున్నారు. చాలా ఇబ్బంది అయింది. చాలా బ్రతిమాలగా, నన్ను చూసీ, నా వయస్సును గమనించి నన్ను లోనికి పంపారు. మాతాజీని దర్శించగానే, నేను ఏడుపు ప్రారంభించాను. మీరు నాకు మీ శరీరాన్ని విడిచిపెడుతున్నానని స్ఫురింప జేసారు" అన్నాను. 'బిడ్డా'నీ కేదో భ్రమ కలిగి ఉంటుంది. అటువంటి దేమీలేదు – అన్నారు. మాతాజీ మీరు డా॥ ఫరీక్ నాకు తన విషయాలేవి తెలియ నీయవద్దని చెప్పారట ఎందుకని అని అడిగాను. దానికి మాతాజీ "నీ ఆరోగ్యం బాగాలేదు. అందుచేత నీకు చెప్పవద్దని అన్నాను' – అన్నారు. మూడో

మనిషికి హృదయం పవిత్రంగాను, జేబులు నిండుగాను ఉండాలి.

రోజు వారిని చూడటాని మరలా వెళ్లాను. తాను ఆరోగ్యంగానే ఉన్నాననీ, ఆందోళన పడవద్దనీ అన్నారు. ఆవెుకు పొత్తికడుపుకు ఆపరేషను జరిగింది. దేశం అంతటా ఉన్న తన బిడ్డలను కలవాలని ఆమె కోరారు. మాతాజీ "నా ఇద్దరు మనమరాళ్ల వివాహం నిశ్చయం చేసారు. పెద్దమ్మాయికి పిలానీ వాస్తవ్యులు శ్రీసుభాష్ కేషిక్ కుమారునితోనూ, రెండో అమ్మాయికి భోపాల్ వాస్తవ్యులు శ్రీ బలరామ్‌రావు గారి కుమారుని తోనూ వివాహం నిశ్చయమైంది. కుమారా, ఈ కుమార్తెల వివాహం నాకళ్ల ముందు జరిగితే, నా బాధ్యత తీరిపోతుంది" – అన్నారు. నన్ను శాంతి కుంజ్‌కు తీసికొని వెళ్లు, నాబిడ్డలందరినీ కలవాలి – అని అన్నారు. ఈ విషయం నాతో చాలా సార్లు చెప్పారు. ఇది వింటుంటే మాతాజీ నాకు కలలో కనుపించి చెప్పిన విషయాలు గుర్తుకు వచ్చాయి. నేను మథుర వెళ్లకుండా మాతాజీతోనే ఉంటానని చెప్పాను. అలాగే అన్నారు. కాని శైలబాలతోనూ, ప్రకాష్‌తోనూ, మృత్యుంజయ్‌తోనూ, నిర్మలతోనూ ఎలాగైనా నన్ను ఇక్కడ నుండి పంపించివేయుమనీ, నేను ఆమెబాధను చూడలేననీ, తనను చూడటానికి వచ్చినప్పుడల్లా దుఃఖిస్తున్నాననీ చెప్పారట. వారంతా నన్ను మథుర పొమ్మని బ్రతిమలాడారు. మరునాడు మాతాజీని హరిద్వార్ తీసికొని వెళుతున్నట్లు చెప్పారు. నేను మథుర వచ్చాను. మాతాజీ శాంతి కుంజ్‌కు జేరారు. ఒకరోజు నాకు ఒక ఫోను వచ్చింది. 'పండిత్‌జీ ఈరోజే బయలుదేరి, హరిద్వార్ రమ్మని' వెంటనే హరిద్వార్ బయలుదేరి వెళ్లాను. అక్కడకు వెళ్లిన తర్వాత తెలిసింది 'మాతాజీ మరణించారని' మాతాజీ భౌతిక కాయాన్ని చూడగానే, నాకు గుండెల్లో విపరీతమైన బాధగల్గింది. గుండె ఆగిపోతుందేమోనని అనిపించింది. అంతలోనే ఏదో అదృశ్యశక్తి నన్ను ఒక్క కుదుపుకుదిపింది. మాతాజీ స్వరంవినిపించింది. 'కుమారా! ధైర్యంగా ఉండు. నా మిగతా జీవితాన్ని నీకు ఇచ్చాను. నీకు ఆగ్రాలో ఆపరేషను జరిగిన తర్వాత, నీ పడకపై వెళ్లి పండుకున్నాను. నీ జబ్బంతా నేను స్వీకరించాను. నీవు చేయవలసిన పని చాలా మిగిలిఉంది. ఈ సంస్థ బాధ్యతంతా నీదే" – అన్నారు. మృత్యుంజయ శర్మ అన్నారు – పండిత్‌జీ, మా అందరిలో మీరే పెద్దవారు. మీరు ధైర్యంగా ఉంటేనే మాకు ధైర్యం. మీరు అధైర్య పడితే సంస్థ ఏమౌతుందో ఆలోచించండి. మాతాజీ అంత్యక్రియల తర్వాత నేను మథుర తిరిగి వచ్చాను. 'మాతాజీయే నా జీవితాన్ని పొడిగించారని నాకు బాగా నమ్మకం. ఇప్పుడు ఇక ఈ శరీరం ఆమెదే వారి పనిమీదే మిగతా జీవితాన్ని గడుపుతాను. గురుదేవులూ, మాతాజీ ఎల్లప్పుడు నాతోనే ఉంటారని నాకు బాగా నమ్మకం కుదిరింది.

పూజ్య శ్రీగురుదేవులు ఏడుసూత్రాల కార్యక్రమం ఒకటి ప్రకటించారు. మంచి పనులు అలవాటు చేసుకోవడానికీ, దుర్మార్గపు పనులు నిర్మూలించడానికి. ఈ పనులే ఇప్పుడు 'యుగ నిర్మాణయోజన' అనే ప్రణాలిక పేరుతో ఉన్నాయి. 'విచార్ క్రాంతి అభియాన్' అనేది కూడా అమలులో ఉంది. ఈ కార్యక్రమాలు 1971లోనే ప్రకటించారు. 'సంఘర్షాత్మక్' కార్యక్రమం పేరుతో గాయత్రి పూజా సమయంలో గురూజీ ప్రకటించారు. ప్రఖర ప్రజ్ఞ, సజల శ్రద్ధ నిర్మాణాలను గురూజీ, మాతాజీల జ్ఞాపికలుగా ప్రకటించిన సమయంలో, వాటిని దివ్యప్రదేశాలుగా, పూజార్హమైనవిగా ప్రకటించిన సమయంలో, 1977 గాయత్రి జయంతి రోజున, వేలాది మంది యుగసైనికులు, పూర్తి ఆత్మశక్తితో ప్రమాణ పత్రాలు సంతకం జేసి ఇచ్చారు. ఆ సంవత్సరం జూన్ పత్రికను, ప్రత్యేక సంచికగా 'క్రాంతి విశేషక్'గా, దేశమంతటా విడుదల చేశాను. దేశాన్ని క్రొత్త ఒరవడిలో నడిపించడానికి, యుగ సైనికులు కృషిజేస్తున్నారు. రానున్న రోజులలో ప్రజలలో ఒక అద్భుతమైన మంచి ఆలోచనాధోరణి (విచార్ క్రాంతి), గురుదేవుల సూక్ష్మ శక్తితో ప్రబలంగా కనిపిస్తుంది. యుగ పరివర్తన చాలా త్వరత్వరగా జరుగుతుంది. యుగసైనికుల కార్యకలాపాలతో ఒక మంచి వాతావరణం ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుంది. సాధకులకు ఈ ఏడుసూత్రాలూ స్థూలంగా వివరిస్తున్నాను. పాఠకులు వీటిని శ్రద్ధగా చదివి వీలైనంత సహాయ సహకారాలు ఈ సంస్థకు అందించాలని కోరుతున్నాను.

★★★

**క్షమవలన ఇతరులలో పరివర్తన వస్తుంది.**

జీవించేకళ

# ధర్మమే మానవుని ఉన్నతికి సోపానం

ప్రాచీన కాలం నుండి ధర్మమే మానవుని క్రమశిక్షణలో ఉంచి ఉన్నత మార్గాలకు దారి చూపుతూ వచ్చింది. సమయాన్ని బట్టి అది రాజతంత్రం – ధర్మతంత్రంగా రెండు విధాలయింది. అయినా ధర్మం యొక్క ఔన్నత్యం గొప్పది కనుక మానవుని హృదయాలలో దాని ప్రభావం ఎప్పటికీ నిలిచిపోయింది. శాసన క్షేత్రం వ్యవహారానికి సంబంధించినది, ధర్మక్షేత్రం వ్యక్తిత్వానికి సంబంధించినది. ధర్మం వ్యక్తిలో శీలాన్ని పెంపొందిస్తుంది. శాసన సాధనాల ఉత్పత్తి నుంచి, పంపకం నుంచి సురక్ష మొదలైన భౌతిక ప్రయోజనాలను పూర్తి చేస్తుంది. వస్తువు ఉండగానే సరికాదు. కావలసినంత లేకపోయినా, ఉన్న దానిని పద్ధతిగా పెట్టుకో లేకపోయినా నష్టం విపరీతంగా జరుగుతుంది. అందుకనే శాసన వ్యవస్థ ఉద్భవించింది. వస్తువుల్ని పద్ధతిగా పెట్టే బాధ్యత కూడా చిన్న విషయం కాదు, శాసన పద్ధతి అంటే ఆకర్షణ ఎంత ఉంటుందో భయం కూడా అంతే ఉండడానికి కారణం శాసనం చేతిలోని ధనము, శిక్షలే కారణం. ఎన్ని ఉన్నా ధర్మం తన స్థానం కోల్పోలేదు, ఔన్నత్యం, ఉపయోగం ఎప్పటిలానే ఉన్నాయి. మానవుని మనస్సులో పట్టిష్ఠమైన విశ్వాసాన్ని కలిగించేందుకు, ఆలోచనలలో సదాశయాలను నింపేందుకు, నీతి నియమాలతో కార్యక్రమాలు నడిపేందుకు ఒక్క ధర్మానికే శక్తి ఉంది. ఆలోచన, నడవడికలకు గొప్పమహత్యం ఉంది. వ్యక్తి యొక్క మూలసంపద అదే సమాజం అంటే మనుష్యుల గుంపు. మనుష్యుల నడవడిక, దృక్పథాలు ఎలా ఉంటే సమాజ స్వరూపం అలా తయారవుతుంది. మన చేతలే పరిస్థితులకి జన్మనిస్తాయి. శాసనాలు మనిషిని అదుపుకొంటాయి. అదుపులో పెడతాయి. మనస్సులోంచి మేధస్సులోంచి అవి బయలు దేరతాయి. మనిషి మనసులో ధర్మ నిరతి ఉంటే పద్ధతి వేరుగా ఉంటుంది. ధర్మానికి మనిషిని, తద్వారా సమాజాన్ని, తద్వారా దేశాన్ని సుస్థిరం, సుభిక్షం చేయగల శక్తి ఉంటుంది. పనులను శాసనాలు అదుపులో పెడతాయి – కాని ధర్మం చిత్తాన్ని సంస్కరిస్తుంది. ఉన్నతంగా చేస్తుంది. వైభవం కంటే వ్యక్తి సంస్కారం, ధర్మరక్ష, ధర్మాచరణ గొప్పతనం శాసనం యొక్క మహత్తు అందరికీ తెలిసిందే! అరాజకత్వాన్ని ఎవరూ ఆహ్వానించరు. రాజశాసనాన్ని భరిస్తారు. కాని ప్రతి ఒక్కరు మరొకరి పై అధికారం చెలాయిస్తే ఎవరూ ఊరుకోరు. దుష్టులు కూడా న్యాయ వ్యవస్థ ద్వారా తమ ప్రాణాలు నిలుపుకోవాలనే చూస్తారు. అవినీతి సర్వత్రా వ్యాపిస్తుంది. దానిని నిర్మూలించే పరిస్థితి కూడా అరాజకత్వంలో ఉండదు. ఇద్దరికి ఇరవైమంది జవాబు చెప్తారు. బలహీనులయిన వాళ్ళు ఇరవైమంది కలిస్తే ఇద్దరు బలిష్ఠులను అవలీలగా ఎత్తిపడవేస్తారు. అరాజకత్వాన్ని ఎలా సహించలేమో అలాగే అధర్మాన్ని సహించలేము. నీతిని, మర్యాదని విడిచిపెట్టిన మనిషి క్రూర జంతువు కంటే క్రూరంగా ప్రవర్తిస్తాడు. ఎందుకంటే మనిషి దగ్గర ప్రణాళికలు చేసేందుకు ఆలోచన ఉంది కదా! జంతువుకు లేదు. పశువుకి కడుపునిండితే ఆక్రమణ చేయదు. ఆకలి కోసమే ఆక్రమణ – హింస. కాని మనిషి గర్వంతో, అహంకారంతో వేల మందిని మట్టుపెడతాడు. మధ్యకాలీన సామంత వాదంతో చరిత్రపుటలన్నీ రక్తం పులుముకొని దీనిలో సాక్షిగా నిలిచాయి. రావణుడు, దుర్యోధనుడు, జరాసంధుడు హిట్లరు, చంగీజ్‌ఖాన్, నాదిర్‌షా, ఇంకా ఎందరో ఉదాహరణలుగా నిలిచారు. ఆతంకవాదులు అల్లరిమూకలు అవిశ్వాస పరులే అరాచకత్వాన్ని లేవనెత్తుతారు. అరాజకత్వం, అధర్మ ప్రవర్తన రెండూ ఒక దానికి మించినది మరొకటి.

ఎన్ని కఠినమైన శాసనాలున్నా, శిక్షలున్నా, పద్ధతులున్నా వాటిని పరిరక్షించి, ప్రయోగించేందుకు విశ్వాస పాత్రులు నీతిమంతులు అయిన కార్యకర్తలు లేకపోతే పతనం – పరాభవం సమాజాన్ని వరిస్తాయి. ప్రజలు దుష్టులై, దురాచారులై అక్రమాలకు పాల్పడితే ఒక మనిషికి ఒక పోలీసు ఉన్నాచాలదు.

**ఇతరుల తప్పులను నీవు క్షమిస్తే నీ తప్పులను దేవుడు క్షమిస్తాడు.**

పోలీసులూ మనుష్యులే! వారు నీతిభ్రష్టులైతే – న్యాయ నియంత్రణను ప్రక్కకు పెట్టాల్సిందే! శాసనాన్ని ఉద్ధరించే విషయాలు శాస్త్రాలపై నిలబడి లేవు. నీతిపరులైన ప్రజల భుజస్కంధాలపై ఉన్నాయి. వారి ధర్మాచరణపై ఆధారపడి ఉన్నాయి. ఎవరి మనసులో వారికి చైతన్యం కలిగి ధర్మపథంలో నడవగలగాలిగాని కేవలం శాసనాలు మనిషిని మార్చలేవు. భౌతికమైన సంపదలందించవచ్చుగాని మనోక్షేత్రాన్ని బాగు చేయడం సులభం కాదు. ప్రభుత్వ ప్రచారం – సమాచారాలు నమ్మకపోతే వాటి ద్వారా ఆలోచనలను ఉన్నతంగా వ్యవహారాలను ఆదర్శవంతంగా ప్రజల మనసులో లోతుగా నాటడం సంభవంకాదు, భయపెట్టి, లోభపెట్టి మనుష్యులను ఆదర్శ మార్గం నుంచి పడవేయడానికి పాల్పడకూడదనే నిష్ఠ మనస్సులో ఉండాలి. పోగుపోసిన శ్రేష్ఠతత్వాలే "ధర్మం". దీని ఉపయోగం జనులు తెలుసుకొన్నపుడు వారికి సకల సన్మానాలు అందుతాయి. ధర్మాన్ని మనం రక్షిస్తే మనల్ని ధర్మం రక్షిస్తుంది. అనిపెద్దలు చెప్పే ఆప్తవచనంపై విశ్వాసం పెంచుకొంటే మంచిది. అధర్మాన్ని ఆచరిస్తే దుఃఖము, వినాశకరమైన వాతావరణం తయారవుతుంది. సద్భావన సజ్జనత్వం, సహకారం, సంయమశీలత, ఉదారత ఇవన్నీ ధర్మతత్వం యొక్క స్వరూపమే.

భారతదేశంలో దేవాలయాలకు తీర్థయాత్రలకి, కర్మకాండలకి సోమవతీ అమావాస్య నుండి కుంభమేలా వంటి పర్వాల దాక చేసే ఖర్చు–ఇంతఅని అంచనా వేయలేం. ఇక్కడ ధర్మావలంబులైన సాధుబాబాల సంఖ్య లక్షల్లో ఉంటుంది. 40 లక్షల మంది దాక పురోహితులు ఉంటారు. జీవనభృతి పూర్తిగా దానిలో సంపాదించలేని వారు ఉన్నారు. ఈ కోటి మంది ధర్మ జీవుల భారం ధార్మిక ప్రేమికులే భరించాల్సి ఉంటుంది. ధార్మిక కార్యక్రమాల కోసం నిత్య జీవితంలో చాలా భాగం వినియోగిస్తున్న వారి కోసం రెండు చేతులా ఖర్చు చేస్తారు. ఉపార్జన, నిర్వహణ తరువాత మూడవ స్థానంలో మానవీయ శక్తి ధర్మం కోసం వినియోగింపబడుతోంది. శ్రమ, సమయం, ధనం అన్నీ ధర్మం కోసం ఉపయోగిస్తారు. ఇది ఒక ఆధ్యాత్మిక సంపదగా పరిగణిస్తారు.

రాష్ట్రం యొక్క సర్వతో ముఖ సమర్థత, వ్యక్తి వికాసం దీని మీదే ఆధారపడి ఉన్నాయి. మనిషిలోని శక్తి సామర్థ్యాలను పెంపొందించాలన్నా – దిశానిర్దేశం చేయాలన్నా ధర్మం ఒక్కటే చేయగలదు. మహోన్నతమైన అంతః ప్రేరణలకు విశ్వాసాలు జోడించి నడిపించడమే ధర్మతత్వం. నేటి సంప్రదాయవాదం దీని నీడగానే భావించాలి.

శాసనాలలోని తేడాలను బాగు చేయడానికి ఆందోళనలు చెలరేగుతాయి. ఆర్థికస్థితులను సమానం చేయాలన్నా వ్యక్తిగతంగా లేక సాముహికంగా ప్రజలు పురుషార్థ ప్రయోజనాలు చేపడతారు. నిర్వహణ, వినోదం, సౌకర్యసాధనాలు చదువు–వైద్యం మొదలైన విషయాలలో ఉత్సాహం చూపి, ప్రయత్నాలు చేయడం చూస్తూ ఉంటాం. జనసముదాయంలో భ్రాంతి కల్పించి, స్వార్థాన్ని పెంచే స్థితి తప్ప వేరేఏమీ కనిపించడం లేదు.

మనష్యులలో ఉన్న భ్రాంతిని తొలగించి, ధర్మం యొక్క మూల స్వరూపాన్ని, ఉపయోగాన్ని తెలియచెప్పి, దానిమూలంగా వచ్చే ప్రగతిని వివరించి, సర్వసాధారణ వ్యక్తికి కూడా అర్థం అయ్యేలా చేసే అవసరం చాలా ఉంది. ధర్మం అంటే ఏమిటి? సంప్రదాయాలంటే ఏమిటి? ఈ రెండింటిలో తేడాఏమిటి? తెలుసుకొని, తెలియ చెప్పాల్సిన అవసరం ఉంది. పేడ–బెల్లం ఒకటేఅనే మొండి మనస్తత్వాలు బయలు దేరాయి. అసలుని వదలి నకిలీని పూజిస్తున్నారు. సంప్రదాయాల పేరుతో ప్రజలు యుద్ధాలు చేస్తున్నారు. న్యాయాన్ని కాలరాస్తున్నారు. పరంపరలను అనుసరిస్తున్నారు. వివేకం ఎంత బలహీనమయిందో – ప్రచారం ఎంత బలంపుంజుకొన్నదో చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

నీర–క్షీర న్యాయాన్ని అవలంబించాలి. నిజం ఏమిటో అబద్ధం ఏమిటో తెలుసుకోవలసిన అవసరాన్ని అందరు గుర్తించాలి.

అనువాదం – టి. జ్ఞానప్రసూన

★★★

**కట్టెలు లేకుండా కాల్చేవి - కక్ష, కార్పణ్యం, ఈర్ష్య, ద్వేషం, పగ, క్రోధం**

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-64

# భవిత కోసం ప్రతీక్ష-1

శ్రీరామ్ అఖండ జ్యోతి కార్యాలయానికి ఒక గదిని కేటాయించారు. దానిలో ఒక కర్ర మేజాబల్ల, కుర్చీ అమర్చారు. ఉత్తర ప్రత్యుత్తరాలకు, జమ ఖర్చుల లెక్కలకు అనుభవజ్ఞుడైన ఒక స్వరాజ్య సమర సేనాని వచ్చేవారు. ఆయన పేరు భూదేవ శర్మ. అఖండ జ్యోతి చందాదార్లపేర్లను ఒక రిజిస్టరులో నమోదు చేసేవారు. పత్రిక ప్రతుల సంఖ్య వేయిదాటింది. చందా దారులందరి పేర్లు ఒక రిజిస్టరులో పట్టాయి. జమాఖర్చుల లెక్కల కోసం మరో రిజిస్టరు ఉంది. భూదేవ శర్మ కూడ ఆ గదిలో కూర్చునేవారు. సాధారణంగా శ్రీరామ్ తమ పూజ గది ప్రక్క ఉన్న గదిలో నేలమీద అసనం వేసుకుని కూర్చునేవారు. వారి ఎదుట ఒక నలుచదరపు బల్ల ఉండేది. కుడివైపున కొన్ని పుస్తకాలు ఉండేవి. కలుసుకునే వ్యక్తులు ఆ గదిలోనే కూర్చునేవారు. సలహా సంప్రదింపుల ప్రక్రియ ఆగదిలోనే సాగేది. తమను కలుసుకోవడానికి ఎవరు రాని సమయంలో శ్రీరామ్ వ్రాయడంలో అధ్యయనంలో నిమగ్నం అయ్యేవారు. కలుసుకునే వారి సంఖ్య పెరగడంతో దానికి సమయం నిర్ణయమయింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత, అంతకు ముందు శ్రీరామ్ వ్రాయడంలో, చదవడంలో, ఉత్తరాలు వ్రాయడంలో పూర్తిగా నిమగ్నులై ఉండేవారు. అవసరమైన పనులకు బయటకివెళ్లే సమయమూ అదే. రెండు గంటల తర్వాత వారు సాధారణంగా తమ గదిలోనే ఉండేవారు. ఆ గది పేరు సలహా సంప్రదింపుల గది!

1946 నాటికి ఈ పద్ధతి ఏర్పడింది. 'అఖండజ్యోతి' ముద్రణ, ప్రచురణ పని కూడ క్రమబద్ధం అయింది. ఈలోగా 'అఖండ జ్యోతి' పత్రిక ప్రత్యేక సంచికలు కొన్ని ప్రచురితం అయినాయి. అందుకోసం తెచ్చిన చేబదులు సమయానికి తిరిగి ఇవ్వబడింది. సాహిత్య, సంపర్కాల రంగంలో ప్రారంభమయిన కార్యకలాపాలు యథావిధిగా సాగుతున్నాయి. ఆరంభంలోని ప్రతిష్టంభన దాదాపు తొలగిపోయింది. ఈలోగా ఒక వివాదం ఏర్పడింది - ఆకస్మికంగా.

శ్రీరామ్ అపుడు మథుర ఆర్య సమాజానికి అధ్యక్షులు కూడా. కొద్ది నెలల క్రితం విగ్రహారాధనపై చౌక్‌లో వివాదం జరిగింది. గాయత్రి యొక్క సాకార ఉపాసన జరపవద్దని ఆర్యసమాజ కార్యకర్తలు పట్టుపట్టినా, శ్రీరామ్ అందుకు అంగీకరించలేదు. అపుడు కార్యకర్తలు తమ అభ్యంతరాన్ని ఉపసంహరించుకున్నారు. శ్రీరామ్‌కు ఆర్యసమాజ వేదికను అప్పగించారు.

అయితే - అఖండ జ్యోతి ప్రభావం పెరగడంతో, శ్రీరామ్ చుట్టూ కొందరు శ్రద్ధాళువులు చేరసాగడంతో - ఆ కార్యకర్తలే తాము ఉపసంహరించుకున్న అభ్యంతరాన్ని తిరుగదోడారు. ఆదివారపు యజ్ఞాలలో మొదట గుసగుసలుగా చర్చ జరిగింది. ఆ తర్వాత అది బాహాటంగా జరిగింది. ఈ చర్చల సంగతి శ్రీరామ్ చెవిన పడింది. వాటికి సమాధానం ఇచ్చి ముందుకుపోవడం కన్న వేచిచూడడం సముచితమని ఆయన భావించారు. చివరికి ఆర్యసమాజ కార్యకర్తల జట్టు ఒక రోజున అఖండ జ్యోతి కార్యాలయానికి రానే వచ్చింది.

ద్వారకా ప్రసాద్ అనే కార్యకర్త నాయకత్వంలో వచ్చిన నలుగురయిదుగురు ఆర్యసమాజీయులు ఉపోద్ఘాతమేది లేకుండానే చర్చకు దిగారు. "శ్రీరామ్ గాయత్రీ పూజ ప్రచారాన్ని వదులుకోవాలి లేదా ఆర్యసమాజ్ అధ్యక్ష పదవిని వదులుకోవాలి" ఇది వారి వాదన. శ్రీరామ్ వినమ్రంగా ఇలా అన్నారు.

మీరు ఏ అధికారంతో ఇదంతా చెప్పడానికి వచ్చారో నాకు తెలియదు. ఆర్యసమాజం మీ స్వంత సంస్థ అయితే నేను తక్షణం నిర్ణయం తీసుకునే వాణ్ణే. కానీ వాస్తవం అదికాదు. ఈ సంస్థ వందలాది వేలాది ప్రజల కుటుంబ - ఆధ్యాత్మిక సంస్థ. ఆ ప్రజల ఎదుట నా అభిప్రాయాన్ని స్పష్టం చేయకుండా ఆర్యసమాజపు బాధ్యత నుండి వైదొలగను.

"విగ్రహారాధనపై స్వామి దయానందుల సిద్ధాంతం సుస్పష్టమే. ఆ విషయమై ఎవరికీ స్పష్టీకరణ ఇవ్వ నవసరం లేదు" అని ద్వారకా బాబు అన్నారు. అందుకు శ్రీరామ్ ఇలా అన్నారు.

"నేను నా అభిప్రాయాన్ని స్వామి దయానంద ముందు ఉంచి ఉంటే, వారు బహుశా తమ సిద్ధాంతంలో కొంత సవరణ జరిపి ఉండేవారని నేను నమ్ముతున్నాను".

**పొగడ్త బహుమానం అయితే - ప్రశంస ప్రతిఫలం అవుతుంది.**

ఈ మాట విని ద్వారకా బాబు ఆయనతో వచ్చిన కార్యకర్తలంతా బిగ్గరగా నవ్వారు. ఆ నవ్వులో వెక్కిరింత ఉంది వారిలో ఒకరు ఇలా అనేశారు కూడా – "స్వామి దయానందుల కన్న గొప్ప విద్వాంసులు, సంత్‌లా మీరు?" శ్రీరామ్ ఇలా జవాబిచ్చారు.

"కాను, నేను ఆయన ముందు చిన్న బాలుడను. అయితే ఆయన భుజాలపై కూర్చుని ఉన్నాను. వారి భుజాలపై కూర్చోవడం వల్ల నాకు వారికన్న ఎక్కువ దూరం కానవస్తోంది"

## ఆర్యసమాజ్ సమావేశం

"ఏమి కానవస్తోంది?" – అని ఆ కార్యకర్త అడిగాడు. జవాబివ్వడానికి బదులు శ్రీరామ్ ఇలా అన్నారు. "ఆర్య సమాజ్ సభ్యుల ముందు నా అభిప్రాయాన్ని ఉంచుతాను. అక్కడేనా నిర్ణయాన్ని వినిపిస్తాను".

కార్యకర్తల జట్టు తిరిగి వెళ్లింది. ఒక వారం నోటీసు ఇచ్చి, చౌక్ ఆర్యసమాజ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరోజు బహుశ మార్చి 16. 50–60 మంది కార్యకర్తలు వచ్చారు. చర్చ విషయం ముందుగానే తెలుపబడింది. కనుక కార్యకర్తలు తయారై వచ్చారు. కొందరు శ్రీరామ్ వ్యతిరేకుల వైపు, కొందరు శ్రీరామ్ వైపు. సాకారఉపాసనద్వారా శ్రీరామ్ మరింత విస్తృతమైన క్షేత్రంలో మేలుకొలుపు తెస్తున్నారని వారు భావిస్తున్నారు. అయితే వారి వద్ద తమ అభిప్రాయాన్ని బలపరచే హేతువాదం లేదు. స్వామి దయానందుల వాక్యాలు వారి నోళ్లను మూసివేశాయి.

కార్యకర్తల వాదోపవాదాలు సాగాయి. సమాజ కార్యదర్శి వీర్‌సింగ్ ఇలా అన్నారు. "తన అభిప్రాయాన్ని వ్యక్తపరచడానికి శ్రీరామ్‌కు మనం అవకాశాన్ని ఇవ్వాలి. దయచేసి మీరంతా ప్రశాంతంగా ఉండండి". కార్యకర్తలను శాంతింపజేయడానికై కార్యదర్శి, ఇతర వరిష్ఠ కార్యకర్తలు గట్టిగా ప్రయత్నించవలసి వచ్చింది. సమావేశంలో చర్చ జరిపేందుకు తగిన ప్రశాంత వాతావరణం ఏర్పడిన తర్వాత వీర్‌సింగ్ ఇలా అడిగారు– "శ్రీరామ్‌జీ! కార్యకర్తలకు ఆందోళన కలిగిస్తున్న విషయం నిజమేనా? మీరు స్వామి దయానందుల విషయంలో అభ్యంతర కరమైన మాట అన్నారా?". శ్రీరామ్ స్పష్టంగా, బిగ్గరగా ఇలా అన్నారు– "ఒక పిల్లవాడు తన సంరక్షకుని భుజాలమీద కూర్చోవడం, ఆకారణాన మరింత దూరం చూచినట్లు చెప్పడం అభ్యంతరకరం అయితే, నేను తప్పకుండా దోషినే, స్వామీజీ నా అభిప్రాయాన్ని విని ఉంటే, బహుశా వారు నాతో ఏకీభవించి ఉండేవారని మాత్రమే నేను చెప్పాను.

ఆతర్వాత శ్రీరామ్ గతవారం జరిగిన సంభాషణను పూర్తిగా వివరించారు. గొడవ చేస్తున్న కార్యకర్తలకు నోరాడలేదు. అయినా ద్వారకా బాబు లేచి ఇలా అన్నారు – "విగ్రహారాధనపై మీరు మీ అభిప్రాయం చెప్పండి. మీ నిర్ణయాన్ని కూడ తెలుపండి".

## విగ్రహారాధనపై అభిప్రాయ ప్రకటన

శ్రీరామ్ చెప్పిన మాటల సారాంశం ఇది. హిందూ సమాజంలో 90–95 శాతం ప్రజలు సాకార ఉపాసనను నమ్ముతున్నారు. వారి శ్రద్ధను తిరస్కరిస్తే వారి మనస్సులు గాయపడతాయి. వారిని వైదిక సంప్రదాయం నుండి బహిష్కరించడం అవుతుంది. తన అనుచరులను తిరస్కరించే వేదిక బ్రతికిబట్టకట్టజాలదు. విగ్రహారాధనను మనం దుయ్యబడితే మనం ముందుకు పోలేము. విగ్రహారాధనను నమ్మేవారు నమ్మవచ్చు. నమ్మనివారునమ్మకపోవచ్చు.

"స్వామి దయానందులు ఒక సిద్ధాంతాన్ని స్థాపించారు. మనం దానికివిరుద్ధంగా ఎందుకు పోవాలి?" – అని ఒక కార్యకర్త ప్రశ్నించాడు. శ్రీరామ్ ఇలా అన్నారు.

"స్వామి దయానందులు ఆ సిద్ధాంతాన్ని స్థాపించడానికి కారణం ఏమిటిఅని మనం ఆలోచించాలి, ఆ యుగంలో శ్రద్ధ భావనల కన్న తర్కానికీ, వివేకానికీ హెచ్చు ప్రాధాన్యత ఇచ్చిన ఒక సంత్ – మహా పురుషులు స్వామి దయానందులు. విగ్రహారాధన పేరిట, ఆలయాల పేరిట జరుగుతూ వచ్చిన వంచననూ, బూటకాన్నీ స్వామీజీ వ్యతిరేకించారన్నది నా అభిప్రాయం. వారి వ్యతిరేకత ఎంత తీవ్రంగా ఉన్నదంటే– ఆలయాల పై పూజలపై బ్రతుకుదెరువుసాగించేవారు గాబరాపడ్డారు. వారు కుతర్కాలు చేయసాగారు. ఫలితంగా ఆలోచన, వివేకం నశించి పోయాయి. మన మనీషి వర్గం ఒక చీకటి సొరంగంలో దారి తప్పింది."

## వివాదానికి తెర

శ్రీరామ్ ఇలా చెప్పారు – సామాన్యమైన భావదశ కలిగిన ప్రజలకు విగ్రహం ఒక మంచి మాధ్యమం, దాన్ని మాధ్యమంగా,

**విషయ పరిజ్ఞానం గల వ్యక్తి వివరించి చెప్పకపోవటం నేరం.**

ఆసరాగా చేసుకుని ప్రజలు తమ లోపల ఆధ్యాత్మిక గుణాలను వికసింపజేసుకొనగలుగుతారు. విగ్రహాన్ని తొలగిస్తే – 99శాతం ప్రజలకు ఆధ్యాత్మిక వికాసానికి అవకాశం లేకుండాపోతుంది. సామాన్య ప్రజల భావనలకు దిశను ఇవ్వని కారణంగా ఆర్యసమాజ ప్రసారం ఆగిపోయింది. ప్రజలు శ్రద్ధా విశ్వాసాలకు కేంద్ర బిందువును ఆర్య సమాజ కార్యపద్ధతీ, కార్యకర్తలూ కుదిపివేస్తున్నారు.

ఇలా శ్రీరామ్ తమ అభిప్రాయాన్ని వివరిస్తున్నారు. కార్యకర్తలు వారి మాటలను శ్రద్ధగా వింటున్నారు. విగ్రహారాధన పట్ల వారి వ్యతిరేకత నీరుగారిపోతోంది. శ్రీరామ్ తమ ప్రసంగాన్ని ముగిస్తూ ఇలా అన్నారు –

"ఇక నా నిర్ణయం సంగతి నన్ను అధ్యక్షునిగా చేసిన వ్యక్తులే దాన్ని నిర్ణయించాలి. నేను నా నిర్ణయాన్ని ఈ కాగితంమీద వ్రాసి ఉంచాను. అయితే, ఆర్యసమాజంలో నేను ఉండడం, ఉండకపోవడం అనే విషయంపై కార్యకర్తల అభిప్రాయాలను పరిగణించాలి. అలా ఓట్లు లెక్కించిన తర్వాతనే కాగితాన్ని చదవాలని నా అభ్యర్థన".

ఓటింగు జరిగింది. 60 మంది సభ్యులలో 32 మంది శ్రీరామ్‌కు అనుకూలంగా చేతులెత్తారు. ఆయన అధ్యక్షులుగా కొనసాగాలన్నది వారి అభిప్రాయం. 28 మంది సభ్యులు ఆయనను తొలగించాలని కోరారు. శ్రీరామ్‌కు అధిక సంఖ్యాకుల మద్దతు ఉన్నదని వీర్‌సింగ్ ప్రకటించారు. ఆర్యసమాజం యొక్క భావనల పట్ల అభిప్రాయభేదాలను, ఆ భావనలలో సవరణలనూ సాధ్యమైనంత వరకు పరిహరించాలని ఆయన ఆ సందర్భంగా సూచించారు.

"కానీ, నా అభిప్రాయాన్ని కూడ తెలుసుకోండి మహాశయా!"

అని శ్రీరామ్ కోరారు ఓటింగుకు ముందు తాను ఇచ్చిన పత్రాన్ని చదివే అవకాశాన్ని తనకు ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు. ఆ పత్రంలో శ్రీరామ్ ఇలా వ్రాశారు.

"ఆదీ–అంతమూ లేని సనాతన ధర్మం యొక్క వినమ్ర విద్యార్థిగా, సాధకునిగా నేను నన్ను పరిగణించు కుంటున్నాను. ఆర్యసమాజంలో తీక్షణమైన వివేకానికీ, సజీవమైన ఆలోచనకు అవకాశం ఉండేది. ఆ తత్వం ఆధారంగా మన సంస్కృతికీ, సంప్రదాయానికీ సేవ చేద్దామని అనుకున్నాను. ఆ పని కష్టమని కొద్ది సమయంలోనే నాకు అనుభవమయింది. కనుక, నేను మరో దారిని ఏర్పరచుకుంటున్నాను. వేదిక మీద ఉండి మిత్రులకు అసౌకర్యం కలిగించడం నాకు ఇష్టం లేదు కనుక నాకు సెలవు ఇవ్వండి".

అధ్యక్ష పదవికి రాజీనామా ఇస్తున్న ప్రకటన అది. ఆ తర్వాత శ్రీరామ్ ఇలా అన్నారు –

"సాధనలో, సమరంలో మనమంతా కలసి పని చేద్దాం. కలసిమెలసి పని చేయ గలిగే మిత్రులందరినీ కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నాను".

ఈ ప్రకటన తర్వాత ఎవరికీ చెప్పదగినదేమీ మిగులలేదు.

★★★

## అందరికీ ఆహ్వానం
## సంజీవనీ సాధనాశిబిరం - యుగశిల్పి శిబిరం

ప్రియ పరిజనులారా !

1-9-09 నుండి 9-9-09 వరకు 9 రోజులు **సంజీవనీ సాధనాశిబిరం** మరియు 1-9-09 నుండి 27-9-09 వరకు 27 రోజులు **యుగశిల్పి శిబిరం** శాంతికుంజ్ హరిద్వార్‌లో తెలుగువారికి ప్రత్యేకంగా తెలుగులో నిర్వహింపబడతాయి. కార్యకర్తలు తమ తమ గ్రామాల నుండి, పట్టణాల నుండి ఆసక్తిగలవారిని ప్రోత్సహించి పంపించే ఏర్పాటు చేయగలరు. ఇప్పటినుండి మీమీ ప్రయత్నాలలో ఉండగలరని కోరుచున్నాము.

మీ
**అశ్విని సుబ్బారావు**
*దక్షిణభారత సంచాలకులు*

**విషయ పరిజ్ఞానం లేని వ్యక్తి మౌనంగా ఉండటం తెలివిగల పని.**

పరమపూజ్య గురుదేవుల అమృతవాణి

# సంస్కృతీ సీతను తిరిగి తెచ్చుకోవాలి

**సంస్కృతీ సీత అపహరించబడింది :**

సీతను రావణుడు అపహరించాడు. ఆ సమయంలో రాములవారు రాక్షసులతో పోరాడి రావణుడిని చంపి సీతను తిరిగితెచ్చారు. ఇతిహాసంలోని ఆ ఘట్టం పునరావృత్తి జరగాలి. మధ్యయుగంలో మన సంస్కృతి అనెడి సీత వనవాసానికి వెళ్ళింది. ఆ సమయంలో పలు సంప్రదాయాలు, మతాలు, బాబాజీల ప్రచారాలు విజృంభించాయి. దానితో మన సంస్కృతి బలహీనపబడింది. అటువంటి సంస్కృతికి అనాచారం తోడయ్యింది. బుద్ధుని సమయంలో కూడా కొంత కాలం సంస్కృతి అపహాస్యానికి గురైంది. మద్య మాంసాదుల వల్ల సంస్కృతి కళంకితం అయింది.

మీకు తెలీదు. ఒకప్పుడు ఆటవిక జీవనంలో మానవులను చంపి హోమం చెయ్యడం, గుఱ్ఱాలను, ఆవులను కూడా హోమంలో వేయడం చేసేవారు. అందువల్ల యజ్ఞకర్మకాండ కూడా అసహ్యించుకునే పరిస్థితికి చేరింది. మరి ఈనాటి పరిస్థితి ఏమిటి? ఇదీ ఒకరకమైన ఆటవిక జీవనమే. ఈనాడు సంస్కృతీ సీత కూడా విదేశీ రాక్షసుల చేతిలో పడి బయటకు వచ్చేందుకు మార్గం తెలియక ప్రాణాపాయస్థితిలో ఉంది. లంక చుట్టూ సముద్రం ఉంది. బలవంతుడైన రావణుడు ఉన్నాడు. ఇవన్నీ దాటి వచ్చి సీతను తిరిగి తీసుకురావడం ఎంతో కష్టమైన పని. అది మధ్యకాలీన యుగం. అందువల్ల ఎంతో కొంత ఆస్తికత, యజ్ఞకార్యక్రమాలు మిగిలి ఉండేవి. ధర్మం నామమాత్రంగానైనా ఉండేది. అందువల్ల రాముని ప్రయత్నం ఫలించింది.

**ఈనాటి యుగం నాస్తికులది:**

ఈనాడు ధర్మం మత్తుమందుగా చెప్పబడుతోంది. చదువుకున్నవారి వద్దకు వెళ్ళి, ధర్మమంటే ఏమిటి అని అడిగితే అది మత్తుమందులాంటిది, అది తీసుకున్న మనిషి స్పృహ లేకుండా ఉంటాడు, కర్తవ్యాలు కూడా మర్చిపోతాడు అని చెప్తున్నారు. తెలివైన వ్యక్తులు, మేధావులు కూడా సంస్కృతి గురించి మత్తు మందు అనే మాటనే వాడుతున్నారు. దార్శనికవాదులు కూడా భగవంతుని గురించి చెప్తూ భగవంతుడు చనిపోయాడు, ఆయనను లోతుగా పాతిపెట్టాం. ఇక ఆయన మరల జీవించే అవకాశమే లేదు, ఆయనను మనమే చంపుకున్నాం అంటారు. నాస్తికులైతే అసలు ఆ పేరనేది ఈ ప్రపంచంలో లేదంటారు. డార్విన్ నుండి ఫ్రాయిడ్ వరకు గల వైజ్ఞానికులు అన్నా చెల్లెళ్ల మధ్య, తండ్రి కూతుళ్ళ మధ్య పవిత్రత కూడ మూఢత్వమే అన్నారు.

**మానవ జీవితం నాశనమైపోతుంది:**

ఇప్పటిదాకా మనం విజ్ఞానం, నాస్తికవాదదర్శనం, రాక్షసత్వం గురించి చెప్పుకున్నాం. ఈనాడు మన సంస్కృతి కూడా రాక్షసుల చేతుల్లోపడింది. దానిని తిరిగి తీసుకురాకపోతే ప్రపంచం నాశనమైపోతుంది. పరలోకం కూడా పాడవుతుంది. మన సంస్కృతి, ధర్మం, ఏవైతే ఆస్తికత అని అనుకుంటున్నామో అవి ఏవీ మిగలవు. గృహస్థాశ్రమ జీవితం తుడిచిపెట్టుకుపోతుంది.

**నిస్సారమైన కుటుంబ జీవితం:**

ఈనాడు గృహస్థజీవితం ఎలా ఉంది? తల్లి, తండ్రి అంటే ఎవరు? యుక్తవయసు వచ్చేవరకు పెంచిన వారే అతనికి తల్లి, తండ్రి. తరువాత వారితోటి అతనికి ఏ సంబంధమూ ఉండదు. ఇదంతా జంతువుల పద్ధతి. అవి తమ పిల్లలు చిన్నవిగా ఉన్నప్పుడు జాగ్రత్తగా చూసుకుంటాయి. తరువాత గెంటివేస్తాయి. ఇదే ఈనాటి కుటుంబ పరిస్థితి. సంస్కృతి నాశనమైతే కుటుంబ జీవనం నాశనమౌతుంది.

**సంస్కృతిని వదిలేస్తే కలిగే దుష్పరిణామాలు:**

భవిష్యత్కాలంలో ఏమి జరుగబోతోంది. బుద్ధివాదం, అర్థశాస్త్రం వస్తాయి. వాటిననుసరించి చూస్తే ముసలివారిని కసాయి దుకాణానికి పంపించాలి. వారికి అంతకంటే మంచిస్థలం ఉండదు. ఇంట్లో ఉంటే వారికి అవసరమైన తిండి, స్థలం కావాలి. వారు బుద్ధిమందగించి చేసే పనులు, విసిగించే మాటలు

**ఇతరుల బలహీనతల కన్నా ముందు మన బలహీనతలను గుర్తించాలి.**

భరించాలి. లేదా వృద్ధాశ్రమానికి పంపించాలి. ఈవిధంగానే సంస్కృతి రావణుని చేతిలోనికి వెళ్ళిపోతోంది.

మేధావులు పెరిగే కొద్దీ అర్థశాస్త్రం ప్రబలుతుంది. అర్థశాస్త్ర సూత్రాల ప్రకారం ముసలివారిని కసాయి వాటికలకో, వృద్ధాశ్రమాలకో పంపాల్సివస్తుంది. గృహస్థజీవితం, దాంపత్యజీవితం నాశనమౌతాయి. పిల్లలు తల్లిదండ్రులపట్ల శ్రద్ధ చూపించరు. ఆసుపత్రిలో రోగంతో మూలుగుతున్న తండ్రికి పోస్టుకార్డులో "డియర్ ఫాదర్, మీకు బాగాలేదని తెలిసి చాలా బాధపడ్డాను. భగవంతుడిదయవల్ల మీరు త్వరలోనే కోలుకుంటారు. ఇట్లు మీ కొడుకు" అంటూ తమ దుఃఖాన్ని ప్రకటిస్తారు బిడ్డలు. ఆ ప్రేమే చాలా ఎక్కువ అనుకునే పరిస్థితి తల్లిదండ్రులది.

**ఒంటరి జీవితం భయంకరమైనది:**

ఈనాడు సంస్కృతీ సీతవెళ్ళిపోయింది. అమెరికన్లు ఎంతటి ధనవంతులు! వారిలో 80 శాతం మంది ఒంటరితనం అనుభవిస్తూంటారు. తమకెవరూలేరు అనే బాధవల్ల భయం, ఒత్తిడి ఏర్పడుతుంది. జీవితం నరకప్రాయంగా, భయంకరంగా ఉంటుంది.

అందువల్ల నిద్ర పాడవుతుంది. దాంతో నిద్రమాత్రలతో ఒత్తిడిని దూరం చేసుకుంటారు. అంతా శ్మశాన నిశ్శబ్దం అలుముకుంటుంది. ఎటుచూసినా జీవితం నీరసంగా ఉంటుంది. దానిని దూరంచేసుకోవటానికి మత్తుపదార్థాలు, త్రాగుడు, క్లబ్బులు, క్యాబరే డాన్సులకి అలవాటుపడతారు. అవి లేకుండా జీవించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

**భూతప్రేతాల దానవీయ సంస్కృతి చుట్టుముడుతోంది:**

ఈ మనుషులంతా ఎవరు? భూతాలు, ప్రేతాలు, దొంగలు. వీరికి ప్రేమ, సహకారభావం, మంచితనం లేవు. మనుషులు యంత్రాలవలె పరుగెడుతున్నారు. ఆధునిక సంస్కృతికి ఆలవాలమైన అమెరికాలో ఈనాడు అదే పరిస్థితి, మనది దేవసంస్కృతి, అది వదిలిపెట్టి అమెరికా వంటి దేశాలలో ఉండే దానవీయ సంస్కృతి వైపు పరుగెడుతున్నాం. అక్కడ డబ్బులు బాగానే వస్తాయి. సుఖం, సౌకర్యాలు ఉంటాయి. విజ్ఞానం చాలా వేగంగా విస్తరిస్తోంది. అందుచేత ఆర్థిక ఉన్నతి కలుగుతుంది. ఆలోచించండి దానితో ఏమి జరుగుతుంది? ప్రశాంతత అనేది మాత్రం దొరకదు.

**ఒకరితో ఒకరు కొట్టుకొని చావకుండా ఉండాలి:**

యాదవుల కాలం నాటి పరిస్థితులు మళ్ళీ వస్తాయి. యాదవులే యాదవులను చంపేశారు. బయటివారు ఎవరూ వారిని చంపలేదు. అన్ని వంశాలవారు వారిలో వారు కొట్టుకొని నాశనమైపోయారు. అలానే ఈనాడు మనుషులు ఒకరినొకరు పీక్కుతింటారు. ఇది సంభవమా అంటే సంభవమే. కాకపోతే ఇప్పుడు దానికి కొంచెం దూరంలోనే ఉన్నాం. ప్రస్తుతం తెలివితేటలతో అవతలి వ్యక్తిని చంపకుండానే రక్తం పీల్చేస్తున్నారు. అయినా మేము సౌమ్యులమే అనుకుంటారు. సంస్కృతి నాశనమైపోతే మనుషులు ఒకరితో ఒకరు ఇలానే పోట్లాడుకుంటారు. సంస్కృతి అనేది మనిషిని మనిషిగా నిలబెడుతుంది. అక్కడక్కడా సౌమ్యులూ ఉన్నారు. పరలోకం, ముక్తి, స్వర్గం వీటి గురించి నేను మాట్లాడటం లేదు. వీటిని అన్నింటిని వదిలేయండి. నేను ఈ జన్మ గురించే చెప్తున్నాను. భగవంతుడున్నాడా? లేడా? అనవసరం. నేను మీకు దైహిక, దైనిక జీవన విషయాల గురించే చెప్తున్నాను. ఫిలాసఫీల గురించి మనకివద్దు.

**ప్రేమ – అభిమానాలను తీసుకొనివద్దాం:**

సంస్కృతి మన దైనందిన జీవితంలో అభిమానాన్ని, ప్రేమను, సహకారభావాన్ని నింపుతుంది. అడవుల్లో, పూరిగుడిసెల్లో, గుడారాల్లో ఉండేవారు ఎంతో సంతోషంగా ఉంటారు. వారి ఆనందం ముందు స్వర్గానందం కూడా తక్కువే. మనం తిరిగి అటువంటి ఆనందాన్ని తెచ్చుకునే ప్రయత్నం చెయ్యాలి. ఎక్కడ నుండి తిరిగితెచ్చుకోవాలి. రాక్షసులతోపోరాడి తిరిగి తెచ్చుకోవాలి. ఈ కార్యక్రమానికి నడుంబిగించి ప్రాణాలు పణంగా పెట్టి ముందుకు వచ్చేవారికి భగవంతుని సహకారం ఎల్లప్పుడూ లభిస్తుంది. ఏ క్షేత్రంలోనైనా ఇలా ముందుకు వచ్చే మహామానవులకు భగవంతుడు సహకరిస్తాడు. ఆదర్శాలు సహకరిస్తాయి.

**మనిషికి ఆశయే గనక లేకపోతే ప్రయత్నం లోపిస్తుంది.**

**ఉన్నత ఉద్దేశ్యం కొరకు :**

సీతాదేవికి ఎటువంటి సహాయం లభించింది. సముద్రంలో పడేసిన ఱాళ్ళు పైకి తేలి వంతెన రూపం దాల్చాయి. తేలే ఱాళ్ళు ఎక్కడైనా ఉన్నాయా? లేవు, కానీ అవి ఉన్నతఆదర్శంకొరకు వేసినఱాళ్ళు. ఇందుకు ఎటువంటి ప్రణాళికావేయలేదు, నిజాయితీతో ఉన్నత ఆదర్శాలకొరకు ప్రాణాలు పణంగాపెట్టి ముందుకుసాగారు వానరులు. ఆ ఱాళ్ళు పైకితేలాయంటే, తేలకుండా ఎలా ఉంటాయి? ఇక్కడ ఉద్దేశ్యము ఱాళ్ళు అని కాదు, ఉన్న సమర్థత కొంచెమే. సాధనాలు లేవు. అయినా విజయం వరించింది.

సముద్రాన్ని లంఘించడం జరిగింది. సగటు మనిషి 10 అడుగుల కన్నా దూకలేడు. సరే కోతి 30, 40 అడుగులు దూకవచ్చు. కోతి దూకగలదా అంటే మరి కోతులే సముద్రాన్ని లంఘించాయి. మామూలు మనిషి ఎంతబరువు ఎత్తగలడు? సుమారు 40 కేజీలు. అదే బలవంతుడు అయితే 1 క్వింటాలు బరువు ఎత్తగలడు. మరి హనుమంతుడు ఉన్నత ఉద్దేశ్యం కొరకు పర్వతాన్నే ఎత్తేశాడు. నడుం బిగించి ముందుకు దూకి సీతాదేవిని హనుమంతుడే తిరిగి తీసుకొచ్చాడు.

**పునరావృత్తి జరుగవచ్చు :**

చరిత్ర పునరావృత్తమవడం సంభవమేనా? సంభవమే. మనం సంభవంచేసిచూపిద్దాం. సీతను రావణుడు ఎత్తుకుపోతే అల్పమైన వానరాలను కలుపుకొని రాముడు ఆమెను తిరిగి తీసుకురావడంలో విజయాన్ని సాధించాడు. మనంకూడా సంస్కృతీ సీతను తిరిగి తెచ్చుకుందాం. ఎందుకంటే దానితోనే మానవజాతి భవిష్యత్తు, భాగ్యం, విశ్వశాంతి, భావితరాల భవిష్యత్తు ముడిపడి ఉన్నాయి. ఈ సుందర ప్రపంచాన్ని భగవంతుడు ఎంతో గొప్పగా తయారు చేశాడు. మానవజీవితాన్ని సార్థకం చేసుకునేందుకు కొన్ని పనులు అప్పగించాడు. ఆయన అప్పగించిన ఈ పనిని మనం సార్థకం చేసి చూపించాలి. మన సంస్కృతీసీతను తిరిగితెచ్చుకునే ప్రణాళికలో మిమ్మల్ని కలుపుకునేందుకే పిలిచాను. నా లక్ష్యం ఒక్కటే, వేరే ఏదీ లేదు, రండి, అందరం కలసి సంస్కృతీ సీతను రక్షించుకుందాం.

*అనువాదం–శ్రీమతి వల్లీశ్రీనివాస్, ఒంగోలు*

★★★

## భారతదేశం వేలాది మంది క్రీస్తులకు జన్మనిచ్చింది.

*అమెరికా నుండి వచ్చిన ఫాదరీ రెవరెండ్ ఆవర్ పూనాకు చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలన్నీ తిరిగి నిరక్షరాస్యులను క్రైస్తవులుగా మార్పించాడు. ఒకరోజున ఒక పండితుడు ఆయనను "నీవు హిందూ ధర్మాన్ని అధ్యయనం చేశావా?" అని అడిగాడు. లేదన్నాడు ఫాదరీ. "హిందూ ధర్మాన్ని నిందించే ముందు దాన్ని గురించి తెలుసుకోవాలి. క్రైస్తవ ధర్మాన్ని ప్రశంసించడం, హిందూ ధర్మాన్ని నిందించడం మీకు అలవాటుగా మారిపోయింది. హిందూ ధర్మం గురించి నీకేం తెలుసు?" అని ప్రశ్నించాడు పండితుడు.*

*రెవరెండు ఆవర్ ఆలోచనలో పడ్డాడు. హృదయం స్పందించింది. వెంటనే సంస్కృతం, మరాఠీ నేర్చుకున్నాడు. ఏకనాథ్, జ్ఞానేశ్వర్, తుకారామ్ మొదలైన మహా పురుషుల గురించి తెలుసుకున్నాడు. వారు రచించిన సాహిత్యాన్ని చదివాడు. అంతటితో ఆగకుండా వారి జీవిత చరిత్రలను, తత్వ జ్ఞానాన్ని ఇంగ్లీషులో రచించాడు. ఈ కార్యక్రమంతో ఆయన మనస్సు పూర్తిగా మారిపోయింది. అమెరికా మిషన్‌కు లేఖ వ్రాశాడు. "భారతదేశం ఇప్పటికే వేలాది మహాపురుషులకు జన్మనిచ్చింది. భవిష్యత్తులో కూడా వేల సంఖ్యలో క్రీస్తుకు సమానమైన మహానుభావులు జన్మిస్తారు. అందువల్ల ఇక్కడ క్రైస్తవ ప్రచారం వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. ప్రచారాన్ని ఆపివేసి భారతదేశం నుండి సత్యధర్మాలను నేర్చుకోవడం మంచిది. మిషన్‌కు నేను రాజీనామా చేస్తున్నాను. అమెరికాలో ఉన్న నా 8 లక్షల ధనాన్ని పూనాలోని భారతీయ చరిత్ర పరిశోధనా మండలికి సమర్పిస్తాను." ఆ డబ్బుతో భారతీయ గ్రంథాల అనువాదాలను ముద్రించడం మొదలుపెట్టాడు.*

★★★

**బడిలో నేర్చుకునేది చదువుకాదు - చదువును సాధించే మార్గం.**

తెలుగు యోగులు

# శ్రీరాధికా ప్రసాద్ మహారాజ్

1901 జూలై 22వ తేదీ రాళ్ళబండి వంశంలో వీరభద్రరావు అనే పేరుతో ఉదయించిన యోగివర్యులు వీరు. చిన్నతనం నుండే ఎన్నో సాధనలు చేసి, దేవతా సాక్షాత్కారాలు పొంది రాధాదేవి యొక్క దివ్యానుగ్రహాన్ని పొందిన భక్తిశిఖామణులు. భౌతికంగా జిల్లా విద్యాశాఖాధికారి పదవి నిర్వహించి ఇచ్ఛాపూర్వకంగా పదవీ విరమణ చేసి రాధాసేవలో, రాధాతత్త్వ ప్రచారంలో జీవితాన్ని అంకితం చేసుకున్న రసయోగి. గుంటూరులో రాధాకృష్ణ మందిరాన్ని స్థాపించి కొన్నాళ్ళు వేణుగానం అనే పత్రిక ద్వారా రాధాకృష్ణ తత్త్వప్రచారం చేసి అనేక గ్రంథాలు రచించి, బృందావనేశ్వరి రాధాదేవి అన్నపేరుతో గ్రంథపరంపర వెలువరిస్తున్న గొప్ప పరిశోధకులు వీరు. "Divine Wisdom" మొదలగు గ్రంథాలు ఆంగ్లంలో రచించి ఆంధ్రేతరులకు కూడా రాధాపరతత్వాన్ని అందుబాటులోనికి తెచ్చిన తపోనిధి వీరు. రాధోపాసనలో సాధకులైన వ్యక్తులు రాధాదేవి యొక్క దివ్యానుగ్రహాన్ని పొంది ఆమె సఖిగా రాసమండలిలో స్థానాన్ని సాధించటమే వారి ధ్యేయం. పరమేశ్వరియైన రాసేశ్వరి కరుణ వల్ల ఆమెను ఆవాహన చేసి కావాలనుకున్నప్పుడల్లా మాట్లాడగల్గిన అదృష్టాన్ని పొందిన మహితాత్ముడీయన. ఇప్పుడు వీరి పేరు రాధికాప్రసాద్ మహారాజ్. కాని అందరు 'నాన్నగారు' అని పిలిచేవారు.

ప్రసాద్‌గారి సహసాధుకురాలైన రాధామహాలక్ష్మిగారి శరీరంలోకి రాధాదేవి దిగివచ్చి ఆయనతో మాట్లాడేది. ఆమె శరీరాన్ని వదిలిపెట్టిన తరువాత కుమారి అంజనీదేవి శరీరంలో పరదేవత ఆవాహనం చేయబడుతూ ఉండేది. రాధికాప్రసాద్ మహారాజ్ గారి అనుగ్రహం వల్ల ఈమె కూడా దివ్యానుభవాలను ఎన్నింటినో పొంది సిద్ధసాధన మార్గంలో ఉన్నత శిఖరాలను అందుకున్నది ఈ విధంగా రాధాకృపాకటాక్ష లబ్ధదివ్యశక్తి వల్ల ఆయన ఎన్నివేలమందికో అధివ్యాధులను కుదిర్చారు. దుష్టగ్రహాలను పారద్రోలారు. విశేషించి మానవుల శరీరావృతమైన కాంతివలయాలను దివ్యదృష్టితో చూచి అనేకానేక విశేషాలను తెలుసుకొని చెప్పగల్గిన మహాదార్శనికులు వీరు. ఈ విధంగా ఒక వైపు సాధన, మరొక వైపు సాహిత్యం రెండింటి మేలు కలయికగా వారి జీవితం పురోగమించింది. 102 ఏండ్ల వయస్సులో కూడా అలుపునెరుగని వీరునిగా లోకానికి ఉపకారం చేశారు. ఆయన రాధాదేవిని గూర్చి ఎన్నో పాటలు రచించారు. రాధాదేవి అంటే త్రిమూర్తులను కూడా సృష్టించిన పరమేశ్వరి, ఆదిదేవుడైన గోలోకకృష్ణుని చేత నిత్యము ఆరాధించబడే దివ్యశక్తి. ఆ భావానికి అనుగుణంగా ఆయన చేసిన రచనలు భక్తి రస భరితములై ప్రేమ, వాత్సల్యభావుకములై హృదయాకర్షకములై అలరారుతున్నాయి. తనను పరిపాలించుమని కోరుతూ పల్కిన పాటలో తనను దాసిగా చెప్పుకోవటం గమనార్హం. దాసుని అని పుంలింగం వాడకుండా దాసిని అని స్త్రీలింగం వాడటం ద్వారా ఆయన తనను తాను రాధాదేవి సఖిగా భావించుకుంటున్నట్లు స్పష్టము. హితహరివంశ మహారాజ్ రచనలో కూడా ఈ భావనే పదపదానా భాసిస్తుంది. ఆనందరూపిణిగా, ఆహ్లాదినీశక్తిగా, తన ప్రణయ సంపదగా, ప్రేమనౌకగా ఆయన భావన చక్కని రూపు ధరించింది. అమ్మను భావరూపిణి అనటం కూడా ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. ఈ అనంత సృష్టిలోని దేవతా గణంలో రాధాదేవి మాత్రమే మహాభావ స్వరూపిణి. ముక్కోటి దేవతలు ఆమెకు సాటిరారు అని చెబుతారు.

రాధాకృష్ణుల ప్రత్యక్ష లీలలు బృందావనంలో కృష్ణుడు ఉన్నంత వరకే జరిగాయి. కృష్ణుడు 12 సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత మధురాపురి వెళ్ళడం జరిగింది. వీరి సిద్ధాంతం ప్రకారం వాసుదేవ కృష్ణుడు, గోలోకకృష్ణుడు ఒకే శరీరంలో 12 సంవత్సరాలు కలిసి ఉన్నారు. రాక్షస సంహారం కోసం విష్ణువు అవతారమైన వాసుదేవుడు మధురకు బయలుదేరగానే ఆ శరీరంలో ఉన్న గోలోకకృష్ణుడు బయటకు వచ్చి 'బృందావనం పరిత్యజ్య పాదమేకం నగచ్ఛతి" అన్నాడు కానీ చర్మ చక్షువులకు మాత్రం కనబడక దివ్యమూర్తితో భాసిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఇక్కడ నాన్నగారు ఒక విచిత్రమైన ఊహ

**ఇతరులలో మంచిని మాత్రమే గ్రహించటం మంచి తనానికి చిహ్నం.**

చేశారు. అది ఊహ అని లౌకికమైన పద్ధతిలో అంటున్నాను కానీ బహుశ వారి దర్శనం కావచ్చు.

కృష్ణుడు మథురకు వెళ్ళిన తరువాత గోపికలు విరహాన్ని భరించలేక మూర్ఛపోయినారట. అప్పుడు రాధాదేవి కృష్ణరూపాన్ని ధరించి తన వేణుగానంతో గోపికలకు సంతోషాన్ని కలిగించిందట.

బ్రహ్మదేవుడు 60 వేల సంవత్సరాలు తపస్సు చేసి కూడా రాధాదర్శనం పొందలేకపోయినాడు. ద్వాపరాంతంలో బృందావనంలో ఆమె దర్శనాన్ని పొంది గోపికా భావంతో దగ్గరకు చేరగలిగాడట.

బృందావనమే రాధాదేవి రూపమనీ, అందులోని కాత్యాయనీ దేవి కూడా ఆమెయే యని నాన్నగారి భావన. లలిత, విశాఖ మొదలైన అష్టసఖులతో భూలోకంలో అవతరించిన ఆదిశక్తిగా రాధను ఆయన అభివర్ణించారు. రాధాదేవిని బహురూపాలలో చూచే ఆత్మ జనితమైన ప్రేమతో నిండిన మనస్సే వైకుంఠమనీ, మాయలో మునిగి మోహవశమైన మనస్సే యమలోకమనీ వారి నిశ్చితాభిప్రాయం. ఇష్టదేవతను యౌవనవతిగా చూస్తే సాధకుని మనస్సు చలించవచ్చు. అదే బాలికగా చూస్తే కామభావన ఉదయించదు. అందుకని బృందావనంలోని చాలా సంప్రదాయాలలో రాధాకృష్ణులను చిన్న వయస్సులో వారిగానే భావిస్తారు, ధ్యానిస్తారు. నాన్నగారికి కూడా అటువంటి చిన్నారి రూపమే ఇష్టం.

ఆరూపంతో పాటుగా మాతృరూపము, సఖీరూపము రెండింటినీ కూడా అప్పుడప్పుడూ భావించటం వారి రచనలలో కన్పిస్తుంది. యోగసాధనలు, సిద్ధ సంప్రదాయాలు, కఠోర తపస్సులూ రాధాదేవి దర్శనాన్ని ఇవ్వలేవని ఒక్క ప్రేమభక్తి మాత్రమే ఆమెను చూడటానికి మార్గమని ఈ రసయోగి భావన.

రాధాదేవిని ఒక చోట వారు 'మదనమోహిని' అని సంబోధించారు. ఈ పేరులో ఒక ప్రత్యేకత ఉంది. మన్మథుడు ఒకసారి శ్రీకృష్ణుని గురించి తెలియక అహంకారంతో మోహింపచేయాలని వచ్చాడు. కృష్ణుడు మదనునితో – మహారాస జరగబోతున్నది. నన్నేకాదు అందులోని ఏ ఒక్క గోపికనైనా నీవు ఓడించగల్గితే, నీ పుష్పబాణాలతో వశీకరణచేసుకోగలిగితే, వారిలో కామభావనను రేకెత్తించగల్గితే నేను ఓడిపోయినట్లు అంగీకరిస్తాను అన్నాడు. సరే యని మదనుడు ఆ రోజు కోసం వేచి ఉన్నాడు. మన్మథుడు వెళ్ళిన తరువాత కృష్ణుడికి అనుమానం వచ్చింది. అసంఖ్యాక గోపీ జనంలో ఏ ఒక్కరిలోనైనా బలహీనత కల్గితే ప్రమాదం కదా! అని భయపడి రాసేశ్వరి అయిన రాధాదేవికి విన్నవించుకున్నాడు. ఆమె అభయమిచ్చింది. మహారాస జరుగుతున్న వేళ కందర్పుడు వచ్చి ఎంత దర్పం చూపించినా సమస్త లోకాలను మోహింప చేసే ఎన్ని బాణాలు వేసినా ఏ ఒక్కరిలోనూ కామభావాన్ని కల్గించలేకపోయాడు. రాసమండలిలో ప్రేమకే కాని కామానికి స్థానం లేదు. చివరకు మోహింప చేయవచ్చిన మదనుడే మోహితుడైనాడు. అప్పుడు రాధాదేవి 'మదనమోహిని' అయింది.

బృందావన గాథలు ఆశ్చర్యకరమైనవి. ఆదిశేషుడు కూడా వానిని వర్ణించలేడు. అది గోపీజనుల ప్రేమాశ్రుధారలతో పవిత్రీకృతమైన ప్రదేశం. బ్రహ్మదేవుడు కూడా గర్వభంగము పొంది తన అల్పత్వాన్ని తెలుసుకున్న స్థలం. కైలాసపతియైన శివుడు కూడా రసమండలిలో ప్రవేశించటానికి గోపికగా మారిన స్థలం. రామకృష్ణ పరమహంస గోపివేషాన్ని ధరించి కృష్ణ విరహంతో ప్రేమభక్తి సాధన చేసిన దివ్యభూమి. వివేకానందుడు ఈ స్థల మహిమను ఎంతో అద్భుతంగా వర్ణించాడు. ఏ యోగి అయినా ప్రత్యక్షానుభవం పొందాలంటే బృందావనంలో ఉండి సాధన చేయవలసిందే. నింబార్కుడు, చైతన్యుడు, వల్లభాచార్యుడు మొదలైన మహానుభావులంతా తపస్సు చేసిన మహత్తర స్థానమిది. నారద, దుర్వాస, గర్గాది మహర్షులు ఈ ధామ మహత్వాన్ని ఎలుగెత్తి చాటారు.

తపస్సు చేసేవారు కఠోర నియమాలు పెట్టుకుంటారు. ఎండాకాలంలో పంచాగ్ని మధ్యంలో, శీతాకాలంలో గొంతు లోతు నీళ్ళల్లో నిలబడి జపసాధనలు చేస్తూ ఉంటారు. కానీ బృందావనంలోని సాధన ప్రేమసాధన. ఈ మార్గంలో అశ్రుపాతము, కంఠగాద్గద్యము, పులకీకృతులు కావటం, యుగళదర్శనం కోసం ఎదురుచూడటం ఉంటుంది. లోకంలో ఎంతటి గొప్పవాడైనా, రారాజులైనా ఇక్కడ అశ్రుధారలు కారుస్తూ విరహంతో, వియోగ దుఃఖంతో ఏడుస్తూ ఉంటారు ఇది ఒక

**శీలంవల్లనే సాహసానికి శోభ వస్తుంది.**

చిత్రమైన అనుభూతి. లోకంలో మానవుడు కావాలనుకున్నప్పుడల్లా నవ్వు తెచ్చుకోగలడు, కోపాన్ని అభినయించగలడు. కానీ కంటి వెంట కన్నీరు మాత్రము కోరినంత మాత్రాన రాదు. హృదయంలో స్పందన కల్గితేనే వస్తుంది. బృందావన సాధనలో ఉండేవిశేషం అదే. రాధాదేవిని స్మరించి నప్పుడల్లా నాన్నగారు దుఃఖితులు కావటం, కంటివెంట కన్నీరు కారటం ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. అందరూ చూస్తూనే ఉన్నారు. బృందావన భక్తుల కథలలో ఇటువంటి దృశ్యాలు అడుగడుగునా కన్పిస్తాయి. నాన్నగారే కాదు వారి దగ్గరకు వచ్చిన భక్తులకు కూడా అటువంటి అనుభూతులు కల్గటం ఆశ్రమంలో ఎన్నోసార్లు జరిగింది. ఆ భక్తులు తాము ఎందుకు విలపిస్తారో వారికే తెలియదు. అది బృందవాన ధామంలోని విచిత్రం. ప్రేమభక్తి యొక్క మహత్వం.

యుగయుగాలలో కఠోరమైన తపస్సులు చేసిన వారెందరెందరో ఉన్నారు. అహంకార మమకారాలతో మోహితులై సుఖభోగముల యందు, శక్తి ప్రదర్శనల యందు, విశ్వవిజయము నందు మోజుపడి ఘోర నిష్ఠలతో సాధనచేసి ఆయా శక్తులను పొందవచ్చు. అలా సాధించిన రాక్షసుల చరిత్రలెన్నో మనకు తెలుసు. దేహమునందు, భార్యలయందు, సంతానము నందు వ్యామోహము వీడనిచో ఎన్ని జపతపములు చేసినా సర్వేశ్వరి కృపరాదు అనే భావాన్ని తెలియచెప్పారు.

పరమేశ్వరికి అనంత మాయాశక్తి సమన్వితమైన రూపము ఉంటుంది. ప్రేమరూపమూ ఉంటుంది. నాకు శక్తి రూపము వద్దు. దానివల్ల వచ్చే మాయలు, మహిమలు వద్దు. నీ ప్రేమస్వరూపము చూపించి నన్నుద్ధరించవలసినదని ప్రార్థిస్తారు.

రాసేశ్వరి కరుణా కటాక్షం వల్ల రాధికాప్రసాద్ మహారాజ్ మోహం వీడిపోయింది. కనువిప్పు కలిగింది అంటూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బువుతారు.

మనస్సు చలించటం వల్ల సంసార ప్రీతివల్ల ఈ భూమికి జారి వచ్చాము. నన్ను ఉద్ధరించటానికి నీ కృప తప్ప వేరే మార్గం లేదు. ఆ కృప కోసం వేచి ఉన్నాను అంటూ ఆర్తితో అభ్యర్థన చేస్తారు.

మానవులకు మరపు సహజము. జన్మ మారితే అన్నీ విస్మృతులే. ఈ జన్మలో కూడా ఎన్నో మరచిపోతుంటారు జీవులు. ఆ సంగతి తెలుసు కనుక పరమేశ్వరికి మరపు ఉండదు కనుక తనను మరువవద్దని నాన్నగారు వేడుకుంటారు.

సాధకులకు చిత్రమైన అనుభవాలు కల్గుతూ ఉంటాయి. ఒక పేదవానిగా పూరి గుడిసెలో ఉన్నప్పుడు ఏ అర్ధరాత్రి వేళలోనో వాన కురుస్తూ ఉంటే చిన్నారి రాధాదేవి వారి దగ్గరకు వచ్చిందట. అయ్యో ! నా వంటి అల్పుని కోసం ఆ తల్లి ఎంతో కష్టపడింది? అని నాన్నగారు బాధపడ్డారు.

ఒకసారి కృష్ణుడు శ్యామవర్ణం కల్గిన ఒక సఖీరూపంతో రాధాదేవి దగ్గరకు వచ్చాడు. రాధాదేవి అప్పుడు గానం చేస్తున్నది. ఆ పాట వింటూ పరవశించి ఆ శ్యామల బాలిక నృత్యం చేయటం మొదలుపెట్టింది. చేస్తూ చేస్తూనే శ్యామునిగా మారిపోయింది. పరమశోభాయమానమైన ఆదృశ్యాన్ని ఈ యోగి ఎంతో శోభాయమానంగా వర్ణించారు.

ఒకసారి రాధాదేవి పుట్టినరోజు పండుగ వచ్చిందట. ఆమె తండ్రి వృషభానుడు గొప్ప సంపన్నుడు. కంసమహారాజు సఖుడు. ఆ ఉత్సవానికి మగపురుగు కూడా ప్రవేశించకూడదని ఆజ్ఞాపించాడు. కృష్ణునకు ఆ పండుగ చూడాలని కోరిక. నందుని సోదరి మందాకిని దేవి కృష్ణునికి ఆడవేషం వేసి తీసుకు వెళ్ళిందట. అటువంటి రమణీయమైన దృశ్యాలను రాధికా ప్రసాద్ మహారాజ్‌గారు తన పాటలలో చక్కగా అభివర్ణించారు.

గర్గసంహితలో బృందావనానికి రాధాదేవిని మహారాణిగా పట్టాభిషేకం చేయటం అద్భుతంగా వర్ణించబడింది. దేవతలంతా ఆ ఉత్సవానికి విచ్చేశారు. బృందాదేవి, పౌర్ణమాసీ మొదలైనవారు ఆ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.

బృందావనం రాధాదేవి సామ్రాజ్యం. శ్రీకృష్ణుడు కూడా అక్కడ ఆమెకు సామంతుడే. కృష్ణుని పొందాలనుకున్న ఏ సాధకుడైనా రాధాదేవిని అర్చింపక పొందజాలరు. అటువంటి రాధాదేవి యొక్క మహత్వాన్ని తెలుపుతూ, ప్రేమభక్తి రసభరితములైన గేయాలనెన్నింటినో రాధికా ప్రసాద్‌మహారాజ్ గారు రచించారు. రాసేశ్వరి యందు భక్తిని పెంపొందించే ఈ రచనలు పఠిస్తే ఏ సాధకునికైనా హృదయస్పందన కలుగక తప్పదు.

★★★

**ఎంతటి మహాత్ముడికైన పశ్చాత్తాపపడే గతం ఉంటుంది.**

ప్రత్యేక వ్యాసం

# శ్రీకృష్ణజన్మాష్టమి - పూజాక్రమం

శ్రావణ బహుళ అష్టమి శ్రీకృష్ణ జన్మాష్టమి. ఈ పండుగ శ్రీకృష్ణ భగవానుని కర్మయోగంతో జోడింపబడింది. దీనిని మహారాత్రిఅని కూడా అంటారు. ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా, తాంత్రికంగా, ధార్మికంగా అనేక విధాలుగా అత్యంత విశిష్టమైంది. జన్మాష్టమి శ్రీకృష్ణ భగవానుని పూజతో పాటు సామాజికంగా అతి ముఖ్యమైన పండుగ. ఇది కేవలం వ్యక్తిపరంగా, సమాజపరంగాకాక తాంత్రికులకు యోగులకు, మునులకు కూడ మార్గదర్శనం చేస్తుంది.

విశిష్టగ్రహాలు కూడి ఉన్నటువంటి అర్ధరాత్రి సమయంలో దేవకీ దేవి గర్భవాసాన కారాగారంలోశ్రీకృష్ణుడు జన్మించాడు. ఆ మహత్తర వేళావిశేషం కారణంగా అవతార పురుషుడు అయ్యాడు. శ్రీకృష్ణుని జీవితమంతా సంఘర్షణలు, విజయాలతోనే గడిచిపోయింది. బాల్యమంతా భయంకరమైన రాక్షసుల కుట్రలు, కుతంత్రాలతో పోరాడి జయించాడు. కిశోరావస్థలో మగధరాజు జరాసంధునితో, దురభిమాని శిశుపాలునితో, దురాచారి నరకాసురునితో రాజ్యపిపాసి కంసునితో యుద్ధాలు చేయవలసి వచ్చింది. ఇంకా అనేక మంది దుర్మార్గులను హతమార్చి సంస్కృతిని, ధర్మాన్ని నిలబెట్టడం జరిగింది.

పిటపిటలాడే యౌవన దశలో మధురవంటి విశాల సామ్రాజ్యాన్ని పాలించాల్సి వచ్చింది. జీవితంలోని అనేక ఘట్టాలలో అనేక సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. అయినా నేర్పుగా సమర్థించుకుని అనేక మందిని రక్షించాడు. అనేక మందికి ఆధారంగా నిలిచాడు. కృష్ణ భగవానుని జీవితం అనేక విశేషతలతో, అనేక అద్భుతరహస్యాలతో నిండి ఉన్నది. అన్ని సమస్యలను చిరు నవ్వుతో ఎదిరించాడు. ఏనాడూ ధైర్య సాహసాలను విడిచిపెట్ట లేదు. నిష్కామకర్మయోగాన్ని లోకానికి అందించి చరిత్రలో కర్మయోగిగా స్థిరపడ్డాడు.

శ్రీకృష్ణుడు పూర్ణ పురుషుడు. అర్జునునికి మిత్రుడు. సుదామునికి సహాధ్యాయి. ఉద్ధవునికి గురువు గోపికలకు స్వామి, తపస్వి, సిద్ధుడు, సంత్ పురుషుడు, విరాగి, అధ్యాత్మపురుషుడు. ఏ అవతార పురుషుడు కూడా జీవితంలో ఇన్ని పాత్రలను ఇంత సమర్థవంతంగా పోషించడం వినలేదు. పరస్పర విరుద్ధమైన పనులను కూడ విచిత్ర పద్ధతిలో ఒకేసారి చేసిచూపేవాడు. ఒక వైపు గోపికలతో విహరిస్తూనే రెండవవైపు రాచ కార్యాలలో నిమగ్నం అయ్యేవాడు. అసంభవాన్ని సంభవం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. మహాభారత యుద్ధంలో అర్జునుడికి గీతను బోధించడం, రాజసూయ యజ్ఞంలో తండ్రి వసుదేవునికి, శిష్యుడు ఉద్ధవునికి బ్రాహ్మణత్వాన్ని గురించి వివరించడం, మిత్రుడు సుదామునికి సహాయం చేయడం ఆయన జ్ఞానానికి ప్రత్యక్ష నిదర్శనాలు. కృష్ణుడు ప్రకాశిస్తున్న, జ్ఞాన జ్యోతి.

కృష్ణ భగవానుడు జ్ఞానశిఖరంపైన ఎక్కి కూర్చున్నాడు. ప్రేమకు అద్వితీయమైన స్థానాన్ని కల్పించాడు. ఆయన గోపికలపై చూపించిన ప్రేమ అధ్యాత్మకతకు పరాకాష్ఠ. ప్రతి ఒక గోపిక శ్రీకృష్ణునితో నృత్యం చేసిన అనుభూతిని పొంద గలగడం శతపథ బ్రాహ్మణంలో వెయ్యిమంది అప్సరసలు ఇంద్రునితో కలసి ఒకేసారి నాట్యం చేసిన ఘట్టాన్ని జ్ఞప్తికి తెస్తుంది. కృష్ణ భగవానుడు ఆధ్యాత్మిక జగత్తులో మహోన్నతుడు. ఈ మహాచైతన్యాన్ని ఓవరమైండ్ అన్నారు శ్రీ అరవింద మహర్షి. శ్రీకృష్ణుని జీవితం ప్రారంభం నుండి చివరి వరకు ప్రేరణా పూర్వకంగా శిక్షణను అందిస్తూనే ఉంటుంది. ఆయన అందించిన గీతోపదేశం సర్వకాల సర్వావస్థలలోను ఉపయోగపడుతుంది.

## పూజా క్రమం

ఈ ఉత్సవాన్ని మనం ఉత్సాహ పూర్వకంగా జరుపుకుని తగిన స్ఫూర్తిని పొందాలి. పూజలో కృష్ణ భగవానుని, అర్జునుని, భగవద్గీతను ఆహ్వానించి పూజించాలి. ప్రొద్దున్నే స్నానాదులు ముగించుకుని, చేతిలో నీరు తీసుకుని **"శ్రీకృష్ణప్రీత్యర్థం జన్మాష్టమీ వ్రతం కరిష్యే"** అనీ, పత్రం–పుష్పం–జలం తీసుకుని **"వాసుదేవం సముద్దిశ్య సర్వపాప ప్రశాన్తయే ఉపవాసం కరిష్యామి"** అనీ ఉపవాస సంకల్పం తీసుకోవాలి. కృష్ణవిగ్రహాన్ని రాగిచెంబుపై ప్రతిష్ఠించి యోగ్యుడైనఆచార్యునిద్వారా ప్రాణప్రతిష్ఠ చేయించాలి. విగ్రహానికి నెయ్యితోను, నీటితోను అభిషేకం చెయ్యాలి. అభిషేక సమయంలో **"అగ్నిర్వైశ్వానరో వహ్నిప్రీతిహోత్రో ధనంజయ. అగ్రేసత్తారణార్థాయ మూర్తీనాం శుద్ధిహేతవే"** అనే మంత్రాన్ని మూడుసార్లు చదివి ప్రాణ ప్రతిష్ఠ చేయాలి.

పరుల కష్టం చూచి ద్రవించే వాడే మనిషి.

చేతిలోనికి నీరు తీసుకుని **"అస్యశ్రీ ప్రాణ ప్రతిష్ఠా మంత్రస్య బ్రహ్మ విష్ణు మహేశ్వరాయ ఋదషయః ఋగ్యజః సామాథర్వాణి ఛందాసి! జగత్సృష్టికారిణీ ప్రాణశక్తి ర్దేవతా! ఆంబీజం హ్రీంశక్తిః క్రీం కీలకం అస్యామూర్తేః ప్రాణప్రతిష్ఠా పనే వినియోగః!** అంటూ చల్లాలి.

దీని తరువాత మరల ప్రాణప్రతిష్ఠ మంత్రంతో విగ్రహాన్ని కలశం పైన స్థాపించాలి. కలశాన్ని పూజించాలి. తరువాత **"శ్రీకృష్ణాయ నమః శ్రీకృష్ణమావాహయామి స్థాపయామి"!** అంటూ ఆహ్వానించాలి. **"ప్రతిష్ఠా సర్వదేవానాం మిత్రావరుణా నిర్మితా! ప్రతిష్ఠాంతేకరోమ్యత్రమండలే దైవతైః సహ! దేవత్యాది పరివార దేవతాః సుప్రతిష్ఠితాః వరదా భవన్తు"** ఈ మంత్రంతో ప్రతిష్ఠించాలి. **"గాయద్భిః కిన్నరాద్యైః సతత పరివృత్తా వేణువీణా నినాదైః శృంగారా దర్శకున్త ప్రవరకృతకేః కిన్నరైః సేవ్యమానా! పర్యంకే స్వాస్తుతేయా సువదనా దేవకీ దివ్యరూపా! శ్రీకృష్ణం బాలకం ధ్యాయేత్పర్యంకే స్తనపాయినమ్! శ్రీవత్సవక్షసం శాంతం నీలోత్పల దలచ్ఛవిమ్! నమోదేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః! నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాః స్మృతామ్! దేవక్యా వాసుదేవేన యశోదానందమేవచ! శ్రీకృష్ణం సహితం ధ్యాయే బలదేవేన చండికామ్! దేవక్యాది పరివార దేవతా సహిత శ్రీకృష్ణాయ నమః! ధ్యానం సమర్పయామి"!** అంటూధ్యానం చేయాలి.

ధ్యానం తరువాత క్రమంగా ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, మధుపర్కం, పయఃస్నానం, దధిస్నానం, నెయ్యి, చెక్కెర, గంధోదకం, ఉద్వర్తన స్నానం చేయించాలి. స్నానం తరువాత పురుష సూక్తంతో కృష్ణ భగవానుని అభిషేకించాలి. అభిషేకం తర్వాత గంగాజలంతో కాని లేక ఏదైన శుద్ధ జలంతో కాని స్నానం చేయించాలి. తరువాత వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, అక్షతలు, పుష్పాలు సమర్పించాలి. అన్నిమంత్రాలు స్పష్టంగా ఉండాలి. తరువాత అంగపూజ చేయాలి. చివరలో హారతి ఇవ్వాలి. ఈప్రక్రియ అంతా ముగించి యధాశక్తి దక్షిణ రూపంలో అర్పణ చేయాలి.

పైన తెలిపిన కర్మ కాండను యధాతథంగా నిర్వహించాలి. ఒక వేళ చేయలేక పోయినట్లైతే. మీరు చేయగలిగిన విధంగా భక్తి భావంతో నిర్వహించు కోవచ్చు. ఈవిధంగా చేయడం వల్ల లౌకిక, అలౌకిక లాభాలను పొందగలుగుతాము.

అనువాదం-పొన్నూరు హైమవతీ శాస్త్రి

★★★

## సంతృప్తి

*ఒకసారి దేశంలో కరువు వచ్చింది. ప్రజలు ఆకలితో అల్లాడిపోతున్నారు. ఒక చిన్న గ్రామంలో ధనికుడున్నాడు. అతడు దయగలవాడు. చిన్నారి బాలబాలికలు ఆకలితో బాధపడుతుంటే చూడలేకపోయాడు. రోజూ ఆ గ్రామంలో ఉన్న పిల్లలందర్నీ తన తోటలోనికి రమ్మన్నాడు. రొట్టెలు చేయించి తలా ఒకటి ఇచ్చేవాడు. చేయడంలో రొట్టెలు చిన్నవి, పెద్దవి వచ్చేవి. అందుకని పిల్లలంతా ఒకరినొకరు నెట్టుకుంటూ, కొట్టుకుంటూ, చేతిలోవి గుంజుకుంటూ పెద్దరొట్టెకోసం ఎగబడేవారు. పదేండ్ల పాప మాత్రం అలా ఎగబడకుండా ఒక మూలకు నిలబడేది. అందరూ అయ్యాక ఆఖరుకు వచ్చి అందరు మిగిల్చిన చిన్న రొట్టెనే సంతోషంగా తీసికొని వెళ్ళేది. ఆ ధనికుడు ఇదంతా గమనిస్తున్నాడు. రోజూలాగే ఆ రోజు కూడ ఆమెకు చిన్నరొట్టె లభించింది. ఇంటికి వెళ్ళి తిందామని రొట్టెను తుంపింది. అందులో ఒక బంగారు నాణెం వచ్చింది. తల్లికి చూపించింది.*

*అతని బంగారు నాణెం అతనికే ఇచ్చి రమ్మంటుంది తల్లి. పాప తీసికొని వెళ్ళి ఇచ్చింది. ధనికుడు ప్రేమగా పాపను దగ్గరకు తీసికున్నాడు. "లేదమ్మా! అది నీకోసమే పెట్టించాను. నువ్వు రోజూ దొరికిన చిన్నరొట్టెతోనే సంతృప్తి చెందుతున్నావు. నీ గుణానికి మెచ్చి నీనిచ్చిన కానుక ఇదే. తీసుకుపో." అన్నాడు.*

*ఆ బాలిక నాణెం ఇచ్చివేస్తూ "వద్దు. నా సంతృప్తికి ఫలం నాకెప్పుడో లభించింది. ఇతరులపై దౌర్జన్యం చేసి తీసికోకుండా న్యాయంగా లభించిందే తింటున్నందుకు నాకు చాల సంతోషంగా ఉంది. సంతోషాన్ని మించిన కానుక ఇంకేముంటుంది? నాకీ చిన్న రొట్టె చాలు." అంది.*

*ధనికుడు చాలా సంతోషించాడు. ఆనాటి నుండి ఆ బాలికను దత్తపుత్రికగా చేసికున్నాడు. ఆమె తల్లిని మంచి వేతనం మీద పనిలో పెట్టుకున్నాడు. అతని యావదాస్తికి వారసురాలైంది ఆ బాలిక.*

★★★

**100 మందిలో ఒక్క శూరుడు, 1000 మందిలో ఒక పండితుడు, 10000 మందిలో ఒక నేర్పరి ఉంటారు. కాని లక్షమందిలో ఒక్క త్యాగి దొరకడం కష్టం.**

ఆచరణలో ఆధ్యాత్మ

# జీవితాన్ని ఆటగా మలచుకుందాం

శరీరంతో చేసే వివిధ పనులకు, కార్యకలాపాలకు కేంద్రబిందువు మస్తిష్కం లేదా మనసు. ఆటగాడు బొమ్మల్ని ఆడించినట్టు మనస్సు శరీరాన్ని నడిపిస్తుంది. భావోద్వేగాలు, కోరికలతో సతమతమయ్యే మన దేహాన్ని మంచి చెడులవైపు నడిపించేది మనస్సే. మనస్సును పూర్తిగా అదుపులో ఉంచుకుని తనపనులుచేసుకుంటూ ఉంటే మనిషి ఆరోగ్యంతో దీర్ఘకాలం జీవిస్తాడు. మనస్సు అస్తవ్యస్తంగా ఉంటే అనవసరపు ఆలోచనలు చెలరేగి జీవితం దుర్భరమవుతుంది. అ పరిస్థితి రాకుండా ఉండాలంటే మనం నవ్వుతూ నవ్విస్తూ అన్ని విషయాలు తేలికగా తీసుకోవాలి. ఈ లోకంలోని మనుషులంతా మనం ఇష్టపడేటట్టు నడవరు. నడవాల్సిన అవసరమూ లేదు. ప్రపంచంలోని పరిస్థితులను మనకు అనుకూలంగా మలచుకుంటే కష్టసాధ్యమైన కార్యాలను కూడా సాధించవచ్చు. అట్లాగే కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వలన మనం అనుకున్న మేరకు ఫలితాన్ని సాధించ లేకపోయినా నిరాశపడకుండా సాధించిన దానితోనే తృప్తిచెందాలి. ఈ జీవితం ఒక ఆట. క్రీడాకారుని భావనలతో ఉంటే జీవితంలో అన్నీ సాధించవచ్చు. క్రీడాకారుని జీవితంలో గెలుపు, ఓటములు సహజం. జీవించే ఈ ఆటలో గెలిస్తే ఆనందించి, ఓడిపోతే నిరాశపడితే జీవించేకళ కోల్పోయినట్టే. మానసిక దౌర్బల్యంతో జీవితం నిస్సారంగామారి, ఆరోగ్యం పాడుచేస్తుంది. మనస్సు నిశ్చింతగా ఉంటే అనారోగ్యం ఉండదు. పిచ్చివాడు ప్రతికూల పరిస్థితులలో కూడా బలంగా ఆరోగ్యంగా ఉండడానికి కారణం అతని మనసు నిశ్చలంగా ఉండటవే. విపత్కరపరిస్థితులలోకూడా నవ్వుతూ జీవించేవాడు పగలంతా హాయిగా ఉంటూ, రాత్రి నిశ్చింతగా నిద్రపోతాడు. అనవసరపు భయంలో బ్రతుకు వెళ్ళదీసేవాడు పులి కనపడగానే భయంతో ఒణికిపోయే మేకలా అయిపోతాడు. నిశ్చలంగా ఉండే వ్యక్తి రాగద్వేషాలకు అతీతంగా ఉంటాడు. ఈ స్థితికి చేరినవాడు భగవంతునితో సమానమయిపోతాడు. గీతలో చెప్పినట్టు సుఖ దుఃఖాలకు, లాభనష్టాలకు అతీతంగా ఉండి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ కర్మయోగిలా ఉండాలి. ఈ బోధన సిద్ధాంతంగా మలచి జీవితంలో ఆచరించేందుకు ప్రయత్నించాలి. ఆహార విహారాలను నియమ నిబద్ధతతో పాటిస్తూ, జీవితాన్ని నవ్వుతూ హాయిగాగడిపితే ఆరోగ్యంగా ఉంటాము. అనవసరపు ఆలోచనలు రానీయకుండా మనస్సును సరియైన మార్గంలో మళ్ళిస్తే నిశ్చింతగా ఉండగలం. మనస్సు ఉద్విగ్నంగా ఉంటే బాధ మొదలవుతుంది. బాధ మొదలయితే మనస్సు ఈర్ష్య, అసూయ రాగద్వేషాలతో రగిలిపోయి తనకు తానే శత్రువుగా మారుతుంది, అనారోగ్యం కొని తెచ్చుకొని స్వస్వభావాన్ని కోల్పోతుంది.

మనుషులు అంతఃస్థితిని సమీక్షించుకుని మంచివైపు నడవడం కష్టం. అయితే దీనిని నిరంతరసాధనతో సాధించవచ్చు. జీవితం ఆటలా తీసుకుని విజయాన్ని లక్ష్యం చేసుకుని ఆడాలి. గెలుపు లేదా ఓటమి సహజం. క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుంటే జీవితాన్ని ఉన్నత లక్ష్యం వైపు నడిపించవచ్చు.

అనువాదం – చెరుకూరి కృష్ణారావు

★★★

దీన జనోద్ధరణకు మూల సూత్రం దీనుల సేవయే.

# మీలో కూడా శక్తి ఉన్నది

మనిషి దగ్గర ఉన్న అత్యంత విలువైన యంత్రాలు రెండు. (1) హృదయం, (2) మస్తిష్కం. వీటిలో మస్తిష్కం ఎక్కువ విలువైనది. ఎందుకంటే మస్తిష్కం హృదయం యొక్క నడకను నిర్ధారిస్తుంది. కాని మనం మస్తిష్కం యొక్క ఆరోగ్యం, ఆలోచనా తీరు, సంయమం, భావాల నియంత్రణ గురించి పట్టించుకోకపోవడం చాలా విచారకరమైన విషయం. అనేకమంది చెడు అలవాట్లతో ఆరోగ్యాన్ని పాడుచేసుకొని మానసిక భావానాత్మక సంతులన పోగొట్టుకుంటున్నారు.

తనను తాను నియంత్రించుకొని, అనుచిత భావాలను మనస్సులోనికి రాకుండా ఆపి, ఏకాగ్రతతో మానసిక శక్తులను ఒకే దిశలో ఉపయోగించిన వ్యక్తి, ప్రపంచంలోని ఏ క్షేత్రమందైనా సఫలత పొందుతాడు. ఇతని అలవాట్లు, శక్తులు ఉన్నతంగా ఉంటాయి.

ప్రపంచంలోని విభిన్న వస్తువులపై ఆధిపత్యం కావాలనుకొన్న వారు ముందుగా తమ వ్యక్తిత్వంపై తమలో ఉన్న గుప్త శక్తులపై అధికారం సంపాదించాలి. మనుష్యులందరు అంతులేని శక్తులతో పృథ్విపై జన్మించారు. ఇది ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

తన కోపాన్ని, భావావేశాన్ని, ఆలోచనలను, అలవాట్లను వశంలో ఉంచుకోలేని వ్యక్తి ఇతరులను వశపరచుకోలేడు. ఒక ఆలోచన వస్తే అటువైపు వెళ్తాడు, ఇంకొకసారి దానికి వ్యతిరేకమైన ఆలోచన వస్తే అలా చేస్తాడు. ఎటు గాలి వీస్తే అటుపోతుంటాడు. మనః స్థితి నియంత్రణ చేసుకుందామనే దృఢమైన సంకల్పం లేనందువల్ల అనేకమంది వ్యక్తులు ఇలా ప్రవరిస్తుంటారు.

బీడి, సిగరెట్, సారాయి మొదలైన వస్తువులు లేకపోతే బ్రతకలేమనే వ్యక్తులు తారసపడుతుంటారు. వీరు డబ్బులేకపోతే ఆ వస్తువుల కొరకు అడుక్కోవటానికైనా సిద్ధపడతారు. ఉచితమా, అనుచితమా అనే ధ్యాస కూడా ఉండదు. కొందరు టీ కాఫి మొదలైన వాటికి దాసులు అవుతారు. కొందరు తినటం, త్రాగటం లోనే సంతోషం అనుభవిస్తారు. అలవాట్లు మంచివి కావు అని తెలిసినా వాటిని వదులుకోలేరు. అందువల్ల బాధలు అనుభవించ వలసి వస్తుంది. ఇలాంటి అలవాట్లు ఉన్న వ్యక్తి జీవితంలో ముందుకు పోలేడు.

ఆత్మ సంయమం లేని వ్యక్తి తెరచాపలేని నావ. గాలి ఎటువీస్తే అటు కొట్టుకుపోయినట్లు, జీవనసాగరంలో కొట్టుకుపోతాడు. గమ్యాన్ని ఎప్పటికీ చేరలేడు. తనలో ఎంతో గొప్ప మానసిక శక్తులున్నాయని తెలిసినా, అతనికి ఏ ప్రయోజనం కలుగదు. ఉన్నచోటనే చతికిలపడి ఉంటాడు. ఇదంతా ఆత్మ సంయమం లేకపోవటం వల్లనే.

ఈ లోపం వల్ల చిన్న చిన్న బాధలు కష్టాలు, నష్టాలకే నీరసించిపోతాడు. కొంచెం లాభం కలిగినా సంతోషంతో పొంగిపోతాడు. పెద్ద పెద్ద రాజులే తమ ప్రలోభాలను, కోరికలను, అవసరాలను నియంత్రించుకోనందువల్ల పతనమయ్యారు. ఎవరికైనా ఆత్మ సంయమం వల్ల తగిన నిష్పత్తిలో సఫలత, సమృద్ధి లభిస్తాయి. చిన్న చిన్న విషయాలకే భయపడేవారు ఏమీ సాధించలేరు. ఇలాంటి మనుష్యులున్న సమాజం ఏమవుతుంది?

ఆంగ్లేయులు ఆత్మ సంయమం వల్ల విదేశాలకు వచ్చి వ్యాపారస్తులుగా స్థిరపడ్డారు. నెమ్మది నెమ్మదిగా సంపూర్ణ రాజ్యాధికారం సంపాదించారు, పెద్ద పెద్ద యుద్ధాలు గెలిచారు. అమెరికా తన శక్తిని పెంచుకొని, స్వాతంత్ర్యం పొంది గొప్పదేశంగా విలసిల్లింది. పెద్ద పెద్ద సభలు జరిగే ఆ దేశాలలోని ప్రజలు శాంతి పూర్వకంగా, ఆత్మ సంయమ పూర్వకంగా వక్తల ఉపన్యాసాలు వింటారు. ప్రతి పని పద్ధతిగా చేస్తారు. ఇష్టంతో చేస్తారు.

ప్రతి దేశానికి, జాతికి ఓర్పు విషయంలో ప్రత్యేక స్థానం ఉన్నది. ఇతర ధర్మాలను, వర్ణాలను, ఇతర దేశాల వారిని ఎంతవరకు సహించగలరు అనేదానిపై ఉన్నతి ఆధారపడి ఉంటుంది. ఇటువంటి వారిలో ధైర్యంతో ఆత్మ సంయమ పూర్వకంగా పనిచేసే సామర్థ్యం ఉంటుంది.

ప్రాచీన యుగంలో భారతీయ ఋషులు, మునులు ఆత్మ సంయమనానికి చిహ్నంగా ఉండేవారు. గురుకుల నివాసం, అధ్యయనం, బ్రహ్మచర్యం మొదలైన వాటిని చిన్నప్పటినుండే అలవాటు చేసేవారు. రాజ కుమారులు, ఇతరుల పిల్లలు సాదా

**జీవితంపై మమకారం పెంచుకుంటూ పోతే, మృత్యువుపై భయం అదే పెరుగుతూ ఉంటుంది.**

జీవనం, శ్రమ, విద్యాభ్యాసం మొదలైన నియమాలు పాటించవలసి వచ్చేది.

ఆత్మ సంయమం అనే కళను అధ్యయనం చేసేటప్పుడు మొట్టమొదట మస్తిష్కంపై ధ్యానం కలుగుతుంది. మస్తిష్కం అనేక ఆలోచనలతో నిండిఉన్నప్పుడు, ఏక సూత్రత లేకుండా, విభిన్న ప్రలోభాలపై నియంత్రణ లేకుండా వ్యక్తి ఏమీ సాధించలేడు. మస్తిష్కాన్ని అనుకూలంగా జాగృతం చేసుకోవలసిన అవసరం ఉంది. దీనిని సమాజం నుండి దూరంగా పారిపోవడం వల్ల, ఇంద్రియ నిగ్రహం వల్ల సాధించలేరు. మష్తిష్కాన్ని సరియైన దిశలో క్రియాశీలం చేయడం మనం మొట్టమొదట చేయవలసిన పని.

కేవలం ఆలోచిస్తూ కూర్చుంటే ఉపయోగం ఉండదు. మస్తిష్కం క్రొత్త జ్ఞానాన్ని గ్రహించాలి. నవ నిర్మాణం చేయగలగాలి. క్రొత్త ఆలోచనలను, క్రొత్త ప్రణాళికలను, క్రొత్త వస్తువులను ప్రదానం చేయాలి.

గుర్రాన్ని కళ్ళెం వేసి ఎలా అదుపు చేస్తారో అలాగే మస్తిష్కాన్ని నియంత్రించి పనులలో ఉపయోగించుకోవటం వల్ల వికసిస్తుంది. సోమరితనం ఉంటే మస్తిష్కాన్ని కుంటిదానిగా చేస్తుంది. స్వాధ్యాయం వల్ల, సృజనాత్మకంగా ఆలోచించడం వల్ల, మానసిక శక్తులను అధికంగా ప్రయోగించడం వల్ల మస్తిష్కం యొక్క శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి.

మస్తిష్కం యొక్క శక్తి సామర్థ్యాలను మనిషి 10% మాత్రమే ఉపయోగించుకుంటున్నాడని మనోవైజ్ఞానికుల అభిప్రాయం. అంటే మిగిలిన 90% నిద్రావస్థలో ఉంటుందన్నమాట. మెదడులో ఉన్న గుప్త శక్తులు అచేతనంగా పడిఉంటాయి.

కొందరు వ్యక్తులు అనవసరంగా అటు ఇటు తిరుగుతుంటారు. టైము వ్యర్థం చేస్తుంటారు. ఇటువంటి వారు బద్ధకాన్ని వదలిపెట్టి మస్తిష్కాన్ని ఉపయోగించుకోవటం ప్రారంభించాలి. సృజనాత్మక ఆలోచనలతో కూడిన పుస్తకాలను అధ్యయనం చేయాలి. తరువాత ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకోగలగాలి.

కొంతమంది చూస్తుండగానే ఎంతో ఎత్తుకు ఎదగడం, సఫలీకృతం కావడం చూస్తుంటాం. ఎందువల్లనంటే వారు తమ శక్తులను, గుప్త సామర్థ్యాలను గుర్తించి ఉపయోగించుకుంటారు. కొన్ని ప్రేరణలు మనస్సులో అమూల్యమైన పరివర్తన తీసుకొని వస్తాయి. మీలో కూడా అంతులేని శక్తులు నిద్రిస్తున్నాయి. వాటిని ఆత్మ సంయమంతో జాగృత పరచడమే మీరు చేయాల్సిన పని.

అనువాదం–ముక్కామల రత్నాకర్

(అఖండజ్యోతి మార్చి 1955)

★★★

## సాటిలేని సాధకుడు

*ధర్మ, సంస్కృతుల యొక్క పతనాన్ని, అవమానాలను గమనించిన గంగేశ భట్టుకు గుండె బద్దలు కాజొచ్చింది. ఆయన గురువు అది గమనించి, "ఆర్ష సాహిత్యాన్ని పునరుద్ధరించడమొక్కటే నీ కర్తవ్యం, నీ ధర్మం. అదే నీకు నిజమైన భగవద్భక్తి ఔతుంది" అని ఆజ్ఞాపించారు. సంస్కృతిని కాపాడాలంటే మార్గదర్శనం చేసేది సాహిత్యమే. అందువల్ల ఆయన నిరంతరమూ అధ్యయనం చేయడం, అనువదించడం, రచనలు చేయడం మొదలు పెట్టాడు. ఒకవైపు ధనహీనత, మరొక్కవైపు ఇతర లోటు పాట్లున్నా ఆయన సాధన మాత్రం సక్రమంగా సాగుతూనే ఉంది. నెమ్మది నెమ్మదిగా ఆయన పేరు, ప్రఖ్యాతులు అంతటా వ్యాపించాయి. మహారాష్ట్ర దేశానికి పీష్వాగానున్న బాజీరావ్ స్వయంగా ఆయనను చూడడానికి వారణాసికి విచ్చేశారు. గ్రంథభాండారం మధ్యలో పీటమీద కూర్చుని పనిలో మునిగి ఉన్న ఆయనను చూడగానే పీష్వా కళ్లనుంచి బొటబొటానీళ్లుకారాయి. వెంటనే "ఆచార్య శ్రేష్ఠుడా! తమరు అనుమతిస్తే నేను మీకు ఆర్థిక వ్యవస్థ చేస్తాను. తద్వారా తమకు సేవ చేసిన వాడినౌతాను. అదినా భాగ్యంగా భావిస్తాను" అన్నాడు. గంగేశభట్టు ధ్యానం భంగమయింది. వెంటనే తలపైకెత్తి "మహారాజా! ఒక సూత్రానికి వ్యాఖ్య వ్రాయాలంటే కావలసిన గ్రంథాలను సంపాదించడానికి సహాయం చేయండి. నా విషయంలో అదే గొప్పదయఔతుంది" అనితెలిపాడు. ఆర్థిక సహాయం చేద్దామని వచ్చిన మహారాజు ఆసాటిలేని సాధకుని యొక్క నిర్లోభతను చూచి అభినందించ కుండా ఉండలేకపోయాడు.*

★★★

**జీవితంపై మమకారం పెంచుకుంటూపోతే, మృత్యువుపై భయం అదే పెరుగుతూ ఉంటుంది.**

ధారావాహిక: దేవసంస్కృతీ సౌరభం-26

# భారతీయ సంస్కృతిలో సామాజిక దృష్టి - వర్ణాశ్రమ ధర్మాలు

సామాజికదృష్ట్యా కూడా భారతీయ సంస్కృతి వైజ్ఞానికమైన ఆధారం కలిగి ఉన్నది. భారతీయ తత్వవేత్తలు సామాజిక క్షేత్రంలో ఎంతో పరిశోధనచేసి మంచి ఫలితాలను ఇవ్వగల నియమాలను నిర్ణయించారు. వాటి నుండి నేడు కూడా హిందూ జాతి అనేక లాభాలను పొందుతోంది. మన శాస్త్రాల్లో ఆచారమే పరమ ధర్మంఅని తెలుపబడింది. ఆచరణకు పనికిరానిది, వ్యవహారానికి పనికి రానిది, దైనిక జీవనంలో వచ్చే సమస్యలను పరిష్కరించలేనిది, జీవితాన్ని సుఖ,శాంతులతో నింపలేనిది ఐన ధర్మం ధర్మమే కాదని భారతీయ తత్వవేత్తలు భావించారు. మన సంస్కృతిలో ధర్మానికి నైతిక, ఆధ్యాత్మిక ఉన్నతికే గాక సామాజిక ఉన్నతికి కావల్సిన సిద్ధాంతాలను కూడా సమకూర్చడం జరిగింది. ఈ యుగం విప్లవాలకు, సంఘర్షణలకు చెందిన యుగం. మనం భారతీయ ఆచారపరంపరను కాపాడుకోదలిస్తే మన సంస్కృతిలో చోటు చేసుకున్న దోషాలను పోగొట్టి మన పూర్వులు అందించిన విధానాలను చేబట్టడం ఎంతో అవసరం.

భారతీయ సంస్కృతి గట్టిగా నిలబడి వామమార్గాన్ని ఎదిరించవలసిన అవసరం కలిగిన ఒక యుగం ఉండేది. ఆర్య సంస్కృతిని సమర్థించే వారు తమ యొక్క మచ్చలేని నడవడిక వల్ల కలిగిన బలంతో వామ మార్గం వలన ఏర్పడిన ప్రభావాన్ని ఆపివేశారు. ఈనాడు మరల అదే పరిస్థితి కొత్త రూపంలో పాశ్చాత్య సంస్కృతికి చెందిన వేష భాషలతో మనముందుకు వచ్చింది. భౌతికత, కమ్యూనిజాల ప్రచారకులు విచ్చల విడిగా మన ప్రాచీన ఆచారాలను, ఆలోచనలను విరోధిస్తున్నారు. కానీ భారతీయ సంస్కృతికి చెందిన శక్తివంతమైన సామాజికదృష్టి యందు భౌతికవాదంఅనే ఈ అడ్డగోడనిలబడలేదని మన నమ్మకం. భారతీయసమాజంయొక్కపునాది సదాచారం. అందువల్లనే దానికి చెందిన ధర్మాన్ని గురించి తెలుపుతూ మొదటి సూత్రంగా "ఆచారఃపరమో ధర్మః" అని పేర్కొనబడింది. మనకు నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలకు చెందిన వ్యవస్థ ఉంది. ఆ వ్యవస్థల యొక్క గొప్ప తనాలను గురించి సంక్షిప్తంగా క్రింద తెలుపబడుతోంది.

## భారతీయ వర్ణా శ్రమ వ్యవస్థ

**నాలుగు వర్ణాలు:** వేదాలలో వర్ణవ్యవస్థ వర్ణింపబడింది. సమగ్ర సమాజం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అను నాలుగు వర్ణాలుగా విభజించబడింది. ప్రతివర్ణం తనకు నిర్ణయింపబడిన పనులను కలిసికట్టుగాను, నేర్పుగాను నిర్వహించడమే ఈ నాలుగు వర్ణాలు యొక్క లక్ష్యం. ఒక వ్యక్తి ఒక పనిని మనసుపెట్టి చేస్తే ఆ పనిలో కుశలత, విశేషజ్ఞతలు లభిస్తాయి. మాటి మాటికీ పనిని మారుస్తూ ఉంటే ఏ విధమైన లాభమూ ఉండదు, పని సక్రమంగా జరుగదు. అందువల్ల వేదాలలో నాలుగు వర్ణాల యొక్క కర్మలను వేరువేరుగా వర్ణించడంజరిగింది. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే పేర్లతో ప్రసిద్ధికి వచ్చాయి.

"మహా భారత కాలంలో వర్ణవ్యవస్థ ప్రచలితంగా ఉండేది. నాలుగు వర్ణాలకు చెందిన కర్తవ్యాలు అనేక చోట్ల తెలుపబడ్డాయి. తమతమ వర్ణాలను అనుసరించి కర్మలను ఆచరించడంలో తత్పరత కలిగి ఉండే వారు, ఆ విధమైన ఆచరణ వల్ల ధర్మానికి ఏ విధమైనలోటూ ఏర్పడేది కాదు. భగవద్గీతలో ఈ వ్యవస్థను గురించి క్రింది విధంగా తెలుపబడింది.

**"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః"**

*– గీత 4-13.*

ఈ విధంగా గుణ, కర్మలలో గల భేదాల వల్ల మన దగ్గర వర్ణాలకు సంబంధించిన విధానం ఏర్పడింది. బ్రాహ్మణుడంటే తన విద్య, బుద్ధి, జ్ఞానాలతో సమాజంలోని అజ్ఞానాన్ని, మూఢత్వాన్ని నివారించడానికి కృషి చేస్తాడు. బలహీనతలను పోగొట్టువాడు క్షత్రియుడు, ఆర్థికమైనలోటును పోగొట్టువాడు వైశ్యుడు, కృషి, గోరక్ష, వాణిజ్యాల ద్వారా సమాజాన్ని సంపన్నం చేసే పని వైశ్యకర్మ అని తెలుపబడింది. నాలుగవ వర్ణం శూద్ర వర్ణం. నిజానికి శూద్రుడంటే బుద్ధి, వివేకం, దూరదృష్టి మొదలైనవి లేనివాడు, స్వయంగా స్వతంత్రంగా కార్యము నిర్వహించలేనివాడు. కావున అతను పైన తెలిపిన మూడు వర్ణాల వారికిసేవచేస్తూ

సొంత వ్యక్తిత్వం మీద ఆధారపడిన వ్యక్తి ఎప్పుడూ సంతోషంగా ఉంటాడు.

సహాయపడడంమాత్రమే చేయగలుగుతాడు. ఈ ఉద్దేశ్యాలను దృష్టిలో పెట్టుకునే గుణ, కర్మ, స్వభావాలను బట్టి నాలుగు వర్ణాలను ఏర్పాటు చేయడం జరిగింది. మూడు ఉచ్చవర్ణాల యొక్క ప్రత్యేకతలు స్పష్ట పరిచేటందుకే యజ్ఞోపవీతధారణవిధానం ఏర్పాటు చేయబడింది. కానీ రోజులు మారిన కొద్దీ ఈ వర్ణ వ్యవస్థ కఠోరంగా మారి జన్మతోనే వర్ణాన్ని నిర్ణయించే విధానం ఏర్పడింది. కానీ అది సరియైన పద్ధతికాదు. వ్యక్తియొక్క గుణ, కర్మలను బట్టి అతనికి తగిన వర్ణంగా సమాజంలో గౌరవింపబడాలి. తమ వర్ణానికి చెందిన గుణాలు, కర్మలు లేనివారిని ఆ వర్ణంలో చేరనియ్యరాదు. ఈ విధమైన జాతి మార్పులకు సంబంధించిన అనేక సంఘటనలు పురాణాలలో కూడా లభిస్తాయి. విశ్వామిత్రుడు జన్మతః క్షత్రియుడు. కానీ తన విద్య, బుద్ధి ఉన్నతమైనసాంస్కృతికవైభవం, జ్ఞానం, సాధనల బలం వల్ల ఆయన బ్రాహ్మణుడు అయ్యాడు.

కుల విభజన చేయడం పనిని బట్టి మాత్రమే జరగాలి. వారు చేయగల పనిని బట్టివారిని ఆకులంలో చేర్చాలి. కానీ నేడు ఈ వ్యవస్థ దురుపయోగం కావింపబడుతోంది. మనలో అనేక ఉపజాతులు తయారయ్యాయి. బ్రాహ్మణులలోనే అనేక భేదాలున్నాయి. కేవలం సారస్వత బ్రాహ్మణులలోనే 461 శాఖలున్నాయి. క్షత్రియులలో 110, వైశ్యులు, శూద్రులలో అంత కన్న ఎక్కువగానే ఉపజాతులున్నాయి. వాటి మధ్యలోనే వివాహాలు జరుగుతాయి. దీని కారణంగా కొందరు శూద్రాచరణ లేనందు వల్ల తమను పవిత్రతకల వారిగాను, ఉన్నతులుగాను భావించు కోవడం కొందరిని తక్కువవాళ్ళుగా భావించడం జరుగుతోంది.

గుణ, కర్మలే ఆదరణకు, ఔన్నత్యానికి కొలబద్దలు. సమాజం గుణాలనే గౌరవించాలి గాని జన్మనుకాదు. శూద్ర వర్ణానికి చెందిన వ్యక్తి ఎవరైనా తన యోగ్యతను, విద్య, జ్ఞానాలను పెంచుకోవడం జరిగితే అతనికి బ్రాహ్మణునితో సమానమైన గౌరవాన్ని ఇవ్వాలి. జన్మకారణంగా ఎవరినీ బహిష్కరించకూడదు. మహా భారతంలో యక్ష, యుధిష్ఠర సంవాదంలో క్రింది విధంగా పేర్కొనబడింది.

“మనిషి పుట్టుకతోనే బ్రాహ్మణుడుకాలేడు వేదములకు సంబంధించిన జ్ఞానం ఉన్నంత మాత్రంతోనే బ్రాహ్మణుడు కాలేడు. ఉన్నతమైన నడవడిక ద్వారానే మనిషి బ్రాహ్మడుడనబడతాడు”.

**“విప్రాణాం జ్ఞానతో జ్యేష్టమ్, క్షత్రియాణాంతు వీర్యతః”** అని తెలుపబడింది. అనగా బ్రాహ్మణుని యొక్క గౌరవం జ్ఞానం వల్ల, క్షత్రియుని గౌరవం బల వీర్యముల వల్ల” – అని. జాబాలకొడుకు సత్యకాముడు. సత్యకాముని తండ్రి ఎవరో తల్లికి కూడ తెలియదు. అయినా ఎల్లప్పుడు సత్యమునే పలకడం వల్ల బ్రహ్మవిద్యకు అధికారిగా భావింపబడినాడు. కావున వర్ణవ్యవస్థలోని సంకీర్ణతను విడిచి వేయాలి. గుణ, కర్మ, స్వభావాలను బట్టి వర్ణాలను నిర్ణయించడం జరగాలి.

**నాలుగు ఆశ్రమములు:** భారతీయ సంస్కృతి జీవితానికి చెందిన ప్రతి క్షేత్రాన్ని గురించి ఎంతో లోతుగా ఆలోచించడం జరిగింది. పూర్తి ఆయుర్దాయము నూరుసంవత్సరాలుగా నిర్ణయించి దానిని 25 సంవత్సరాల చొప్పున నాలుగు భాగాలు చేయడం జరిగింది మొదటి 25 సంవత్సరాలు శరీరం, మనస్సు, బుద్ధులు పెరగడానికి కేటాయించడం జరిగింది. ఇది బ్రహ్మ చర్యాశ్రమం. ఈ 25 సంవత్సరాలలో యువకుడుగాని, యువతిగాని ఎంతో ఓర్పుతో నేర్పుతో జీవితాన్ని గడుపుతూ రాబోయే సాంసారిక జీవితానికి పనికి వచ్చే శక్తిని సమకూర్చు కోవడం జరిగేది. ఆ సమయంలో వ్యక్తి ఒకవిద్యార్థిగా ఉంటూ ముఖ్యంగా శారీరిక, మానసిక, నైతిక శక్తులను సంపాదించుకోవడం జరిగేది. అన్ని రకాల శక్తులను కూడ గట్టుకుని కుటుంబ జీవనానికి కావలసిన యోగ్యతను సంపాదించుకునేవారు.

రెండవది గృహస్థాశ్రమం 25 నుంచి 50 సంవత్సరముల వరకు గృహస్థాశ్రమానికి కేటాయించడం జరిగింది. భార్యా భర్తలు ధార్మికమైన జీవితాన్ని గడుపుతూ పూర్తి బాధ్యతతో తమ యొక్క కర్తవ్యాలను పాటిస్తూ ఉండేవారు. కుటుంబానికి సంబంధించి తమ బాధ్యతలను పూర్తి చేసేవారు. తాము చేసే పని పాటలలో మనసునిలిపి జీవితాన్ని ఆనందంతో గడిపేవారు. ధర్మాచరణ ద్వారా గృహస్థ జీవనం యొక్క సుఖాన్ని పొందేవారు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అనే పురుషార్థాలను సాధించేవారు.

వయసు ముదిరిన మీదట కుటుంబ బాధ్యత నుంచి తప్పుకోవాలి. కానీ ఈ స్థితిని చేరుకోవడానికి సమయం పడుతుంది. నెమ్మది నెమ్మదిగా భౌతిక జీవనానికి అవసరమైన

**మనస్సును అదుపులో ఉంచుకోగల వ్యక్తియే మంచి ప్రవర్తన కలిగి ఉంటాడు.**

వాటిని తగ్గించుకోవాలి. ఈ విధంగా 25 నుంచి 50 సంవత్సరాల వయసు వరకు గృహస్థజీవనాన్ని గడిపి తరువాత దాని నుండి విముక్తి పొంది, ప్రజా సేవకు పూనుకునే విధానం ఏర్పాటు చేయబడింది. దానినే వానప్రస్థం అని పేర్కొన్నారు. గృహస్థజీవితానికి సంబంధించినబాధ్యతలనుంచి విముక్తిని పొందడం మనిషికి మానసిక శాంతికి ఎంతో ఉపయోగకరం. ఆ తరువాత పారమార్థిక జీవనానికి కావలసినంత సమయం లభిస్తుంది. వాన ప్రస్థం అన్న మాటకు గృహమందు ఉంటూనే బ్రహ్మ చర్యవ్రతాన్ని పాటించడం అని అర్థం చేసుకోవాలి. ఓర్పును, సంయమనాన్ని పాటించే అభ్యాసంచేయాలి, పిల్లలకు విద్యాబోధన చేయాలి, నెమ్మది నెమ్మదిగా తన బాధ్యతలను పిల్లలకు అందించి బైటకు వచ్చేయాలి. పూర్తిగా పరిపక్వత పొందిన వ్యక్తి మాత్రమే ఇంటి నుంచి బైటకు సన్యాసిగా వచ్చి జనులహితానికి చెందిన వివిధ కార్యాలను ఆచరించగలుగుతాడు. వైద్యసేవలు, ధర్మ ప్రచారం, సరియైన మార్గాన్ని దర్శింపజేయడం వంటి పనులు ఎంతో యోగ్యులైన సన్యాసుల చేతులలోనే ఉండేవి. వాళ్లుసమాజానికి ఉన్నత స్థితి కలిగించే దిశలో ముందుకు సాగేవారు. ఒక్క పైసా కూడా తీసుకోకుండా మనస్ఫూర్తిగా పని చేసేవారు. ఈనాడు ఎంత ఖర్చుపెట్టినా ఆ లాభాన్ని పొందలేకపోతున్నాం. సన్యాసినిగుర్తించడం అతనికి గల జ్ఞానాన్ని బట్టి మాత్రమే కుదురుతుంది.

ఈ ఆశ్రమ వ్యవస్థ భారతీయ మనో వైజ్ఞానికుల యొక్క బుద్ధికుశలతకు చిహ్నం. పనిలో నేర్పరితనాన్ని సాధించాలంటే మనిషి పూర్తిగాపరిశ్రమచేయాలి. 25 సంవత్సరాలు దీక్షతో నేర్చుకోవాలి. ఆపనిలో దాగిఉన్న మెళుకువలను గ్రహించాలి. అప్పుడే అతను ఆ పనికి పూనుకోగలుగుతాడు. పాతిక సంవత్సరాలు కృషి చేయడం వలన మనిషి తరువాత రాబోయే జీవితానికి సిద్ధంకాగలుగుతాడు. బాధ్యతలను, మంచి, చెడులను తెలుసుకోగలుగుతాడు. ఆశ్రమంలోని మార్పుకు చెందిన ఆంతర్యాన్ని నెమ్మది నెమ్మదిగా గ్రహించి మానసికంగా పరిపక్వతను పొందగలుతాడు. దాని వలన మరియొక ఆశ్రమాన్ని తేలికగా తీసుకోగలుగుతాడు. పైన తెలిపిన పాతిక సంవత్సరాల వ్యవధిలో తరువాతి ఆశ్రమాన్ని ఎంచుకోవడానికి దానిని గురించి ఆలోచించడానికి కావలసిన సమయంలభిస్తుంది. అందుకే బ్రహ్మచర్యాశ్రమం నుంచి పరోపకార పరాయణులు నేరుగా వానప్రస్థం స్వీకరించి తరువాత సన్యాస దీక్ష తీసుకునేవారు. దీనిని బట్టి ఒక ఆదర్శవంతమైన మార్గాన్ని చూపడానికే మన వర్ణాశ్రమవ్యవస్థ రూపొందింపబడిందని గ్రహించాలి.

అనువాదం – కె.బి.సోమయాజులు

★★★

## దుబారా కూడా దుర్వ్యసనమే

*అబ్రహాం లింకన్ చిన్న వయస్సులో భయంకరమైన దారిద్ర్యాన్ని అనుభవించాడు. దరిద్రం వల్ల కలిగే బాధ ఆయనకు బాగా తెలుసు. ఆయన సొంత ప్రతిభతో రాష్ట్రపతి అయ్యాడు. ఆయన రాష్ట్రపతికదా! భార్య సంపన్న కుటుంబం నుండి వచ్చింది. రాష్ట్రపతి అయ్యాక అబ్రహాం ప్రజాధనాన్ని చాలా జాగ్రత్తగా చూచి చూచి ఖర్చు పెట్టేవాడు. ఆయన దేశ ప్రజల అవసరాల గురించి ఆలోచిస్తూ ఉంటే ఆయన భార్య తన ఇంటి ఆడంబరాల గురించి ఆలోచించేది. రాష్ట్రపతి హోదాకు తగినట్లు ఉండాలని డబ్బును ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టేది. భర్తకు తెలియకుండా రాష్ట్రపతి భవనాన్ని తీర్చిదిద్దడానికి 20వేల డాలర్లు ఖర్చు పెట్టింది. ప్రజాధనాన్ని సొంత ఖర్చులకు వెచ్చించడం లింకన్‌కు ఇష్టం లేదు. తన జేబు నుండి తీసి ఇచ్చాడు. భార్యను మందలించాడు. అయినా ఆమె వినలేదు. చాటు చాటుగా అంతులేని ధనాన్ని ఖర్చు పెట్టేది. చిట్టచివరకు అవన్నీ తీర్చడానికి లింకన్ ఆస్తిపాస్తులను అమ్ముకోవలసి వచ్చింది. ఖర్చు విషయమై ఇద్దరి మధ్య అప్పుడప్పుడు వాదవివాదాలు జరుగుతూ ఉండేవి. చివరలో క్షయవ్యాధి వచ్చి పిల్లలను సరిగా చూచుకోలేకపోయింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అబ్రహంలింకన్ తన భార్య దుబారా ఖర్చు మూలంగా కుటుంబ జీవితంలో ఏమాత్రం సుఖంగా జీవించలేకపోయాడు.*

★★★

**రత్నం కోసం మనం వెదుకుతామే తప్ప రత్నం మనకోసం వెదకదు.**

నావారితో నామాట

# శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-7

## సామూహిక జపం - ఒక అమోఘ ప్రయోగం

### మూలాన్ని శోధించి వాతావరణ నిర్మాణం చేయడమే మన లక్ష్యం

ఈ శీర్షిక ద్వారా అఖండ జ్యోతిలో 30 నెలల నుండి మార్గదర్శనం చేయడం జరుగుతోంది. యుగశక్తి గాయత్రిలో ఆరుమాసాల నుండి ప్రచురిస్తున్నాం. ఈ 100 సంవత్సరాలు గురుసత్తాలో వచ్చిన మహత్తరమైన మలుపులను దీని ద్వారా ప్రచురించడం జరుగుతోంది. "యుగనిర్మాణ యోజన", "ప్రజ్ఞా అభియాన్" అనే పత్రికలను ప్రజలలో మార్పును తేవడానికి గురుదేవులు స్థాపించారు. వాటిని మార్గదర్శకంగా గ్రహించడం జరిగింది. ఈ మధ్య అనేక విధాలైన సంకల్పాలను తీసుకుంటూ ఉన్నాం. వాటిలో సామూహిక సాధన విశిష్టతను పరిజనులకు వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

### కనిపించకుండా వచ్చే ప్రమాదాలే బలమైనవి

మనం నివసిస్తున్న ఈ ప్రపంచాన్ని రెండు భాగాలుగా విభజించి చూచుకోవచ్చు. 1) ప్రత్యక్షం 2) అప్రత్యక్షం. ఎదురుగా కనిపించే కల్లోలాలకు కూడా కనిపించని కారణాలు బలపరుస్తూ ఉంటాయి. వాటిని వెతికిపట్టుకోగలిగిన నాడు లోకంలో ఇంత అరాచకత్వం ఉండదు. ఆధునికంగా ప్రగతిని సాధించిన కొద్దీ కష్టాల పరంపర పెరిగిపోతోంది. నేరాలు, ఘోరాలు హద్దు మీరిపోతున్నాయి. ఏవైపు నుండి చూచినా వినాశకర చర్యలే పెరిగిపోతున్నాయి. కనిపించే ఈ ప్రమాదాలకు వెనుక నుండి ప్రేరేపిస్తూ ఉన్న దుష్ట శక్తులను పసిగట్టాలి. తగిన విధంగా ఎదుర్కోవాలి. ఎదుర్కోవాలి అంటే మూలకారణాలను పరిశోధించాలి. అసలైన కారణాలను వెలికి తీసిచూడాలి. తగిన గుణపాఠం చెప్పాలి. రోగిని పరీక్షించి రోగాన్ని గుర్తించడమే కష్టం అయినపని. రోగం ఏదో తెలిసిన తర్వాత చికిత్స చేయడం చాలాసులభం. ఇది కూడా అంతే. అధికశాతం ప్రజలు భోగవిలాసాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. పశువుల్లాగా, పక్షుల్లాగా కడుపునింపుకోవడం, సంతానాన్ని కనడం మాత్రమే ముఖ్యం అనుకుంటూ ఉన్నారు. అటువంటి వారికి సుతిమెత్తని వైద్యంజరగాలి. అంటే వారిలో సద్బుద్ధినిప్రవేశపెట్టాలి. అదే ఏకైకచికిత్స.

### చరిత్రయే సాక్షి

చరిత్ర నుండి రెండే రెండు ఉదాహరణలు తీసుకుందాం త్రేతాయుగంలో శ్రీరాముడు రావణుని సంహరించి, లంకను జయించాడు. అయినప్పటికీ ప్రజలను గురించి ఆలోచించాడు. లక్షలాదిప్రజలను భాగస్వాములుగా తయారుచేసి సామూహిక జపాలు జరిపించాడు. రాజ్యమంతా తిరిగి 10 అశ్వమేధ యజ్ఞాలను ఏర్పాటు చేశాడు. అదేవిధంగా ద్వాపర యుగంలో మహాభారతయుద్ధంజరిగింది. యుద్ధంనుండి తేరుకున్న ప్రజలను మానసికంగా శుద్ధి చేయడానికి శ్రీకృష్ణుడు ప్రజలందరి చేత జపం-అనుష్ఠానం చేయించాడు. పెద్ద ఎత్తున రాజసూయ యాగం నిర్వహించాడు. దీని ద్వారా కలుషిత వాతావరణం నుండి తేరుకున్న ప్రజలు ఆధ్యాత్మికత మార్గంలోకి ప్రవేశించారు. ఈ విధంగా చరిత్రను, పురాణాలను పరిశీలిస్తే అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. మహాయుద్ధాలు జరుగుతూ ఉన్నప్పుడు, ప్రజలు న్యాయంగెలవాలి అన్నతలంపుతో సామూహికజపం చేస్తూ ఉండేవారు.

### సామూహిక చికిత్స మిక్కిలి ఉపయోగకరం

సామూహిక శక్తిని అంచనావేయలేం, కొన్ని గడ్డిపోచలు కలిస్తే పెద్దమోకు తయారవుతుంది. కొన్ని దారాలు కలిస్తే వస్త్రం తయారవుతుంది. కొన్ని ఇటుకలు కలిస్తే భవనం తయారవుతుంది. ఈ ఉపమానాలన్నింటిలో దాగిన రహస్యం ఒక్కటే. "ఐకమత్యమే మహాబలము". ఒకే సమయంలో, ఒకే తాళంతో, ఒకే లయతో ఏదైనా ఒక పనిని చేసినట్లైతే సూక్ష్మ జగత్తులోనే కాదు, ప్రత్యక్ష జగత్తులో కూడ ప్రభావాన్ని చూపిస్తుంది. సామూహికంగా చేసిన ప్రార్థనకు అమోఘమైన శక్తి ఉంటుంది. వాతావరణాన్ని శుద్ధి చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అసంభవాన్ని సంభవం చేస్తుంది. గాయత్రీ పరివార్ తలపెట్టిన సామూహిక జపం ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితుల్ని తారుమారు చేసి సత్యయుగాన్ని

ఆశ అవసరమే - దురాశ పనికిరాదు.

స్థాపించగలుగుతుంది. స్వర్గం భూమిపైకి దిగివస్తుంది. ఒకే ఆలోచనతో చేయబడిన సామూహిక ప్రక్రియ అంధకారం లాగా అంతటా వ్యాపిస్తుంది. మహాత్మాగాంధీ నడిపించిన సత్యాగ్రహ ఉద్యమం, దండి సత్యాగ్రహం మొదలైనవి అన్నీ నిరాటంకంగా కొనసాగాయి. చిట్టచివరకు స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టాయి.

## ఆధ్యాత్మికతకూ ఐకమత్యం కావాలి

పై ఉదాహరణలు అన్నీ సామూహిక శక్తిని గురించి గుర్తు చేయడానికే. ముస్లిములు అందరు కలసి నమాజు చేస్తారు. క్రైస్తవులు అందరుకలసి ప్రార్థన చేస్తారు. మిలటరీవాళ్ళు అందరుకలసి కవాతుచేస్తారు. మరి మనంకూడా అందరం కలసి ఎందుకు ఆధ్యాత్మికతను చాటి చెప్పలేకపోతున్నాం? అంతరిక్ష పరిశోధనల కోసం ఒకేసారి అందరు కలసి మౌనంగా ఆహుతులు ఇవ్వగలగడం కూడా ఒక యజ్ఞమే అవుతుంది. నాలుగు దిక్కులా కమ్ముకుని ఉన్న అనాచారాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, నక్సలిజం మొదలైన వాటికి చికిత్స కూడా సూక్ష్మ పద్ధతిలోనే చేయవచ్చు. అనేకమంది తమ ప్రాణశక్తిని, ఆలోచనా శక్తిని, శబ్దశక్తిని, ఓర్పును, నేర్పును అన్నింటిని ఒకేసారి, ఒకే సమయంలో ఉపయోగించి, జపం – ధ్యానం చేయడమే సూక్ష్మ చికిత్స అవుతుంది. దీని ప్రభావం అమోఘం, అద్వితీయం అని చెప్పవచ్చు. గతంలో కూడా ఇలాంటి ప్రయోగాలు చాలా జరిగాయి. ఇప్పుడు 16 నెలలలో రాబోయే శత జయంతి నాటికి శ్రద్ధాంజలి సమర్పించే నిమిత్తం ప్రపంచమంతా ఈ ప్రయోగమే చేయబడుతోంది.

## శబ్ద శక్తి ప్రయోగం

సృష్టి ప్రారంభం నుండి ఇప్పటివరకు జపించబడిన మంత్రాలలో గాయత్రీ మంత్రానిదే ప్రథమ స్థానం. గాయత్రీ మంత్ర ఉచ్చారణలో శబ్ద శక్తి ఓంకారనాదంతో పాటు అంతరిక్షంలో అంతటా వ్యాపిస్తుంది. దానివల్ల మంత్రశక్తి యొక్క మహత్తు రెట్టింపు అవుతుంది. సమాన ధర్మంగల స్పందనలు ఒకదానిని మరొక్కటి ప్రభావితం చేస్తూ ఉంటాయి. శబ్ద శక్తి సహజంగా మానవ శరీరాన్ని, అంతరిక్ష జగత్తును ప్రభావితం చేయగల సమర్థత కలిగి ఉంటుంది. ఇది మనస్సు నుండి, అంతరంగం నుండి బయలుదేరుతుంది. ఉన్నతమైన ప్రవర్తన గల సాధకుడు మంత్రజపంతోపాటు ధ్యానం చేసినట్లైతే మహర్షుల వలె వాతావరణాన్ని పూర్తిగా మార్చివేయగలుగుతాడు. "ధియోయోనః ప్రచోదయాత్" "అగ్నేనయసుపథారాయే" "ఆనో భద్రాఃకృతవోయన్తు విశ్వతః" ఈ మంత్రాలలో అందరికొరకు సద్బుద్ధిని కోరుకునే విధానం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. ఒకేరకమైన భావాల అలలు సన్మార్గం వైపు పరుగుతీస్తూ ఉంటాయి. "ప్రపంచంలో అన్ని మంత్రాల కన్నా గాయత్రీ మంత్రం చిన్నది. కాని అన్నింటికన్నా సారవంతమైనది. ధర్మ శాస్త్రాలు, తత్వదర్శనం, ఆధ్యాత్మవిజ్ఞానంతో కూడి ఉన్నది. విశ్వ వ్యవస్థలో సత్యయుగానికి సంబంధించిన సమస్త సూత్ర సంకేతాలు దీనిలో ఇమిడి ఉన్నాయి. ఇదే నూతన యుగానికి ఆధారభూతమైన బీజ మంత్రం" అని పరమ పూజ్య గురుదేవులు 1983 ఆగష్టు మాస పత్రిక అఖండ జ్యోతిలో వ్రాశారు. దాని ప్రకారం ప్రజ్ఞా పురశ్చరణ రూపంలో, సామూహిక జపరూపంలో దేశ విదేశాలలో పరంపరగా నడుస్తూ ఉంది.

## 21వ శతాబ్దిలో అమోఘ ప్రయోగం

2011–2012 మధ్యలో అనేక మార్పులు జరగబోతూ ఉన్నాయి. నూతన మానవ జాతి యొక్క ఆవిర్భావం కోసం విత్తనాలు నాటాల్సిన సమయం. 21వ శతాబ్దాన్ని "నాన్‌లోకల్ థెరపి" "ప్రేయర్ హీలింగ్" సంవత్సరం అని అనుకుంటూ ఉన్నారు. ఎలక్ట్రానిక్స్ వెబ్ వరల్డ్ వైజ్ఞానికులు విధ్వంసకారి ప్రపంచాన్ని మనముందు ఉంచారు. దానిని నియంత్రించడానికి ప్రపంచం నాలుగు మూలలా ఎక్కడో ఒకచోట పెద్ద ఎత్తున గాయత్రీ మంత్రాన్ని సామూహికంగా జపిస్తూనే ఉన్నారు. అన్ని సమయాలలో గాయత్రీ మంత్రం మారుమ్రోగుతూనే ఉంది. ఇప్పుడే మేము నాదీనగర్‌లో శక్తి పీఠానికి ప్రాణప్రతిష్ఠ చేసి వస్తున్నాం. ఆ సందర్భంగా అన్ని ప్రజ్ఞామండళ్ళలోనూ కొద్దిమందితో అయినా సరే సామూహిక జపం జరపాలనీ, తక్కువలో తక్కువ 15 నిమిషాలు, ఎక్కువలో ఎక్కువ ఒక గంట సేపు సామూహిక గాయత్రీ జపం జరగాలనీ చెప్పడం జరిగింది. ఈ ప్రక్రియను అందరు ఎంత వేగంగా ఆచరిస్తే అంత వేగంగా పరమ పూజ్య గురుదేవుల శత జయంతికి కావాల్సిన వాతావరణం ఏర్పడుతుంది.

అనువాదం – పొన్నూరు హైమవతీ శాస్త్రి

*(అఖండ జ్యోతి – ఆగస్టు 2009)*

★★★

**అంతు తెలియని సముద్రంలో ఆణిముత్యాలు ఉన్నట్లే, శోక సముద్రానికి లోతులలో సుఖాలు ఉంటాయి.**

# ఏ పుస్తకంలో ఏముంది?

## ప్రజ్ఞావతార విస్తార ప్రక్రియ

రచన : **పండిత శ్రీరామశర్మ ఆచార్య**

అనువాదం : **శ్రీమతి సీతామహాలక్ష్మి**

పరిచయం : **ముక్కామల రత్నాకర్**

ఇది క్రాంతి ధర్మీ సాహిత్యంలోని 9వ పుస్తకం. యుగ పరివర్తన కొరకు కావలసిన వాతావరణ నిర్మాణం కొరకు యుగసంధి మహా పురశ్చరణ జరిగింది.

భగవంతుడు విశేష కార్యాలకు ఎన్నుకునే వారిలో దివ్య ప్రాణం అధికంగా ఉంటుంది. వీరిలో 1. ఉత్సాహం, స్ఫూర్తితో కూడిన శ్రమ శీలత 2. తన్మయతతో కూడిన అభిరుచి 3. పనిమీద శ్రద్ధ తప్పని సరిగా ఉంటాయి. ఈ లక్షణాలు కలవారినే విజయలక్ష్మి వరిస్తుంది.

సహజంగా భక్తుడు భగవంతుని నుంచి అనుగ్రహం కోరుకుంటాడు. కాని ప్రస్తుత సమయంలో భగవంతుడే ఆయన కార్య ప్రణాళికను సాకారం చేసే వ్యక్తుల కొరకు అన్వేషిస్తున్నాడు. భక్తులను పిలుచుకుంటున్నాడు. లక్షల సంవత్సరాల తరువాత ఇటువంటి సమయం వస్తుంది. యుగపరివర్తనా సమయంలో పురుషార్థాన్ని చూపించి ఉచ్చకోటికి చెందిన శౌర్య పతకాలను పొందాల్సి ఉంటుంది. అలాంటి వారు అజరామరులుగా మిగిలిపోతారు. ఈ అవకాశాన్ని పోగొట్టుకున్న వారు ఎల్లవేళల్లో పశ్చాత్తాప పడవలసి వస్తుంది. పరివార సభ్యులందరిని యుగ పరివర్తన కార్యక్రమంలో పాల్గొనాలని ఈ పుస్తకం ఉద్బోధిస్తున్నది.

## నూతన సృష్టికి మహాకాలుని ప్రణాళిక

రచన : **పండిత శ్రీరామశర్మ ఆచార్య**

అనువాదం : **డి.వి.ఆర్. మూర్తి**

పరిచయం : **ముక్కామల రత్నాకర్**

ఇది క్రాంతి ధర్మీ సాహిత్యంలోని 10వ పుస్తకం. గత 2000 సంవత్సరాలుగా అవినీతి, అనాచారాలు అన్ని పరిధులు దాటి పోయాయి. దయ, క్షమ అనే పేరుతో దుర్మార్గాన్ని సహించటం అవాంఛనీయమే. దుర్మార్గంతో పోరాడటం మానవీయ గొప్పదనాన్ని సూచిస్తుంది.

ఈ ప్రపంచాన్ని సృష్టించిన వారి చేతిలో అంకుశం ఉన్నది. అవసరమైనప్పుడు ఈ అంకుశాన్ని ప్రయోగిస్తాడు. ప్రస్తుతం అదే జరుగుతున్నది. అదే మానవజాతి కష్టాలకు, బాధలకు మూల కారణం. దీనితో పాటు నూతన సృష్టికి ప్రణాళిక ప్రకారం అమలు చేయడం జరుగుతున్నది.

ప్రాచీన కాలంలో పరివర్తన నెమ్మది నెమ్మదిగా జరిగేది. కాని ఈనాడు 2000 సంవత్సరాలలో జరుగవలసిన మార్పు కేవలం 100 సంవత్సరాలలోనే పూర్తి అవుతుంది. ఈ మార్పులలో శాంతి కుంజ్‌లో జరుగుతున్న శిక్షణా తరగతులు, జపం, ధ్యానం, సాధకులు జరుపుతున్న కార్యక్రమాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

సమాజం అనే పొలంలో సత్ప్రవృత్తులు అనే విత్తనాలు సూత్రసంచాలకుని కృషితో మొలకెత్తి, పెరిగి విశాలమైన ఉద్యాన వనంగా అందరి ముందుకు వచ్చింది. ఈ సత్ప్రవృత్తులను ఇంకా అభివృద్ధి చేయడానికి ఎందరో కృషి చేస్తున్నారు. ఈ నవయుగ ఆగమనంలో పాల్గొనే వారిని అదృష్టవంతులుగా, నిజమైన భగవద్భక్తులుగా గుర్తించాలి. మనం కూడా ఈ యుగ నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొనాలని ఈ పుస్తకం ప్రేరణ ఇస్తున్నది.

★★★

స్వార్థ త్యాగమే సంసార నౌకను చక్కగా నడిపించే చుక్కాని.

## పరమపూజ్య గురుదేవుల శతాబ్ది ఉత్సవాల నిమిత్తం వివిధ భాషలలో అనువదించి, ప్రచురించుటకు ఎంపిక చేసిన 40 పుస్తకములు

1. 21వ శతాబ్దం మారుపేరు ఉజ్వల భవిష్యత్తు–భాగం–1
2. 21వ శతాబ్దం మారుపేరు ఉజ్వల భవిష్యత్తు–భాగం–2
3. యుగావసరం–ప్రతిభా సంస్కరణ – భాగం–1
4. యుగావసరం–ప్రతిభా సంస్కరణ – భాగం–2
5. సత్యయుగ పునరాగమనం
6. మహత్తర పరివర్తనా క్షణాలు
7. జీవన సాధనా స్వర్ణిమ సూత్రములు
8. ప్రతిభావంతులకు మహాకాలుని ఆహ్వానము
9. ప్రజ్ఞావతార విస్తార ప్రక్రియ
10. నూతన సృష్టికి మహాకాలుని తయారీ
11. నేటి సమస్యలు – రేపటి సమాధానాలు
12. మనఃస్థితి మారితే పరిస్థితి మారుతుంది
13. సృష్టికర్త పరమ ప్రసాదం – ప్రఖర ప్రజ్ఞ
14. ఆదిశక్తి గాయత్రి సమర్థ సాధన
15. చదువే కాదు–విద్య కూడా
16. సంజీవనీ విద్యా విస్తరణ
17. భావ సంవేదనల గంగోత్రి
18. మహిళా జాగరణ ఉద్యమం
19. జీవన దేవతా సాధన – ఆరాధన
20. సమయదానమే యుగధర్మం
21. నవయుగ మత్స్యావతారం
22. 21వ శతాబ్ది గంగావతరణ
23. అందరికీ సులభ ఉపాసన – సాధన
24. ఉపాసనకు రెండు చరణములు – జపం, ధ్యానం
25. గాయత్రి ఉపాసన ఎందుకు ? ఎలా?
26. మన యజ్ఞ ఉద్యమం
27. గాయత్రి విషయంలో సందేహాలు – సమాధానాలు
28. స్త్రీల గాయత్రీ అధికారం
29. గాయత్రీ మంత్ర విలక్షణ శక్తి
30. ఆత్మిక ప్రగతికి ఆశ్రయ ఆవశ్యకత
31. నిత్య గాయత్రీ సాధన
32. సంక్షిప్త హవన విధి
33. యుగయజ్ఞ పద్ధతి
34. యుగసంస్కార పద్ధతి
35. నేను ఎవరు?
36. ఆధ్యాత్మిక వాదమే ఎందుకు?
37. వివేకుల అవివేకం
38. నిర్వహణా బుద్ధి యొక్క గౌరవం
39. సప్త ఉద్యమాలు
40. ఋషి యుగ్మ పరిచయం

### అనువాదకులకు ముఖ్య సూచనలు

1. పై 40 పుస్తకాలు తెలుగులోనికి అనువాదం అయినాయి.
2. అనువాదకులు శాంతికుంజ్ దక్షిణ ప్రకోష్ట (సౌత్ సెల్) నుండి పంపబడిన పుస్తకాలను మాత్రమే అనువాదం చేయాలి. వారు తమకు తాముగా ఎంపిక చేసుకుని అనువాదం చేయడం వల్ల – ఒకే పుస్తకాన్ని ఇద్దరు అనువాదం చేస్తే పరిస్థితి ఏర్పడవచ్చు.
3. అనువాదాలను ఎ–4 కాగితాల మీద వ్రాయాలి. అందువల్ల వాటిని జిరాక్సు చేయడం సులువు అవుతుంది. అనువాదాలను, హిందీ పుస్తక ప్రతులనూ శాంతికుంజ్, దక్షిణ ప్రకోష్టకు పంపాలి.
4. తెలుగు ప్రచురణల జాబితా తయారవుతోంది. అనువాదకులు తాము అనువదించిన పుస్తకాల ప్రతులను, తమ చిరునామాలను దక్షిణ ప్రకోష్టకు పంపాలి.
5. అనువాదకులు తాము గతంలో చేసిన అనువాదాల వ్రాత ప్రతులను దక్షిణ ప్రకోష్టకు పంపాలి.
6. వివరాలకు సంప్రదించండి – సెల్ : 09319434006
E-mail : umeshsharma75@gmail.com

**మనం ఎదుటి వారిని అర్థం చేసుకోలేకపోవడం మనకు సంబంధించిన విషయం.**

# రాష్ట్ర కార్యకర్తల ప్రశిక్షణా శిబిరం-హైదరాబాద్-ఆం.ప్ర.

27.06.09 శనివారంనాడు ఆంధ్రప్రదేశ్ గాయత్రీ పరివార్ కార్యకర్తలకు ప్రశిక్షణా శిబిరం హైదరాబాదులో జరిగింది. ఈ శిబిరానికి రాష్ట్రం నలుమూలలనుండి 600 మంది కార్యకర్త హాజరు అయ్యారు. దక్షిణ భారత జోన్ నిర్వాహకులు సంత్ డా॥ బ్రిజ్‌మోహన్ గారు పరమపూజ్య గురుదేవుల సందేశాన్ని కార్మకర్తలకు అందించారు. "మీమీ గుణగణాలలో పరమ పూజ్యగురుదేవుల యొక్క జీవనసాధనాసూత్రాలను చేర్చుకో వలసింది." అని కార్యకర్తలకు బోధించారు. పరమపూజ్య గురుదేవులశతజయంతికార్యక్రమాలను నిర్ణయించడం జరిగింది. ''సృజన సాధనా మహాపురశ్చరణ''లో వ్యక్తిపరంగా, సామూహికంగా, కుటుంబపరంగా సంకల్పం తీసుకోవడం జరిగింది. గత సంవత్సర రిపోర్టు మీద సమీక్ష జరిగింది.

మన గురుదేవులు ఒక వ్యక్తికాదు. మహాశక్తి ఆలోచనల స్వరూపమే గురుదేవులు. రాబోయే శత జయంతి వారి ఆలోచనా ధారలదే. అందువల్ల వారు రచించిన సాహిత్యాన్ని అనువదించడం, ప్రచురించడం, ప్రచారంచేయడం, చదవడం, చదివించడం మొదలైనవి తప్పని సరిగా జరగాలి. ప్రతీ కార్యకర్త ప్రతీరోజూ ఒక గంట స్వాధ్యాయం చేయాలన్న సంకల్పం తీసుకోవడం జరిగింది. ఋత్విజ్, వరణీ, భాగీదార్‌ల చేత "తపము, జపం, స్వాధ్యాయం, దానం, సేవ" మొదలైన వాటిని గూర్చి పత్రాలమీద సంతకంచేయించడం జరిగింది.

27.06.09 నాడు ఉదయం 7 గంటల నుండి కార్యకర్తలకు స్వాగతంపలకడం ప్రారంభం అయింది. 600 మంది కార్యకర్తలకు గాయత్రీ చేతనా కేంద్రం తరపున పెన్ను, డైరీ, పత్రాలు, జీవనసాధన ప్రత్యేక సంచిక "యుగశక్తి గాయత్రి" పెట్టిన ఫైలు ఇవ్వబడింది. 10 గంటలకు యుగ సంగీతంతో కార్యక్రమం ప్రారంభం అయింది. జన్మశతాబ్ది గీతాలతో సభ మారు మ్రోగింది. 10-30 గంటలకు సంత్ డా॥ బ్రిజ్‌మోహన్ గారు, శ్రీ॥ అశ్విని సుబ్బారావు, శ్రీహనుమంతరావు, డా॥ శ్రీరామకృష్ణ మాష్టరు గారు, శ్రీ ఎం. విశ్వనాథ ప్రసాద్, శ్రీపరమానంద ద్వివేది,శ్రీ ఉమేశ్ శర్మ మొదలైన వారు జ్యోతి ప్రజ్వలన గావించారు. తరువాత ఆంధ్ర ప్రదేశ్ గాయత్రీ పరివార్ రీజనల్ కన్వీనర్ శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీమతి సౌజన్య, శ్రీమతి విజయ, శ్రీ యుగంధర్, శ్రీవెంకటేశ్వర్లు, శ్రీవేణుగోపాలరెడ్డి, శ్రీహనుమంతరెడ్డి, శ్రీసతీశ్ ఖండేల్‌వాల్ మొదలైన ప్రముఖ కార్యకర్తలకు తిలకం దిద్ది స్వాగతించడం జరిగింది. హిందీ ఉపన్యాసాలను శ్రీజగన్‌మోహన్ అనువాదంచేసి చెప్పారు.

దేవసంస్కృతి విశ్వవిద్యాలయం యొక్క "దూర విద్య శిక్షణా కేంద్రం" ద్వారా వ్యక్తిత్వ పరిష్కారంనకు సంబంధించిన పుస్తకాలు మూడు (1) "నిర్మాణాత్మక జీవనకళ" (2) "మానవ జీవన వికృతులు-పరిశీలన-సమాధానాలు" (3) "ఆధ్యాత్మిక జీవనం" ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్టేట్ కన్వీనర్ శ్రీమతి కస్తూరిలక్ష్మి, కో-కన్వీనర్ శ్రీకృష్ణమూర్తి చూస్తున్నారు. కార్యక్రమానికి వచ్చిన వారిలో 60మంది రిజిస్ట్రేషన్ చేయించు కున్నారు. ఈ శిబిరానికి జిల్లా / టౌన్ కమిటీ మెంబర్స్‌ను మాత్రమే పిలవడం జరిగింది. కార్యకర్తలందరికీ ఐ.డి. కార్డు నిమిత్తం ఫొటోలు తీయించారు.

ఆంధ్రప్రదేశ్ సంగఠనా వ్యవస్థాపకులుగా శ్రీ గంధం జగన్నాథంగారిని నిర్ణయించడం జరిగింది. గాయత్రీ చేతనా కేంద్రం-హైదరాబాదు, పూర్తి ఆంధ్రప్రదేశ్‌లో సంగఠన గురించీ, నూతన కార్యక్రమాల గురించి తెలుసుకుంటూ చేయడం, చేయించడం వారి బాధ్యత.

ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1-30 గంటల వరకు మొదటి కాలాంశం, భోజనానంతరం 2-30 గంటల నుండి 7 గంటల వరకు రెండవ కాలాంశం నిర్వహింప బడ్డాయి. ఇంత వరకు జరిగిన ప్రగతిపైన, రాబోయే 6 మాసాలలో చేయబోయే కార్యక్రమాలపైన చర్చ జరిగింది. గురుదేవుల కార్యాన్ని నిష్ఠతో నిర్వహించాలన్న సంకల్పం తీసుకోబడింది.

ఈ కార్యక్రమానికి స్థానికంగా సహకరించిన శ్రీ లక్ష్మణరావు, శ్రీమతి/శ్రీ హరికృష్ణ దంపతులు, శ్రీ అరవింద్, శ్రీవిష్ణు, శ్రీ కె.పి.విఠల్, శ్రీ వి.వి.పంతులు, శ్రీసంతోష్, శ్రీ వెంకట నారాయణ, శ్రీ జగన్నాధ చౌదరి, శ్రీరాకేశ్‌రావు, శ్రీ పూల్‌సింగ్, శ్రీ లక్ష్మీనారాయణ, శ్రీ చిరంజీవ, శ్రీమతి అనసూయయ్మ, శ్రీమతి సత్యవతి, శ్రీకృష్టారావు, శ్రీ సతీశ్ శర్మ, శ్రీకృష్ణ మూర్తి, చేతనా కేంద్రం వ్యవస్థా ప్రముఖ్ శ్రీహీర్‌సింగ్ రాజ పురోహిత్, శ్రీరాజేంద్ర యాదవ్, శ్రీవినోద్ చౌదరీ, శ్రీఉపాధ్యాయ, శ్రీరతన్, శ్రీ అప్పారావు మొదలైన కార్యకర్తలందరికి ధన్యవాద సమర్పణతో సమావేశం ముగిసింది.

★★★

**కృతజ్ఞతకు బద్ధులమై ఉండాలి.**

వార్తలు

# రాష్ట్రమంతటా గాయత్రీ జయంతి ఉత్సవాలు

## సైదాబాద్, హైదరాబాద్‌లో

01.05.2009 పూర్ణోదయ కాలని, సైదాబాద్‌నందు త్రికుండి గాయత్రి మహాయజ్ఞం గాయత్రీ చేతనా కేంద్ర ప్రతినిధులు శ్రీ హనుమంత్‌రెడ్డి దంపతులు, శ్రీమతి అనుసూయమ్మ నిర్వహించారు. ఈ యజ్ఞానికి శ్రీ ప్రతాప్‌రెడ్డి సహకరించారు.

## బోరబండ, హైదరాబాద్‌లో

బోరబండ, హైదరాబాద్‌లో గాయత్రీ నవరాత్రి సందర్భంగా 9 రోజులు వివిధ ప్రదేశాలలో సామూహిక గాయత్రీ మంత్ర జపం, గాయత్రీ యజ్ఞాలు నిర్వహించబడ్డాయి. పూర్ణాహుతిగా పంచకుండి గాయత్రీ మహాయజ్ఞం వాసవి కన్యాకా పరమేశ్వరీ దేవాలయము నందు జరిగింది. 40మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్ గుప్త ఆధ్వర్యంలో ఇతర మిత్రుల సహకారంతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది.

## ఇల్లెందులో

ఇల్లెందులోని గాయత్రీ జ్ఞాన కేంద్రంలో జూన్ 1,2 తేదీలలో గాయత్రీ జయంతి ఉత్సవాలు జరిగాయి. మొదటి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 40 మంది పరిజనులతో 50000 గాయత్రీ జపం జరిగింది. 2వ రోజు పంచకుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. శ్రీ సతీష్ ఖండేల్వాల్ ఆధ్వర్యంలో శ్రీ ఎస్.వి.షరబ్, శ్రీమతి కిరణ్ గుప్తా, శారదాచారి సహకారంతో శ్రీ ఎస్.సత్యన్నారాయణ బృందం ఈ యజ్ఞాన్ని నిర్వహించారు.

## కామారెడ్డిలో గాయత్రీ ప్రజ్ఞాపీఠం ప్రారంభోత్సవ వార్త

గాయత్రీ ప్రజ్ఞా పీఠం కామారెడ్డిలో గాయత్రీ జయంతి రోజున (జూన్ 2) శ్రీ అశ్వినీ సుబ్బారావుగారు, గాయత్రీ పరివార్ దక్షిణ భారత సంచాలకులు గారిచే ప్రారంభోత్సవం చేయబడింది. ఆ సందర్భంగా మూడు కుండీల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించబడింది. దీనిలో దాదాపు 300 మంది పరిజనులు పాల్గొన్నారు. శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్, శ్రీ ప్యారేలాల్, శ్రీ వెంకటనారాయణ, శ్రీ ఫూల్ సింగ్, శ్రీ లక్ష్మినారాయణ మొదలయినవారు హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రం నుండి వచ్చి సహకరించారు.

ఈ ప్రారంభోత్సవ సందర్భంగా అఖండ జపం ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటలకు వరకు 155 మంది చేత జరుపబడింది. ఈ ప్రజ్ఞాపీఠం నిర్మించినవారు శ్రీ రంగారావు దంపతులు. ఈ ప్రజ్ఞాపీఠం స్థాపించుటలో శ్రీ వాణి, శ్రీ గోపాల్ కిషన్‌రావు, శ్రీమతి ఇందిర, శ్రీ సత్యంరావు, శ్రీమతి భారతి, శ్రీ హరికిషన్ రావు, శ్రీ ఉపేందర్, శ్రీ బాపూరావు, నర్సయ్య, సత్యయ్య, తదితులు సహకరించారు.

## విజయనగరంలో

విజయనగరం జూన్ 22 – స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమంచి సుబ్బారావు వివాహ జయంతి సందర్భంగా గాయత్రీ పరివార్ విశాఖ ప్రతినిధులు అవతార్ రాజు, శ్రీమతి సౌజన్యల నిర్వహణలో గాయత్రీ యజ్ఞం మరియు శుభ సందేశం ఏర్పాటు చేయబడినది. కార్యక్రమంలో సుమారు రెండు వందల మంది భక్తులు పాల్గొని భక్తి నియమ నిష్ఠలతో యజ్ఞ కార్యక్రమాన్ని సఫలం చేసారు. ఈ సందర్భంగా ఆహుతులకు యజ్ఞం యొక్క విశిష్టత, ప్రయోజనాల గురించి వివరించబడినది. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్స్ సభ్యులు, రోటరీ సభ్యులు, సాహితీ వేత్తలు, బంధుమిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని శ్రీమతి వెంకటలక్ష్మి, కుసుమంచి సుబ్బారావులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

## ఒడరేవులో

2009 జూలై 5 నుంచి 7వ తేది వరకు మూడు రోజులు గురు పూర్ణిమ మహోత్సవములు ఒడరేవు శ్రీరామ హంస సహ్యాద్రి

సత్యానికి, శీలానికి మెరుగులు దిద్దేదే విద్య

ఆశ్రమములో చక్కగా జరిగాయి. ఈ కార్యక్రమములను జిల్లేళ్ళమూడి ఆశ్రమము నుంచి శ్రీ హనుమబాబు ప్రారంభించారు. శ్రీమతి రాజ్యలక్ష్మి అంతర్యాగం చేయించారు. కారంచేడు వశిష్ఠ ఆశ్రమం నుంచి శ్రీ ప్రణవానందుల వారు జాగ్రద వస్థ, సుషుప్తావస్థల గురించి వివరించారు. శ్రీ సీతారాం ఆర్థిక విధానం గురించి, శ్రీ రత్నాకర్ న్యూ ఎరా కలర్ ఇంజనీరింగ్ గురించి వివరించారు. నవకుండి గాయత్రి మహాయజ్ఞంతో పూర్ణాహుతి జరిగింది. ఈ కార్యక్రమాలు శ్రీ సుబ్బారావు, శ్రీమతి పార్వతిల ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి.

## భీమిలి శ్రీ దుర్గా గాయత్రీ శక్తి పీఠంలో గురు పూర్ణిమ మహోత్సవము

07-07-09 గురు పూర్ణిమ సందర్భంగా భీమిలి శ్రీ దుర్గా గాయత్రీ శక్తి పీఠంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 6 గంటలకు శ్రీమతి జి.భారతి త్రిపద గాయత్రీ ఆలయంలో కొలువున్న అమ్మవార్లకు విశేష అలంకరణ గావించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు 25 మంది భక్తులు (విశేషంగా అందరూ స్త్రీలు) గాయత్రీ జపం చేశారు.

ఉదయం 10.30 గంll ల నుండి 1 గంట వరకు గాయత్రీ మహాయజ్ఞం పంచకుండీ గాయత్రీ యజ్ఞశాలలో సంపన్నమయినది. 25 మంది స్త్రీలు యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీమతి భారతి పూజ్యగురుదేవులు వందనీయ మాతాజీల గురించి, వారి యుగనిర్మాణ సంకల్పముల గురించి, గురు పరంపర గురించి, గురు పూర్ణిమ ప్రత్యేకత గురించి సంక్షిప్త ప్రవచం చేశారు.

## వరంగల్లులో

02.06.2009 గాయత్రీ జయంతి సందర్భంగా వనమా సురేశ్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ రాజు ఫీ స్వీట్సు విక్టరీ ఎవెన్యూ అపార్టుమెంటు ప్రాంగణంలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం వైభంగా నిర్వహించబడింది. శ్రీ ఎ.ఆర్.కె.మూర్తి, శ్రీ జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యం వహించారు. గాయత్రీ జయంతి సందర్భంగా ఆరుగురి ఇండ్లల్లో ఏక కుండీ యజ్ఞాలు, 7 జన్మదిన సంస్కారాలు, 3 పుంసవన సంస్కారాలు జరిపించడం జరిగింది.

## ఉప్పలపాడులో

02.06.2009 ఉప్పలపాడు గ్రామంలో గాయత్రీ జయంతి సందర్భంగా నవకుండి గాయత్రీ మహాయజ్ఞం స్థానికంగా ఉన్న "శ్రీ ప్రసన్న సాయిరాం" కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. దాదాపు 80 గ్రామాల నుండి పాల్గొన్నారు. కార్యక్రమం ఉదయం కలశ యాత్ర జిల్లా కన్వీనర్ శ్రీ పేరిశాస్త్రి సారథ్యంలో జరిగింది. ఈ యజ్ఞ కార్యక్రమంలో సనాతన ధర్మ సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీ చెన్న కేశవస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని వారి దివ్య ప్రవచనం అందించారు. గాయత్రీ పరివార్ సంస్థ కార్యకలాపముల గురించి, ఆలోచనలో క్రాంతి గురించి శ్రీ పేరిశాస్త్రి వివరించారు. శ్రీ ప్రసన్న సాయిరామ్ కళ్యాణ మండపాన్ని వ్యవస్థాపకులు యజ్ఞ కార్యక్రమం కొరకు ఉచితంగా ఇచ్చారు. వారికి ధన్యవాదములు.

## విశాఖపట్టణంలో గాయత్రీ జయంతి

02.06.2009 విశాఖపట్టణం గాయత్రీ పరివార్ ప్రజ్ఞమండలి కార్యాలయంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం కడు వైభంగా నిర్వహించబడింది. శ్రీ అవతారం రాజు, జిల్లా కోఆర్డినేటర్, కోస్తా జిల్లాల కోఆర్డినేటర్ శ్రీమతి సౌజన్య, పట్టణ కన్వీనర్ శ్రీ హేమచంద్రరావు, శ్రీ మహేష్, శ్రీమతి వసంత, శ్రీమతి లీలావతి ఈ యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొన్నవారి చేత ఇంటింటికి గాయత్రీ మంత్రాన్ని తీసుకెళతామని, గురు సాహిత్యాన్ని ప్రజలందరికి పరిచయం చేస్తామని యుగశక్తి గాయత్రీ మాస పత్రికకు వీలయినంత ఎక్కువ మందిని చందాదారులుగా చేరుస్తామనే సంకల్పం చేయించారు. పరిజనులు తమ తమ ఇంటి నుండి రకరకాల పదార్థాలు తీసుకువచ్చి యజ్ఞం అంటే కలసి పంచుకుతినటం అనే మాటను నిజం చేశారు.

## కారుమంచిలో

31.05.2009 గాయత్రీ గ్లోబల్ మహామంత్ర పురశ్చరణ సందర్భంగా కారుమంచి షిర్డి సాయిబాబా దేవాలయంలో జరిగిన సామూహిక జప కార్యక్రమంలో 54 మంది పాల్గొన్నారు.

★★★

**మేథాశక్తిని మించిన సంపద మరొకటి లేదు.**